శనివారం 15-6-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 84

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'


‘స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 84

శనివారం 15-6-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అదరగొట్టిన అఫ్గానిస్తాన్

7 వికెట్లతో పాపువా న్యూగినీపై గెలుపు.. ‘సూపర్–8’ దశకు అర్హత - 10లో



ఇండస్ నుంచి వొడాఫోన్ ఔట్!

టవర్స్ కంపెనీలో 21.5 శాతం వాటా విక్రయానికి రెడీ - 10లో



గుత్తాధిపత్యానికి తెరపడాలి

విధ్వంసకర సాంకేతికతను సృష్టించ కూడదని, సాంకేతికతో గుత్తాధిపత్యం పోవాలని జీ–7 సదస్సులో మోదీ అన్నారు.


వివరాలు 6లో ▸



నీట్‌పై సుప్రీం నోటీసులు

నీట్ పరీక్షపై దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు స్వీకరించి కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రానికి, ఎన్టీఏకి నోటీసులు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



జూలైలో పార్లమెంట్ సమావేశాలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 22 నుంచి ఆగస్ట్ 9వ తేదీ వరకు జరుగుతాయని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి.

వివరాలు 6లో ▸



వయనాడ్ నుంచి ప్రియాంక!

కేరళలోని వయనాడ్ నుంచి కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో ▸

రెడ్‌బుక్ రాజ్యాంగం

రాష్ట్రంలో హోర్డింగ్‌లకెక్కిన లోకేశ్ ‘రెడ్ బుక్’ బెదిరింపులు

బ్లాక్‌మెయిల్‌తో అధికారులను లొంగదీసుకునే యత్నం

- మరోవైపు రెచ్చిపోతున్న టీడీపీ, జనసేన శ్రేణులు
- రాష్ట్రమంతటా కొనసాగుతున్న విధ్వంసం, ఆటవిక దాడులు
- తమకు ఓటేయనివారు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యం
- నూతన సీఎంను కలవడానికి వెళ్లిన అధికారులకు అవమానాలు.. పనితీరు మదింపు పేరిట అధికారులకు ‘రాజకీయ’ బ్రాండింగ్
- వారంతా గతంలో బాబు హయాంలో పనిచేసిన వారే
- గత ఐదేళ్లుగా కొందరి తీరు అన్యాయంగా ఉందంటూ నిందలు
- కక్ష సాధింపులుండవంటూనే... కొందరు టార్గెట్‌గా చంద్రబాబు వ్యాఖ్యలు
- ఐఏఎస్, ఐపీఎస్‌ల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వ పెద్దల వైఖరి

2లో



గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన రెడ్‌బుక్ హోర్డింగ్

జగన్ ఓడాడు..
ఇంకా చావలేదు!

ఆయనను చచ్చేదాకా కొట్టాలి

టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడి విద్వేష వ్యాఖ్యలు

సోషల్ మీడియాలో వీడియో వైరల్

2లో



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అయ్యన్నపాత్రుడు వీడియో..

విలువలు, విశ్వసనీయతతో
ముందడుగు

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ఎంపీలకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

- మనం ఎదుర్కొంటున్న పరిస్థితులు తాత్కాలికమే
- మన పాలన – చంద్రబాబు పరిపాలనను ప్రజలు గమనిస్తూనే ఉంటారు
- కచ్చితంగా మనం మళ్లీ ప్రజల విశ్వాసాన్ని పొందుతాం
- ప్రజాహితమే పరమావధిగా పార్లమెంట్‌లో వ్యవహరించాలి
- రాష్ట్రం, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాల వారీగానే ఎవరికైనా మద్దతు



సాక్షి, అమరావతి: ‘‘రాష్ట్రంలో ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితులు తాత్కాలికమే. మన పరిపాలన – చంద్రబాబు పాలనను ప్రజలు బేరీజు వేసి గమనిస్తూనే ఉంటారు. కచ్చితంగా మనం తిరిగి ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతామనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. ఈలోగా మనం ధైర్యాన్ని కోల్పోకూడదు. విలువలు, విశ్వసనీయతతో ముందడుగు వేద్దాం’’ అని వైఎస్సార్‌సీపీ ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాహితమే పరమావధిగా పార్లమెంట్‌లో వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాలవారీగానే ఎవరికైనా మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ విధివిధానాల ప్రకారం అడుగులు వేస్తూ ప్రజల ఎదుట తలెత్తుకునేలా ఎంపీలు ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, పి.మిథున్‌రెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్..

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఘోర రోడ్డు ప్రమాదం



పొట్టకూటి కోసం తెల్లవారక ముందే బయలుదేరిన కూలీల బతుకులు తెల్లారిపోయాయి. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లిలో శుక్రవారం 216 నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు.

వివరాలు 11లో ▸

కొనసాగుతున్న ద్రోణి



రాయలసీమ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. మరోపక్క రుతుపవనాలు కూడా ఊపందుకోనుండటంతో ఏపీలో వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

వివరాలు 3లో ▸

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్



సాక్షి, అమరావతి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను నియమిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న అచ్చెన్నాయుడికి మంత్రి పదవి ఇవ్వడంతో ఆయన స్థానంలో పల్లాను నియమించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది.

టీటీడీ ఈవోగా శ్యామలరావు



సాక్షి, అమరావతి: టీటీడీ ఈవోగా సీనియర్ ఐఏఎస్ అధికారి జే.శ్యామలరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ పోస్టులో పనిచేసిన ఏవీ ధర్మారెడ్డి సెలవుపై వెళ్లగా, ఆయన స్థానంలో ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేస్తున్న శ్యామలరావును నియమించారు.

పవన్‌కి ‘పంచాయతీ’..
లోకేశ్‌కి విద్య, ఐటీ

మంత్రులకు శాఖలు కేటాయించిన సీఎం చంద్రబాబు

జగన్ బాటలో.. ఎస్సీ మహిళ అనితకు హోంశాఖ



పవన్‌కళ్యాణ్



అనిత



లోకేశ్

పయ్యావుల, అనగాని, కొల్లు, నిమ్మల, గొట్టిపాటికి కీలక శాఖలు

బీజేపీ నుంచి గెలిచిన సత్యకుమార్‌కు వైద్య, ఆరోగ్యం

నారాయణకు మళ్లీ మున్సిపల్ శాఖే

చంద్రబాబు వద్దే స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ

2లో

ఇదండీ సంగతి



నిజమే..ఎలక్షన్లు అయిపోయాయ్! అవసరం లేద్సార్! అయినా అక్కడ మనము గెలవలేదు!

ఆ 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయి!?



- వేసిన ఓటు ఎక్కడికి పోతోందోనని ప్రజల్లో అనుమానం
- ఈవీఎంలను గతంలో చంద్రబాబు వ్యతిరేకించినందున వాటి గోల్‌మాల్‌పై ఇప్పుడాయన మాట్లాడాలి
- ఏపీ ఫలితాలతోనే కేంద్ర ప్రభుత్వం కొలువుదీరిన పరిస్థితి ఏర్పడింది
- ఇదే మంచి అవకాశం.. రాష్ట్ర ప్రయోజనాలపై బాబు పోరాడాలి
- వైఎస్సార్‌సీపీ పనైపోయిందనుకోవద్దు
- 11 స్థానాలే వచ్చినా ఆ పార్టీ ఓట్ల శాతం బాగుంది
- అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగించాలి
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

5లో



కర్నూలు జిల్లా పూడిచెర్లలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం

యథేచ్ఛగా టీడీపీ దాడులు

పలు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం

జేసీబీతో జగనన్న లేఔట్‌లో విధ్వంసం

శిలాఫలకాలను పగలకొట్టిన టీడీపీ కార్యకర్తలు

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన దాష్టీకాలు

8లో

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసులో 9 మంది అరెస్టు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ సివిల్ కోర్టుల ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం చేసిన టీడీపీ నాయకుల్లో తొమ్మిదిమందిని పోలీసులు అరెస్ట్ చేశారు. న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు చూస్తుండగానే ఈ నెల 13వ తేదీ పట్టపగలే 14 మంది టీడీపీ నాయకులు ఈ దురాగతానికి పాల్పడ్డారు. బీరుసీసాలు, రాళ్లు, ఇతర మారణాయుధాలతో ఆటోలో వచ్చి ఒళ్లు గగుర్పొడిచేలా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మద్దెల పవన్, రాజేష్, శేఖర్‌లపై విరుచుకుపడి హత్యాయత్నం చేశారు. ఈ దాడిలో బాధితులకు తలపై బలమైన గాయాలు కావడంతో ప్రస్తుతం వారు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో ఒకరైన రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులు కొర సత్యనారాయణ, అరశంకల అశోక్, చింతజల్లు రమేష్‌బాబు, బాలబొమ్మ అయ్యప్ప, రాచూరు వెంకటేశ్వర్లు, రెడ్డిపల్లి కిరణ్‌కుమార్, రెడ్డిపల్లి సతీష్‌కుమార్, గుత్తి సూర్యనారాయణ, ఇమ్మిడి శివకృష్ణలను పోలీసులు అరెస్ట్ చేసి విజయవాడ ఒకటో ఏఎంఎం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు వారిని సబ్ జైలుకు తరలించారు. ఈ కేసులో మరో ఐదుగురిని అరెస్ట్ చేయాల్సి ఉందని సూర్యారావుపేట పోలీసులు తెలిపారు.

ప్రత్యేక మంత్రిత్వ శాఖపై ఎంఎస్‌ఎంఈల హర్షం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలకు ప్రత్యేకంగా ఒక మంత్రిని ఏర్పాటు చేయడంపై ఎంఎస్‌ఎంఈ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎంఎస్‌ఎంఈల కోసం కొండపల్లి శ్రీనివాస్‌ను మంత్రిగా నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. సీఎం చంద్రబాబు, ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్స్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి మురళీకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

విలువలు, విశ్వసనీయతతో ముందడుగు

▶ మొదటి పేజీ తరువాయి

మోపిదేవి వెంకటరమణ, ఎం.గురుమూర్తి, బీద మస్తాన్‌రావు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఆర్.కృష్ణయ్య, గొల్ల బాబూరావు, ఎస్.నిరంజన్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, డాక్టర్ చెట్టి తనూజరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే..

నాణ్యమైన విద్యతో పేదరికం శాశ్వతంగా నిర్మూలన..

గత ఐదేళ్ల పాటు ఎప్పుడూ చూడని మంచి పరిపాలన అందించాం. మేనిఫెస్టోలో హామీలు 99 శాతం అమలు చేశాం. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇలా ఎప్పుడూ ఎవరూ చేయలేదు. చిత్తశుద్ధితో మేనిఫెస్టోను అమలు చేశాం. ఏ నెలలో ఏం ఇవ్వబోతున్నామో క్యాలెండర్ ప్రకటించి మరీ అమలు చేశాం. ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థలను దారుణంగా దెబ్బ తీసిన కోవిడ్ లాంటి సంక్షోభాలు ఎదురైనప్పటికీ ఆ సవాళ్లను అధిగమించి ప్రజలకు మంచి చేశాం. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో ఎప్పుడూ చూడని సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రజల ఇంటివద్దకే పరిపాలనను తీసుకెళ్లాం. అవినీతికి చోటులేకుండా, వివక్ష చూపకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేశాం. అర్హులందరికీ ప్రభుత్వ నుంచి ప్రయోజనాలు అందించాం. విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చి పేదరికం నిర్మూలన దిశగా అడుగులు వేశాం. భవిష్యత్తు తరాలను ప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు ఇంగ్లిష్ మీడియం, టోఫెల్, ఆరో తరగతి నుంచి ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్) ద్వారా బోధన, ఎనిమిదో తరగతి నుంచి ట్యాబ్‌లు అందచేశాం. ఐబీ సిలబస్ కూడా తెచ్చాం. ప్రఖ్యాత అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను విద్యార్థులకు అందించాం. నాణ్యమైన విద్య అందించడం ద్వారా పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే దిశగా ఐదేళ్లలో అడుగులు వేశాం.

శకుని పాచికల్లా ఫలితాలు..

సోషల్ ఇంజనీరింగ్‌లో భాగంగా ఎప్పుడూ చూడని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అవకాశాలు కల్పించాం. ఇన్ని గణనీయమైన మార్పులు తెచ్చినప్పటికీ ఎన్నికల ఫలితాలు ఇలా వచ్చాయంటే చాలా ఆశ్చర్యమేస్తోంది. శకుని పాచికలు మాదిరిగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయనిపిస్తోంది. ఏం జరిగిందో దేవుడికే తెలియాలి.

నాడు మద్దతిచ్చి నేడు విషప్రచారం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెచ్చింది. దీనికి అనుగుణంగా రాష్ట్రంలో ఆ యాక్ట్ తెచ్చినప్పుడు అసెంబ్లీ సాక్షిగా టీడీపీ కూడా మద్దతు పలికింది. అమెరికా, యూరప్ దేశాల్లో అనుసరిస్తున్న మంచి విధానాలన్నీ ఇందులో ఉన్నాయని సభ సాక్షిగా ప్రశంసలు కురిపించింది.



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో ఆ పార్టీ ఎంపీలు

ప్రజలపై సంపూర్ణ విశ్వాసం..

వైఎస్సార్ సీపీని నమ్ముకుని కొన్ని కోట్ల కుటుంబాలున్నాయి. లక్షల మంది కార్యకర్తలు పార్టీపై ఆధారపడి ఉన్నారు. వేల మంది నాయకులు పార్టీలో ఉన్నారు. అనుకున్న లక్ష్యాల దిశగా పార్టీ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికల్లో మనకు 40 శాతం ఓట్లు వచ్చాయి. గత ఎన్నికలతో పోలిస్తే పది శాతం ఓట్లు తగ్గాయి. రానున్న రోజుల్లో ఈ పది శాతం ప్రజలే మన పాలనకు, ఇప్పటి ప్రభుత్వ పాలనకు తేడాను గుర్తిస్తారనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ మన ప్రభుత్వం చేసిన మంచి కనిపిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో మనలో ధైర్యం, పోరాట పటిమ సన్నగిల్లకూడదు. నా వయసు చిన్నదే. నాలో సత్తువ ఏమాత్రం తగ్గలేదు. 14 నెలలు పాదయాత్ర చేశా. దేవుడి దయ వల్ల అన్ని రకాల పోరాటాలు చేసే శక్తి ఉంది. ప్రజలు మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తారనే సంపూర్ణ విశ్వాసం, నమ్మకం నాకు ఉంది.

సరిగ్గా ఎన్నికల సమయంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఒక భూతంలా చూపించి టీడీపీ, కూటమి పార్టీలు విష ప్రచారం చేశాయి. ఈ చట్టాన్ని తేవడం అంత సులభమైన విషయం కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 వేలమంది సర్వేయర్లను నియమించింది. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా ఎలాంటి మోసాలకు ఆస్కారం లేని పరిస్థితులు ఈ చట్టం వల్ల వస్తాయి. చరిత్రలో తొలిసారిగా భూ పత్రాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. పత్రాల విషయంలో తప్పులు జరిగితే సదరు వ్యక్తికి ప్రభుత్వమే పరిహారం చెల్లిస్తుంది. గతంలో తాము మద్దతు పలికిన చట్టాన్ని టీడీపీ వాళ్లు ఇప్పుడు తీసేస్తామంటున్నారు. వారు చేస్తున్న రాజకీయాలు ఎలా ఉంటాయో దీన్ని బట్టి తెలుస్తుంది.

ఐదేళ్లు ఇట్టే గడిచిపోతాయి..

పార్లమెంట్‌లో మనకు 11 మంది రాజ్యసభ సభ్యులు, నలుగురు లోక్‌సభ సభ్యులున్నారు. మొత్తంగా 15 మంది ఎంపీలు మన పార్టీకి ఉన్నారు. టీడీపీకి 16 మంది ఉన్నారు. అందువల్ల మన పార్టీ చాలా బలమైనదే. మనల్ని ఎవరూ, ఏమీ చేయలేరు. మనం ధైర్యంగా నిలబడి ప్రజల తరపున పోరాటం చేయాలి. ఐదేళ్లు ఇట్టే గడిచిపోతాయి.

పార్లమెంటరీ పార్టీ నేతగా వైవీ సుబ్బారెడ్డి..

గతంలో మాదిరిగానే రాజ్యసభలో పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డి కొనసాగుతారు. లోక్‌సభలో మన పార్టీ నాయకుడిగా మిథున్‌రెడ్డి వ్యవహరిస్తారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వైవీ సుబ్బారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తారు. అందరికీ నేను అందుబాటులో ఉంటా. ఎంపీలంతా కలసి కూర్చుని చర్చించుకుని ఆ మేరకు అడుగులు ముందుకేయాలి. పార్టీ పరంగా వ్యవహరించాల్సిన అంశాలపై పరస్పరం చర్చించుకుని నిర్ణయాలు తీసుకోండి. ఎంపీలుగా మీరు వేసే ప్రతి అడుగూ పార్టీ ప్రతిష్టను పెంచేదిగా ఉండాలి. మన పార్టీకి ఒక సిద్ధాంతం, గుర్తింపు ఉన్నాయి. పార్టీ కోసం కష్టపడండి. పార్టీ మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటుంది.

ప్రజల్లోనే ఉంటాం.. కేడర్‌ను కాపాడుకుంటాం

- 2029లో ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటారు
- వైఎస్ జగన్ అడుగులో అడుగేసి ముందుకు సాగుతాం
- వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

సాక్షి, అమరావతి: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. చంద్రబాబు మోసపూరిత నైజాన్ని ప్రజలు తొందరగానే తెలుసుకుంటారని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటాం.. కార్యకర్తలకు అండగా ఉండి వారిని కాపాడుకుంటామని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

రాష్ట్రంలో అత్యంత భయానక పరిస్థితులు..

గెలిచిన మరుక్షణం నుంచే చంద్రబాబు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న విషయాన్ని ప్రజలందరూ గుర్తిస్తున్నారు. పది రోజులుగా టీడీపీ చేస్తున్న దాడులతో ఆంధ్ర రాష్ట్రంలో అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై దాడులుచేస్తూ, చంద్రబాబు తిరిగి మాపైనే దుష్ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాళ్లు, కష్టాలు, నష్టాలు కొత్తకాదు. ఎన్నో చూశాం ఎదుర్కొన్నాం, ప్రజల్ని సంఘటితం చేశాం.. విజయం సాధించాం. ఈ ఐదేళ్లు కూడా తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అడుగులో అడుగేసి ముందుకు సాగుతూ ప్రజలను మళ్లీ సంఘటితం చేసి, చంద్రబాబు ఆరాచకపాలనపై పోరాడుతాం. 2029లో ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటారు. దాడులపై ఫిర్యాదు తీసుకోవడానికే అధికారులు భయపడుతున్న పరిస్థితి ఇప్పుడు చంద్రబాబు పాలనలో నెలకొంది. నిజానికి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడిచేయండని చంద్రబాబే స్వయంగా ఆదేశించాడని టీడీపీ నేతలే చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో టీడీపీ దాడులను అడ్డుకునే వ్యవస్థలే కనిపించడంలేదు. పోలీస్ వ్యవస్థ నీరుగారిపోయి, నిస్తేజంగా మారి పనిచేయడం మానేసింది.

వీసీలు, రిజిస్ట్రార్లపైనా దాడులు..

టీడీపీ వాళ్లు చివరికి విశ్వవిద్యాలయాలనూ వదలడంలేదు. వైస్‌ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లపైనా దాడులు, వీసీలలో ఉన్న బీసీలను తరిమితరిమి కొడుతున్నారు. ఇదేనా టీడీపీ పాలనా విధానం? తమకు కిట్టని వారిని పట్టుకుని దాడులుచేసి వాటిని వీడియో తీసి సోషల్ మీడియాలో పెడుతున్నారు. బంగారం లాంటి రాష్ట్రాన్ని టీడీపీ తగలబెడుతోంది. మంగళగిరిలో లోకేశ్ మనుషులు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తపై అమానుషంగా దాడిచేశారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంతో పాటు దేశానికే అవమానకరం. ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్న కూటమిలో టీడీపీతో పాటు బీజేపీ, జనసేన కూడా భాగస్వాములే. చివరికి టీవీ–9, ఎన్టీవీ, సాక్షి టీవీలను కూడా అణిచివేస్తున్నారు. రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతల గురించి ప్రజలందరూ ఆలోచించాలి.

పవన్‌కు 'పంచాయతీ'.. లోకేశ్‌కి విద్య, ఐటీ

మంత్రులకు శాఖలు కేటాయించిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ఈ నెల 12వ తేదీన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి శాఖలు కేటాయించిన నేపథ్యంలో ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. జనసేన అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి హోదాతో పంచాయతీరాజ్ – గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. నారా లోకేశ్‌కు విద్యా శాఖ (మానవ వనరుల అభివృద్ధి)తోపాటు ఐటీ శాఖ కేటాయించారు. గతంలోనూ ఆయన ఐటీ శాఖ నిర్వహించారు. కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌కు కీలక శాఖలు లభించాయి.

రాజధాని వ్యవహారాలు మళ్లీ నారాయణకే!

పాయకరావుపేట నుంచి గెలిచిన టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వంగలపూడి అనితకు ప్రాధాన్యమైన హోంశాఖ దక్కింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వంలో తొలిసారిగా దళిత మహిళకు హోంమంత్రి పదవి కట్టబెట్టిన విషయం తెలిసిందే. తొలిసారి మేకతోటి సుచరిత, రెండోసారి తానేటి వనితకు హోంశాఖ ఇచ్చి సామాజిక న్యాయం, మహిళా సాధికారతను చాటుకున్నారు. ఇప్పుడు అదే బాటలో సీఎం చంద్రబాబు దళిత మహిళకు హోంశాఖ ఇచ్చారు. ఇక పీఏసీ ఛైర్మన్‌గా పని చేసిన పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ లభించింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చురుగ్గా వ్యవహరించిన నిమ్మల రామానాయుడుకు జలవనరుల శాఖను అప్పగించారు. రేపల్లె నుంచి మూడోసారి గెలిచిన అనగాని సత్యప్రసాద్‌కు రెవెన్యూ శాఖ బాధ్యతలు కేటాయించారు. పొంగూరు నారాయణకు మళ్లీ మున్సిపల్ శాఖ దక్కింది. 2014–19 మధ్య మున్సిపల్ శాఖ మంత్రిగా రాజధాని వ్యవహారాలన్నింటినీ ఆయన చక్కబెట్టారు. ఇప్పుడు మరోసారి అదే శాఖ ఇవ్వడంతో రాజధాని కార్యకలాపాలు నారాయణే నిర్వహిస్తారని స్పష్టమవుతోంది. బీజేపీ తరపున గెలిచి మంత్రివర్గంలో చేరిన సత్యకుమార్‌కు వైద్య, ఆరోగ్య శాఖ అప్పగించారు. జనసేనకు చెందిన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్‌కి పౌరసరఫరాల శాఖ కేటాయించారు.

శాఖల్లో స్వల్ప మార్పులు

కొత్త ప్రభుత్వం కొలువుదీరాక శాఖల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ, డ్వాక్రా వ్యవహారాలకు సంబంధించి 'సెర్ప్'ను పంచాయతీరాజ్ శాఖ నుంచి విడదీసి చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి పరిధిలోకి తెచ్చారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ విభాగాలు సాధారణంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉంటాయి. తాజాగా వాటిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి అప్పగించారు. పరిశ్రమల శాఖను రెండుగా విభజించి భారీ పరిశ్రమలు–వాణిజ్యం ఒకరికి కేటాయించగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మరొకరికి అప్పగించారు. ఇక విద్యా శాఖ పేరును మానవ వనరుల అభివృద్ధి శాఖగా మార్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖను ఎవరికీ కేటాయించకపోవడం గమనార్హం. ఈ శాఖలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాల వ్యవహారాల్లోనే విపక్షంలో ఉండగా చంద్రబాబు జైలుకు వెళ్లిన విషయం విదితమే.

సాంఘిక సంక్షేమం పరిధిలో సచివాలయాలు

వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి అప్పగించడం చర్చనీయాంశమైంది. ఐదేళ్ల క్రితం కొత్తగా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఏర్పాటైంది. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం, 50 నుంచి 70 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున నియమించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దే పౌర సేవలు, పథకాలు అందించడం తెలిసిందే. 1.21 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 2.65 లక్షల మందిని వలంటీర్లుగా నియమించింది. ఈ వ్యవస్థను ఇప్పుడు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి అప్పగించడంతో దానికి అనుబంధంగా నిర్వహిస్తారని చెబుతున్నారు. సచివాలయ వ్యవస్థలోనూ భారీ మార్పులు ఉండవచ్చనే ప్రచారం జరుగుతోంది.

శాఖల కేటాయింపు ఇలా..

- నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి – సాధారణ పరిపాలన శాఖ, శాంతి భద్రతలు, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ (మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు)
- కొణిదెల పవన్ కళ్యాణ్ (ఉప ముఖ్యమంత్రి) – పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ త్రాగునీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ
- నారా లోకేశ్ – మానవ వనరులు (విద్యా శాఖలన్నీ), ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్‌టీజీ (రియల్ టైమ్ గవర్నెన్స్)
- కింజరాపు అచ్చెన్నాయుడు – వ్యవసాయం, సహకార శాఖ, మార్కెటింగ్, పశు సంవర్థక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్య శాఖ
- కొల్లు రవీంద్ర – గనులు, భూగర్భ శాఖ, ఎక్సైజ్ శాఖ
- పి.నారాయణ – మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి
- నాదెండ్ల మనోహర్ – ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
- వంగలపూడి అనిత – హోం, విపత్తు నిర్వహణ శాఖ
- సత్యకుమార్ యాదవ్ – వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య
- నిమ్మల రామానాయుడు – జలవనరుల శాఖ
- ఎన్.ఎమ్.డి.ఫరూక్ – మైనార్టీ సంక్షేమం, న్యాయ శాఖ
- ఆనం రామనారాయణరెడ్డి – దేవదాయ శాఖ
- పయ్యావుల కేశవ్ – ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలు
- అనగాని సత్యప్రసాద్ – రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు– స్టాంపులు
- డోలా బాలవీరాంజనేయస్వామి – సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ
- కొలుసు పార్థసారథి – గృహ నిర్మాణం, సమాచార శాఖ
- గొట్టిపాటి రవికుమార్ – విద్యుత్ శాఖ
- కందుల దుర్గేష్ – పర్యాటక, సాంస్కృతిక శాఖ, సినిమాటోగ్రఫీ
- గుమ్మడి సంధ్యారాణి – గిరిజన, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ
- బీసీ జనార్థన్ రెడ్డి – రోడ్లు–భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు
- టీజీ భరత్ – పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్
- ఎస్.సవిత – బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, చేనేత, జౌళి
- వాసంశెట్టి సుభాష్ – కార్మిక, ఫ్యాక్టరీస్, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్
- కొండపల్లి శ్రీనివాస్ – చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలు
- మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి – రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు

స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు?

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడికి అసెంబ్లీ స్పీకర్ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. పార్టీలో సీనియర్ నాయకుడు అవడంతోపాటు గతంలో పలుసార్లు మంత్రిగా పని చేసిన అయ్యన్నకు మంత్రివర్గంలో కచ్చితంగా చోటు దక్కుతుందని అంతా భావించారు. అయితే సీఎం చంద్రబాబు ఆయనకు పదవి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఆయనకు స్పీకర్ పదవి ఇచ్చేందుకు చంద్రబాబు సుముఖంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. శుక్రవారం ఆయన చంద్రబాబును కలిశారు. ఈ సమయంలో స్పీకర్ పదవి ఇస్తానని చంద్రబాబు ఆయనకు చెప్పినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు.

టీడీపీ నేతలకు గవర్నర్ పదవులు?

ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కీలకంగా ఉండడంతో ఒకటి, రెండు గవర్నర్ పదవులు దక్కే అవకాశం ఉందని సమాచారం. టీడీపీలో సీనియర్ నేతలు అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడి పేర్లను గవర్నర్ పదవుల కోసం చంద్రబాబు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యనమల రామకృష్ణుడు శుక్రవారం చంద్రబాబును కలవగా ఈ విషయం చెప్పి అవకాశం ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు మంత్రి పదవి ఆశించిన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను శాసన సభలో చీఫ్ విప్ పదవికి పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

నీటి పారుదల శాఖపై సీఎం చంద్రబాబు శుక్రవారం సమీక్ష చేశారు. వెలగపూడి సచివాలయంలో జరిగిన సమీక్షలో పోలవరం సహా వివిధ ప్రాజెక్టులపై ఉన్నతాధికారులతో చర్చించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారని, ఆ తర్వాత మంత్రివర్గ, అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఆరుద్ర కుమార్తె వైద్యానికి రూ.5 లక్షలు!

శుక్రవారం సచివాలయంలో కాకినాడకు చెందిన ఆరుద్ర అనే మహిళ తన కుమార్తెతో కలిసి సీఎం చంద్రబాబును కలిసి న్యాయం చేయాలని కోరింది. స్పందించిన చంద్రబాబు ఆమె కుమార్తె ఆరోగ్య ఖర్చుల కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం, ప్రతి నెలా రూ.10 వేల పింఛను ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం

సాక్షి, అమరావతి: రాజకీయ ప్రత్యర్థులపై ఇటు ఆటవిక దాడులు కొనసాగిస్తూ అటు రాజ్యాంగాన్ని కాలరాసి నారా లోకేశ్ రాసుకున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలుకు రంగం సిద్ధమవుతోంది! రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌బుక్ హోర్డింగ్‌ల ఏర్పాటుతో తాము మరింతగా కొనసాగించనున్న విధ్వంసకాండ, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనను టీడీపీ నిర్భీతిగా చాటింపు వేస్తోంది. రాజ్యాంగ హక్కులు కాలరాస్తూ ఆ కుట్రకు సీఎం హోదాలో చంద్రబాబు స్వయంగా తెర తీయడం విస్తుగొలుపుతోంది. ఐఏఎస్ అధికారులే లక్ష్యంగా బ్లాక్ మెయిలింగ్, వేధింపులకు ఆయన శ్రీకారం చుట్టారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను అమలు చేసే అధికారులను పనితీరు మదింపు నివేదికల పేరుతో లొంగదీసుకోవడం, అనంతరం తమ అక్రమాలకు వారిని సాధనంగా చేసుకోవడమే లక్ష్యంగా ఈ కుట్రకు అంకురార్పణ చేశారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో చోటు చేసుకోనున్న విపరిణామాలు, అక్రమాలు, బీభత్సకాండకు అధికార యంత్రాంగంతో నిర్వహించిన మొదటి సమావేశంలోనే చంద్రబాబు స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఒకవైపు తమకు ఓటేయనివారు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులను కొనసాగిస్తూ మరోవైపు అధికార యంత్రాంగాన్ని సొంత అజెండా అమలుకు వాడుకునేందుకు సన్నద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

అటు వ్యాజ్యాలు.. ఇటు వార్నింగ్‌లు

రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు మంత్రి నారా లోకేశే బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా లోకేశ్ ఫొటోలతో రెడ్ బుక్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి టీడీపీ సర్కారు భయోత్పాతం సృష్టిస్తోంది. ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆ నాయకుడి ఫొటోలతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ. టీడీపీ మాత్రం 'రెడ్ బుక్' పేరుతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం వారి హింసాత్మక ప్రవృత్తిని బట్టబయలు చేస్తోంది. మంగళగిరి, విజయవాడ, గుంటూరుతోపాటు రాష్ట్రంలో పలు నగరాలు, పట్టణాల్లో ఈ హోర్డింగులు వెలిశాయి. ఎన్నికలకు ముందే 'రెడ్‌బుక్' పేరుతో అధికారులపై లోకేశ్ బెదిరింపులకు పాల్పడ్డారు. నిబంధనల మేరకు వ్యవహరించిన ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. అందరి పేర్లు రెడ్‌బుక్‌లో రాస్తున్నానని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వారి సంగతి తేలుస్తానని, అంతు చూస్తానని హెచ్చరించారు. అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులను ఇలా బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదని అప్పట్లోనే రాజకీయ పరిశీలకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు కూడా కొనసాగుతున్నాయి. వీటిని బేఖాతర్ చేస్తూ టీడీపీ తన కుట్రలకు పదును పెడుతోంది.

పచ్చమూకల విధ్వంసకాండ

బీజేపీతో పొత్తును ఆసరాగా చేసుకుని టీడీపీ రౌడీ మూకలు ఎన్నికలకు ముందే విధ్వంసకాండకు తెరతీశాయి. సమర్థంగా పని చేస్తున్న పోలీసు అధికారులను ఎన్నికల కమిషన్(ఈసీ) ద్వారా బదిలీ చేయించి మరీ గూండాగిరీకి పాల్పడ్డాయి. పోలింగ్ ముందు రోజు, అనంతరం దాడులు, దౌర్జన్యాలతో రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేశాయి. అల్లరి మూకలు కర్రలు, కత్తులు, రాడ్లు చేతబట్టి విరుచుకుపడ్డాయి. బాంబు దాడులకు దిగాయి. ఎన్నికల్లో విజయం సాధించాక టీడీపీ సాగిస్తున్న దౌర్జన్యకాండ యావత్ దేశాన్ని విభ్రాంతికి గురి చేస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇంటింటికి రేషన్ సరఫరా చేసే వాహనాలను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్ విగ్రహాలను నేలమట్టం చేస్తున్నారు. టీడీపీ గూండాల విధ్వంసకాండతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గ్రామాలను విడిచి వెళ్లిపోతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. ఎన్నికల విధుల కోసం వచ్చిన కేంద్ర భద్రతా బలగాలు రాష్ట్రంలో ఉండగానే పరిస్థితిలా ఉంటే.. తర్వాత ప్రభుత్వ పెద్దలు ఎలా వ్యవహరించనున్నారో స్పష్టమవుతోంది.

వేధించే పన్నాగం

అఖిలభారత సర్వీసు అధికారులపై రాజకీయ ముద్ర వేసి వేధించాలని ఎన్నికల ముందే రూపొందించిన కుట్ర అమలుకు సన్నద్ధం కావడం ప్రభుత్వ పెద్దల దురుద్దేశాన్ని వెల్లడిస్తోంది. 40 ఏళ్ల అనుభవజ్ఞుడినని చెప్పుకుంటూ నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబుకు అఖిలభారత సర్వీసు అధికారుల విధి విధానాల గురించి పూర్తిగా తెలుసు. ప్రభుత్వాలు ప్రతి ఐదేళ్లకు మారుతుంటాయి గానీ రాష్ట్రానికి కేటాయించిన అఖిల భారత సర్వీసు అధికారులు కొనసాగుతుంటారు. వారి సేవలను సమర్థంగా వినియోగించుకుంటూ మంచి పరిపాలన అందించడం ప్రభుత్వం బాధ్యత. అందుకు విరుద్ధంగా చంద్రబాబు రాజకీయ కక్షతోనే కొందరు అధికారులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు తెగబడేందుకు సిద్ధమవుతుండటం విస్మయపరుస్తోంది. ఎన్నికల ఫలితాల తరువాత తనకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన కొందరు అధికారులను కలవకుండా వెనక్కి పంపారు. కొందరు అధికారులు ఇచ్చిన పూల బొకేలను సైతం తీసుకునేందుకు తిరస్కరించారు. ఇక తనను గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు సీఎం స్థాయికి తగినట్టుగా లేవని పరిశీలకులంటున్నారు. గత ఐదేళ్లలో కొందరు అధికారుల తీరు అన్యాయంగా ఉందని సీఎం నిందలు వేశారు. తనకు జరిగిన అన్యాయంపై మాట్లాడటం లేదంటూనే తన అక్కసునంతా వెళ్లగక్కి వ్యక్తిగత అజెండాను బయటపెట్టారు. కక్ష సాధింపులుండవంటూనే కొందరు అధికారులు టార్గెట్‌గా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారు.

సమాచార సేకరణలో బాబు బృందం

అఖిల భారత సర్వీసు అధికారులను వేధించే కుట్రకు చంద్రబాబు తెరతీశారు. తమవారు ఎవరు? పరాయి వారు ఎవరు? అనే సమాచారం సేకరించాలని తన బృందాన్ని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి రాష్ట్రస్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వరకు సమాచారాన్ని సేకరించే పనిలో చంద్రబాబు బృందం నిమగ్నమైంది. ఆ విషయాన్ని టీడీపీ వర్గాలు బహిరంగంగానే వెల్లడిస్తున్నాయి. తద్వారా అధికారులను బ్లాక్‌మెయిల్ చేయాలన్నది అసలు ఉద్దేశం. నిబంధనలకు విరుద్ధంగా తాము పురమాయించే పనులు చేసేలా లొంగదీసుకునే కుట్రతో ఈ తతంగాన్ని సాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఐదేళ్లూ తాము ఏం చెబితే అదే చేయాలి! నిబంధనలు ఉటంకిస్తూ అభ్యంతరాలు చెప్పకూడదు! అనే సందేశాన్ని దీని ద్వారా ఇవ్వనున్నారు. అందుకు సమ్మతించే అధికారులకే పోస్టింగులిస్తామని, లేదంటే వేధిస్తామని చెబుతుండటం చంద్రబాబు కుట్రను బట్టబయలు చేస్తోంది.

జగన్ ఓడాడు.. ఇంకా చావలేదు!

అయ్యన్న విద్వేష వ్యాఖ్యలు

''జగన్ ఓడిపోయాడు కానీ ఇంకా చావలేదు'' అంటూ టీడీపీ సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యల వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'వాడు ఓడిపోయాడు కానీ చావలా..! అపారమైన ధన బలం ఉంది.. కుల బలం ఉంది.. పక్కన తెలంగాణ ప్రభుత్వంలో వీడి మనుషులు ఉన్నారు' అని ఓ వ్యక్తి అందులో అయ్యన్నతో వ్యాఖ్యానించాడు. దీనిపై అయ్యన్న ప్రతిస్పందిస్తూ.. 'చచ్చేదాక కొట్టాల! ఈయన చెప్పింది కరెక్టే. ఓడిపోయాడు కానీ చావలేదు. చాలా మంచి డైలాగ్ ఇది' అని పేర్కొన్నారు. ఓడిపోయాడు కానీ చావలేదనే డైలాగ్ తనకు బాగా నచ్చిందంటూ అయ్యన్న వ్యాఖ్యానించారు. పామును చచ్చేవరకు కొట్టాలనే డైలాగ్‌ను తాను బయట మాట్లాడేటప్పుడు వాడతానంటూ తన నైజాన్ని చాటుకున్నారు.

ఇదేనా పెద్దరికం?

ప్రభుత్వ పెద్దననే విషయాన్ని మరచిపోయి సీఎం చంద్రబాబు కక్ష పూరితంగా వ్యవహరిస్తుండటం విస్మయపరుస్తోంది. 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు ప్రభుత్వంలో లోకేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో సీనియర్ ఐఏఎస్ అధికారి జవహర్‌రెడ్డి ఆ శాఖ అధిపతిగా వ్యవహరించారు. ఇటీవల ఎన్నికల సమయంలో ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలోనూ అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ ఆయన నిబంధనల మేరకే విధులు నిర్వర్తించారు. అయితే చంద్రబాబు రాజకీయ కారణాలతో సీఎస్‌గా ఉన్న జవహర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని అవాస్తవ ఆరోపణలు చేశారు. ఆయన్ను బదిలీ చేయాలని ఈసీకి ఫిర్యాదులు చేశారు. ఆ ఆరోపణల్లో వాస్తవాలు లేపోవడంతో ఈసీ ఆయన్ను బదిలీ చేయలేదు. ఎన్నికల ముందు సామాజిక పెన్షన్ల పంపిణీలోనూ ఈసీ ఆదేశాలనే ఆయన పాటించారు. అయినా సరే చంద్రబాబు ఆయనపై చిందులు తొక్కారు. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించాక సీఎంగా బాధ్యతలు స్వీకరించకముందే జవహర్‌రెడ్డిని సెలవుపై వెళ్లిపోవాలని ఒత్తిడి తేవడం గమనార్హం. ఈ నెలాఖరున జవహర్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్నారు. తాను బాధ్యతలు స్వీకరించే నాటికి జవహర్‌రెడ్డి విధుల్లో ఉండకూడదని చంద్రబాబు పట్టుబట్టి మరీ వేధించడం గమనార్హం.

బాబు పేషీ అధికారులకూ జగన్ కీలక పోస్టింగ్‌లు

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను జగన్ తన ప్రభుత్వంలో కీలక స్థానాల్లో పోస్టింగులిచ్చారు. చంద్రబాబు పేషీలో పనిచేసిన సాయిప్రసాద్‌ను కీలకమైన సీసీఎల్‌ఏగా నియమించారు. ఆయన పేషీలో పనిచేసిన అధికారులకు వైద్య ఆరోగ్య శాఖ, రోడ్లు–భవనాలు, రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల బాధ్యతలు అప్పగించారు. టీడీపీ హయాంలో ఆర్థిక శాఖలో పనిచేసిన అధికారులనే జగన్ తన ప్రభుత్వ హయాంలోనూ కొనసాగించారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్ చేతిలో చేతిలో కాగితాన్ని బలవంతంగా లాక్కున్న ఐఏఎస్ అధికారికి కూడా కీలకమైన పోస్టింగ్ ఇచ్చి ప్రాధాన్యం కల్పించారు.

సముద్ర జలాల్లో శాంతి స్థాపనే లక్ష్యం

- భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేస్తాం
- సరిహద్దు భద్రతపై ప్రభుత్వం ప్రధాన దృష్టి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా విశాఖకు..


నేవీ సిబ్బందితో కరచాలనం చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల్లో శాంతి స్థాపనే తమ లక్ష్యమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సురక్షిత నౌకాయానం , రూల్–బేస్డ్ వరల్డ్ ఆర్డర్, యాంటీ పైరసీ, హిందూ మహా సముద్ర ప్రాంత(ఐవోఆర్) పరిధిలో శాంతి– స్థిరత్వం ప్రధాన ప్రాధాన్యతలుగా తీసుకుంటామని స్పష్టం చేశారు. రెండో సారి రక్షణ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌నాథ్‌సింగ్ తొలి పర్యటన విశాఖలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర భద్రతను మరింత పటిష్టం చేస్తామన్నారు. ఇండియన్ నేవీ ఉనికిని మరింత ప్రభావవంతంగా చేయడంపై దృష్టి సారిస్తానని చెప్పారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారత్‌కు చెందిన స్నేహపూర్వక దేశాలు సురక్షితంగా ఉంటూ పరస్పర ప్రగతి పథంలో కలిసి ముందుకు సాగేలా ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. దేశ అభివృద్ధిలో నౌకాదళం కీలక పాత్ర పోషిస్తోందనీ.. అంతర్జాతీయ వేదికగా భారత నౌకాదళ ఖ్యాతి పెరుగుతోందని ప్రశంసించారు. ఆర్థిక, సైనిక శక్తి ఆధారంగా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఏ దేశం ప్రమాదంలో పడకుండా వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి కలిగిన భారత నౌకాదళం భరోసానిస్తోందన్నారు.

పాక్ పౌరుల్ని రక్షించి మానవత్వాన్ని ప్రపంచానికి చాటింది

ఈ ఏడాది మార్చిలో అరేబియా సముద్రంలో 23 మంది పాకిస్తానీ పౌరులను సోమాలి సముద్రపు దొంగల బారి నుంచి విడిపించినప్పుడు నేవీ సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ తీరు ప్రశంసనీయమన్నారు. జాతీయత, శత్రుత్వంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి సహాయం చేసేలా ఇండియన్ నేవీ సిబ్బంది వ్యవహరిస్తూ.. మానవత్వ విలువల్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారని కొనియాడారు. భారతదేశ వాణిజ్య ప్రయోజనాలు ఐవోఆర్‌తో ముడిపడి ఉన్నాయనీ, విస్తృత జాతీయ లక్ష్యాలను సాధించేందుకు నౌకాదళం సముద్ర సరిహద్దులను సంరక్షించడంలో ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. పెరుగుతున్న పారిశ్రామిక మౌలిక సదుపాయాల ద్వారా భారత నౌకాదళం నిరంతరం బలపడుతోందన్నారు. షిప్‌యార్డ్‌లు విస్తరిస్తున్నాయనీ, విమాన వాహక నౌకలు బలోపేతమవుతున్నాయన్నారు. ఇండియన్ నేవీ కొత్త శక్తివంతమైన శక్తిగా అభివృద్ధి చెందుతోందన్నారు.

ఘన స్వాగతం

తొలుత విశాఖలోని నేవల్ ఎయిర్ బేస్ ఐఎన్‌ఎస్ డేగాకు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠితో కలిసి చేరుకున్న రక్షణ మంత్రికి ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఘన స్వాగతం పలికారు. 50 మందితో కూడిన గార్డ్ ఆఫ్ హానర్‌తో సాదర స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రానికి చేరుకున్న ఆయన ఐఎన్‌ఎస్ జలాశ్వలో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ నౌకలు, జలాంతర్గాములు, నేవల్ కమాండ్ విమానాల ద్వారా డైనమిక్ కార్యకలాపాలను వీక్షించారు, తూర్పు సముద్ర తీరంలో భారత నౌకాదళం కార్యాచరణ సంసిద్ధతని రాజ్‌నాథ్‌సింగ్ సమీక్షించారు. 'డే ఎట్ సీ' ముగింపులో భాగంగా సబ్మెరైన్ ఫ్లీట్ సిబ్బందితో కలిసి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భోజనం చేశారు. గౌరవ వీడ్కోలు అనంతరం.. ఐఎన్‌ఎస్ డేగాకు చేరుకొని ఢిల్లీకి పయనమయ్యారు.

ఉద్యాన వ్యర్థాల నుంచి సంపద సృష్టి

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ టీ జానకీరామ్


ప్రాజెక్టు పత్రాలను డాక్టర్ డీఆర్ సలోమి సునీతకు అందజేస్తున్న ఉద్యాన వర్శిటీ వీసీ డాక్టర్ జానకీ రామ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో గోదావరి క్లస్టర్ యూనివర్సిటీల ద్వారా ఉద్యాన వ్యర్థాలతో సంపద సృష్టించి అదనపు ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ జనకీరామ్ స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం ఎస్‌ఐటీ, రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీతో కలిసి ఉద్యాన వర్సిటీ సంయుక్తంగా 'వేస్ట్ టూ వెల్త్' అనే అంశంపై తగిన సాంకేతికత అభివృద్ధి చేసే ప్రాజెక్టు చేపట్టిందని చెప్పారు. రూ.10 లక్షల అంచనాతో రెండేళ్ల వ్యవధిలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టు పత్రాలను శుక్రవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్, వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాల బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డి.ఆర్.సలోమి సునీతకు ఆయన అందజేశారు. డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యూ నుంచి డా. సలోమి సునీతతో పాటుగా ఎస్‌ఐటీ బయోటెక్నాలజీ విభాగం నుంచి డా. టి.జగన్‌మోహన్ రావు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం జువాలజీ విభాగం నుంచి డా. టి. విజయనిర్మల కలిసి ఈ ప్రాజెక్టును నిర్వహించనున్నారు. వీసీ జానకీ రామ్ మాట్లాడుతూ సమాజ ఆరోగ్యాన్ని పరిరక్షించే ఈ ప్రాజెక్టు చాలా ప్రయోజనకరమని, ఆ దిశగా విలువైన పరిశోధనలు జరపాలని చెప్పారు. వేస్ట్ టు వెల్త్ అనే ప్రయోజనాత్మక అంశం దిశగా బత్తాయి, నిమ్మ, నారింజ, జామ వంటి పండ్ల తొక్కలలో అధికంగా లభించే పెక్టిన్ అనే పదార్థాన్ని సాధారణంగా వ్యర్థంగా భావించి పడేస్తామన్నారు. కానీ దానిని వేరుచేసి, విలువ జోడించడం ద్వారా న్యూట్రా స్యూటికల్‌గా మార్చడం, ఆహారం, ఫార్మా వంటి పరిశ్రమల్లో ఆరోగ్య సంబంధమైన ప్రయోజనాత్మక పదార్థంగా ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థ పెంపొందించే దిశగా ఈ ప్రాజెక్టు కింద చేపట్టే పరిశోధనలు ఎంతో దోహదపడతాయన్నారు. డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఎఎస్ పద్మావతమ్మ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. ఎల్ నారంనాయుడు, రిజిస్ట్రార్ డా. బి.శ్రీనివాసులు తదితరులు ప్రాజెక్టు బృందానికి అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న ద్రోణి

- ద్రోణి ప్రభావంతో నేడు, రేపు మోస్తరు వర్షాలు
- 2, 3 రోజుల్లో చురుగ్గా మారనున్న రుతుపవనాలు
- 17, 18 తేదీల్లో భారీ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రానున్న రెండు మూడు రోజుల్లో వర్షాలు ఊపందుకోనున్నాయి. ప్రస్తుతం రాయలసీమ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ద్రోణి ప్రభావంతో శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలు, ఆదివారం పార్వతీపురం మన్యం, అల్లూరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అదే సమయంలో ఆ ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది.

ఊపందుకోనున్న రుతుపవనాలు..

కొద్ది రోజులుగా నైరుతి రుతుపవనాలు స్తబ్దుగా ఉన్నాయి. దీనివల్ల రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు, అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రెండు మూడు రోజుల్లో రుతుపవనాలు చురుకుదనం సంతరించు కోనున్నాయి. ఫలితంగా ఈనెల 17, 18 తేదీల్లో కోస్తాంధ్రలోను, 18న రాయలసీమలోను భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. శుక్రవారం రాత్రి వరకు డోలపేట (విజయనగరం జిల్లా)లో 7.8 సెంటీమీటర్లు, కోట ఉరట్ల (అనకాపల్లి)లో 5.7, అనపర్తి (తూర్పు గోదావరి)లో 4.3, ఎచ్చెర్ల (శ్రీకాకుళం)లో 3.2, సాలూరు (పార్వతీపురం మన్యం)లో 2.9, పర్లపాడు (వైఎస్సార్)లో 2.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

వైజాగ్ స్టీల్.. ఇక డోర్ డెలివరీ!

- ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకునే అవకాశం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఆదాయ మార్గల అన్వేషణకు విశాఖ స్టీల్‌ప్లాంట్ కొత్త దారులను ఎంచుకుంటోంది. ఇప్పటి వరకూ సంస్థలకే బల్క్‌గా అందజేసిన విశాఖ ఉక్కు ఉత్పత్తులు.. ఇప్పుడు ప్రతి ఇంటికీ చేరువవుతున్నాయి. డిజిటల్ ఇండియాలో భాగంగా ఆన్‌లైన్ పోర్టల్‌ని అభివృద్ధి చేసిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌ఐఎన్‌ఎల్) ఇంటి నుంచే బుకింగ్ సౌకర్యాన్ని కల్పిస్తోంది. హాట్ మెటల్, ముడి ఉక్కు, సేలబుల్ స్టీల్ అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి సాధిస్తూ.. 17 శాతానికి పైగా విక్రయ వృద్ధి సాధించింది విశాఖపట్నం స్టీల్ ప్లాంట్. ఓ వైపు ప్రైవేటీకరణ ముప్పు పొంచి ఉన్నా ఉక్కు పరిశ్రమ అభివృద్ధి కోసం అధికారులు, ఉద్యోగులు తీవ్రంగా శ్రమిస్తూ లాభాల దిశగా స్టీల్ ప్లాంట్‌ని పరుగులు పెట్టిస్తున్నారు. ఇందులో భాగంగానే విభిన్న ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ వివిధ కంపెనీలు, స్టీల్ వ్యాపార సంస్థలు, హార్డ్ వేర్ దుకాణాలకు ఆర్‌ఐఎన్‌ఎల్ ఉత్పత్తులు విక్రయించేవారు. తమ ఉత్పత్తుల్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త మార్గాన్ని ఎంపిక చేశారు. ప్రతి ఇంటికీ విశాఖ ఉక్కు ఉత్పత్తులు చేరేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌ని ఆర్‌ఐఎన్‌ఎల్ అధికారులు అభివృద్ధి చేశారు.

సులువుగా.. నాణ్యంగా..

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే.. సులువుగా.. నాణ్యమైన స్టీల్ ఉత్పత్తుల్ని డోర్ డెలివరీ చేయనున్నారు. ఇందుకోసం ఆర్‌ఐఎన్‌ఎల్ ఈ సువిధ పోర్టల్‌ని అందుబాటులోకి తెచ్చింది. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తయ్యే ప్రతి వస్తువునీ ఆన్‌లైన్‌లో ఈ వెబ్ పోర్టల్ ద్వారా ఆర్డర్ పెట్టొచ్చు. vizagsteel.com వెబ్‌సైట్‌కి వెళ్లి అందులో ఉన్న ఆర్‌ఐఎన్‌ఎల్ ఈ–సువిధా లింక్‌ను ఓపెన్ చేసి రిజిస్టర్ అవ్వాలి. మీ అవసరాలకు ఏ తరహా ఉత్పత్తులు కావాలి, ఎప్పటిలోగా కావాలనేది పేర్కొనాల్సి ఉంటుంది. అదే విధంగా డెలివరీ చేయాల్సిన అడ్రస్, ఫోన్ నంబర్ ఇవ్వాలి. నిర్దేశించిన సమయానికి విశాఖ ఉక్కు ఉత్పత్తులు డోర్ డెలివరీ చేసేలా ఆర్‌ఐఎన్‌ఎల్ అధికారులు ఈ వ్యవస్థను రూపొందించారు.

సాధకుని హృదయంలో ఉండే కామనలు (వాంఛలు, కోరికలు) అన్నీ సమూలంగా నష్టమైపోయినప్పుడు ఈ మర్త్యుడు (మరణశీలుడైన మనిషి) అమరుడౌతాడు.
– కఠోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 15 జూన్ 2024

జీ-7 అసంబద్ధ నిర్ణయం

పేరుకి సంపన్న దేశాలే. ప్రపంచాన్ని ఇప్పటికీ శాసిస్తున్నవే. స్వయంకృతం కావొచ్చు... అంతర్జాతీయ పరిణామాల పర్యవసానం కావొచ్చు ఆ దేశాలకూ సమస్యలుంటాయి. ఇటలీలో గురువారం ప్రారంభమైన జీ-7 దేశాల మూడురోజుల శిఖరాగ్ర సదస్సు ఈ పరిస్థితిని ప్రతిబింబించింది. చుట్టూ అనిశ్చితి, భవిష్యత్తుపై నిరాశా నిస్పృహలు వాటిని పీడిస్తున్నాయి. ఉన్న సమస్యలు చాల్లేదన్నట్టు అమెరికా అధ్యక్ష పీఠం మళ్లీ డోనాల్డ్ ట్రంప్‌కు దక్కవచ్చన్న అంచనాలు వాటిని వణికిస్తున్నాయి. మూడేళ్ల క్రితం పరిస్థితి వేరు. అప్పటికి ట్రంప్ నిష్క్రమించి జో బైడెన్ అమెరికా అధ్యక్షుడై శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యారు. వస్తూనే అందరికీ అభయమిచ్చారు. మళ్లీ ప్రపంచ సారథ్యాన్ని అమెరికా స్వీకరించి జీ-7కు అన్నివిధాలా అండదండలందిస్తుందని పూచీపడ్డారు. అదే బైడెన్ గురువారం సదస్సుకు హాజరైనప్పుడు వాతావరణం పూర్తి భిన్నంగా ఉంది. ఒకపక్క ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ యుద్ధం ఎడతెగకుండా సాగుతోంది. గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ సరేసరి. పాలస్తీనాపై విచక్షణారహితంగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్‌కు పాశ్చాత్య దేశాలు, అమెరికా మద్దతిస్తున్నాయన్న ఆగ్రహంతో 1973లో ఒపెక్ దేశాలు చమురు సంక్షోభం సృష్టించినప్పుడు దానికి జవాబుగా జీ-7 ఆవిర్భవించింది. యాభైయ్యేళ్లు గడిచాక ఇప్పటికీ ఇజ్రాయెల్ తీరుతెన్నులు మారలేదు. అమెరికా మాత్రం ఆయుధాలందిస్తూనే గాజాలో దాడులు నిలపాలని ఇజ్రాయెల్‌ను బతిమాలుతోంది. మరోపక్క ఇటీవలే జరిగిన యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఎన్నికల్లో యూరొప్ రాజకీయ ముఖచిత్రం మారుతున్న వైనం వెల్లడైంది. ముఖ్యంగా ఫ్రాన్స్, జర్మనీల్లో మితవాద పక్షాలు బలపడుతున్న ఆనవాళ్లు కనబడుతున్నాయి. అసలు జీ-7కు ఆతిథ్యమిస్తున్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీయే మితవాద పక్షానికి చెందినవారు. వీటన్నిటికీ అదనంగా ట్రంప్ సమస్య తోడైతే జీ-7 దేశాధినేతలు నిశ్చింతగా ఎలా ఉండగలరు?

ఇలా పీకల్లోతు సమస్యల్లో కూరుకుపోయినా ఈ ఏడాది ఆఖరుకల్లా ఉక్రెయిన్‌కు 5,000 కోట్ల డాలర్ల (రూ. 4లక్షల కోట్లుపైగా) రుణం అందించాలని గురువారం జీ-7 అధినేతలు తీర్మానించక తప్పలేదు. ఇది సాధారణ సాయమైతే రష్యా కూడా ఎప్పటిలా ఇది సరికాదని ఖండించి ఊరుకునేది. కానీ తాజా నిర్ణయంపై తీవ్రంగా స్పందించింది. ఎందుకంటే దురాక్రమణ యుద్ధం తర్వాత అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల్లో రష్యాకున్న 30,000 కోట్ల డాలర్ల విలువైన స్థిరాస్తులతోపాటు నగదు రూపంలోవున్న సంపదను స్తంభింపజేశారు. ఇప్పుడు ఉక్రెయిన్‌కు ఆ ఆస్తులపై ఆర్జించిన వడ్డీ నుంచే రుణం అందజేయబోతున్నారు. నిజానికి గత రెండేళ్లుగా అమెరికా ఈ ప్రతిపాదన చేస్తున్నా ఈయూ దేశాలు తాత్సారం చేస్తున్నాయి. ఆ పని చేస్తే రష్యాను మరింత రెచ్చగొట్టినట్టు అవుతుందనీ, పొరుగునేవున్న తమపై అది నేరుగా దాడికి దిగే ప్రమాదం ఉంటుందనీ భావించాయి. కానీ అమెరికా ఎలాగైతేనేం నచ్చజెప్పి ఒప్పించింది. ఈయూలో ఎప్పుడూ భిన్న స్వరం వినిపించే ఫ్రాన్స్ బాహాటంగానే అమెరికా ప్రతిపాదనను వ్యతిరేకించింది. జీ-7 దేశాలన్నీ విరాళాలు సమకూర్చి, ప్రపంచ దేశాలనుంచి విరాళాలు సేకరించి ఈ రుణాన్ని అందిద్దామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సూచించారు. కానీ చివరకు అమెరికా ఒత్తిడితో రష్యా ఆస్తులనుంచి వచ్చిన వడ్డీనుంచే ఇవ్వాలని తీర్మానించారు. 'ఇది నేరపూరిత చర్య. మానుంచి దుఃఖాన్ని మిగిల్చే స్పందన చవిచూడాల్సి వస్తుంది సుమా!' అని రష్యా హెచ్చరించింది. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఏ దేశమైనా వేరే దేశం ఆస్తుల్ని స్తంభింపజేయటం పెద్ద కష్టం కాదు. కానీ వాటిని వినియోగించటానికి ఇప్పటికైతే న్యాయబద్ధమైన ప్రాతిపదికగానీ, విధానంగానీ లేవు. అమెరికా తనవరకూ చట్టపరమైన ఇబ్బందులు రాకుండా ఉక్రెయిన్ పౌరుల ఆర్థిక పునర్నిర్మాణం, అవకాశాల మెరుగుదల పేరిట రెపో చట్టం తీసుకొచ్చింది. ఈయూ ఇలాంటి చట్టమేమీ లేకుండానే రష్యా ఆస్తులనుంచి వచ్చిన లాభార్జనను పక్కనబెట్టింది. ఇప్పుడు జీ-7 అమెరికా మాదిరిగా ఒక చట్టాన్ని రూపొందించే అవకాశం ఉంది. కానీ అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రాతిపదిక లేకుండా, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థల ప్రమేయం లేకుండా ఏవో కొన్ని దేశాలు ఈ తరహా చర్యలకు సిద్ధపడటం అనర్థదాయకం. ఇప్పటికే అమెరికా, పాశ్చాత్య దేశాలకు రష్యా ఒక హెచ్చరిక చేసింది. అగ్రరాజ్యాలు సరఫరా చేసిన భారీ విధ్వంసక ఆయుధాలను ఉక్రెయిన్ ఉపయోగిస్తే దాని పర్యవసానాలను ఆ దేశాలు కూడా అనుభవించాల్సి వస్తుందన్నది ప్రకటన సారాంశం. యుద్ధం మొదలైన నాటినుంచీ రష్యా ఆస్తులను చెరబట్టిన అగ్రరాజ్యాలు ఈ రెచ్చగొట్టే చర్యకు కూడా సిద్ధపడ్డాయంటే ఉన్న సంక్షోభాన్ని మరింత పెంచటమే అవుతుంది.

బైడెన్‌కూ, ట్రంప్‌కూ మధ్య ఒక్క చైనా విషయంలో మాత్రమే ఏకాభిప్రాయం ఉంది. దానిపై భారీగా సుంకాలు విధించాలన్నదే ఇద్దరి ఆలోచన. కానీ ఈయూ, నాటో, జీ-7లపై ట్రంప్ గతంలో కారాలూ మిరియాలూ నూరేవారు. 2018లో కెనడాలో జీ-7 సదస్సు జరిగినప్పుడు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రుడో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందంటూ ప్రకటించిన వెంటనే ట్రంప్ అది అబద్ధమని కొట్టిపారేశారు. సంస్థలో రష్యాను చేర్చుకోవాలని ఒత్తిడి చేశారు. ఇటీవలే ఆయన నాటో దేశాలను తీవ్రంగా హెచ్చరించారు కూడా. తాను అధికారంలోకొచ్చాక నాటోనుంచి తప్పుకుంటామనీ, అటుపై రష్యా ఆ దేశాలను ఏంచేసినా పట్టించుకోబోమనీ తెలిపారు. ఇలాంటి స్థితిలో అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గటం ఎంతవరకూ సబబో జీ-7 ఆలోచించుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.నవమి రా.12.52 వరకు, తదుపరి దశమి **నక్షత్రం:** ఉత్తర ఉ.7.33 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** సా.4.51 నుండి 6.37 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.36 నుండి 7.13 వరకు **అమృతఘడియలు:** రా.3.31 నుండి 5.18 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

గొత్తికోయల 'అరణ్య' రోదన

విశ్లేషణ



పి. వేణుగోపాల్ రెడ్డి

వాళ్లకు గూడూ లేదు, నీడా లేదు... భూములూ లేవు, భుక్తీ లేదు... హక్కులు లేవు, అసలు గుర్తింపే లేదు. ఏ పేరుతోనైతే వాళ్లను పిలుస్తున్నామో అది వాళ్ల పేరే కాదు. పక్క రాష్ట్రం నుంచి పొరపాటునో గ్రహపాటునో తెలుగు నేలకు వలస వచ్చి దీనస్థితిలో జీవనపోరాటం సాగిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా దక్కవలసిన హక్కుల కోసం చేయిచాచి ఆర్ద్రతగా ఆకాశం వైపు చూస్తున్నారు. ఆ వ్యధాభరిత ఆదివాసీలే 'గొత్తికోయలు'. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో 60 వేల మంది దాకా వీరు ఉన్నారు. రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ పలు ప్రాథమిక హక్కులను కూడా పొందలేక పోతున్నారు. ఈ అడవి బిడ్డలను షెడ్యూల్డ్ తెగలుగా గుర్తిస్తే కనీసం రాజ్యాంగం ప్రసాదించిన విద్యా ఉద్యోగ ప్రయోజనాలైనా దక్కుతాయి.

దండకారణ్యంలోని బస్తర్ అటవీ ప్రాంతం మధ్యప్రదేశ్‌లో భాగంగా ఉన్నప్పుడు 1980వ దశకం నుంచీ వామపక్ష తిరుగుబాటు ఉద్యమాలు ఊపందుకున్నాయి. అడవులపై నక్సలైట్ల ఆధిపత్యం పెరిగింది. ఆ తర్వాత రాష్ట్రాల పునర్విభజనలో ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్‌లో భాగమైంది. నక్సలైట్లకు వ్యతిరేకంగా మహేంద్ర కర్మ అనే కాంగ్రెస్ నాయకుడు 2005లో సల్వా జుడుమ్ (గోండి భాషలో 'పవిత్ర వేట') పేరుతో ఆదివాసులతో సాయుధ పోరాటం మొదలుపెట్టారు. రెండువైపుల తుపాకి గర్జనల మధ్య ఆదివాసుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఐతే సల్వా జుడుమ్ శిబిరాలలో తలదాచుకోవాలి, లేదంటే నక్సలైట్ల వేధింపులను భరించలేక ఊరొదిలి పారిపోవాలి.

అలా వేలాది మంది ఆదివాసులు ప్రాణాలు అరచేత పట్టుకొని దండకారణ్యంలోని పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశాలకు వలసపోయారు. తెలుగు రాష్ట్రాలలో వారిని గొత్తికోయలు అని పిలవడం మొదలుపెట్టారు. వాస్తవానికి గొత్తికోయలు అనే పేరు ఏ ఆదివాసీ తెగలకూ లేదు. గొత్తి అంటే కొండలు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతంతో పోలిస్తే దండకారణ్యంలోని బీజాపూర్, సుకుమా, దంతేవాడ సముద్రమట్టం నుంచి ఎక్కువ ఎత్తులో ఉంటాయి. కాబట్టి ఎగువ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కారణంగా వారిని గొత్తికోయలు అని వ్యవహరించడం మొదలుపెట్టారు. వారిలో ఎక్కువ శాతం గోండులలో ఉపజాతులైన మురియా తెగకు, మిగతావారు దొర్ల తెగకు చెందినవారు. 1980వ దశకం నుంచీ వలసలు సాగినప్పటికీ 2005 నుంచి 2011 మధ్య సల్వా జుడుమ్ కాలంలోనే అధిక శాతం ఆదివాసులు చెల్లాచెదురై ఇతర ప్రాంతాలకు తరలిపోయారు.

ఉన్నచోటి నుంచి దేశంలో మరో ప్రాంతానికి వలసపోయి, ఎటువంటి ఆదరువూ లేనివారిని స్వదేశ విస్థాపితులుగా (ఇంటెర్నల్లీ డిస్‌ప్లేస్డ్ పర్సన్స్–ఐడీపీస్) వ్యవహరిస్తారు. బస్తర్ ప్రాంతం నుంచి వలస వచ్చిన జనాభాకు సంబంధించి ప్రభుత్వాల వద్ద సరైన సమాచారం లేదు. ఆదివాసుల బాగు కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల లెక్కల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో 60 వేల మంది దాకా గొత్తికోయలు ఉన్నారు. అడవి మధ్యలో పోడు చేసుకొని పొట్టపోసుకోవడం తప్ప వారికి మరో ఉపాధి మార్గం తెలియదు.

దేశీయంగా విస్థాపితులైన ఆదివాసుల గుర్తింపునకు, పునరావాసానికి కేంద్ర ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ యాక్ట్– ఆర్‌ఓఎఫ్‌ఆర్) తీసుకువచ్చింది. 2008లో కొద్దిమంది స్థానిక గిరిజనులకు భూమిపై హక్కు కల్పించి, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినవారిని పక్కనపెట్టారు. ఆ చట్టం నిబంధనల ప్రకారం 2005 డిసెంబర్ 13కు ముందు వలస వచ్చి మూడు తరాలుగా 75 ఏళ్లపాటు సాగు చేసుకుంటున్న వాళ్లకే భూములపై హక్కు



దఖలు పడుతుంది. అందులోనూ ఒక్కొక్కరికి గరిష్ఠంగా నాలుగు హెక్టార్ల వరకు భూమిపై హక్కు కల్పిస్తారు. అయితే, ప్రస్తుతం భూమి హక్కుల కోసం ఎదురుచూస్తున్న గొత్తికోయలు 2016 తర్వాత వలస వచ్చారని అటవీ అధికారులు వాదిస్తున్నారు. అంతకు ముందటి ఉపగ్రహ చిత్రాలను తమ వాదనకు మద్దతుగా చూపుతున్నారు. అయితే, నిర్దిష్ట ప్రదేశానికి పరిమితం కాకుండా దట్టమైన అడవులలో పోడు చేసుకుంటూ జీవనం సాగించే ఆదివాసుల ఆచూకీని ఉపగ్రహాలు ఎలా నిర్ధారిస్తాయన్న వాదనను అధికారులు పట్టించుకోవడం లేదు.

రెండు రాష్ట్రాలలోని 28 జిల్లాల నుంచి దాదాపు 13 లక్షల ఎకరాల అటవీ భూములపై హక్కు కోసం నాలుగు లక్షలకు పైగా దరఖాస్తులు చేసుకున్నారు. 2006 నుంచి ఇటీవలి కాలం వరకు వీటిలో అధిక శాతం దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తుదారులలో మైదానప్రాంత గిరిజనేతరులు ఉన్నారనీ, అక్రమంగా అటవీ భూములు సొంతం చేసుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారనీ అధికారులు వాదిస్తున్నారు. దరఖాస్తుల తిరస్కారాలకే పరిమితమైన అధికారులు నామమాత్రంగానైనా అర్హులకు పట్టాలు అందించడం లేదు.

భూమి హక్కుతో సంబంధం లేకుండా అడవి బిడ్డలను షెడ్యూల్డ్ తెగలుగా గుర్తిస్తే కనీసం రాజ్యాంగం ప్రసాదించిన విద్యా ఉద్యోగ ప్రయోజనాలైనా వీరికి దక్కి ఉండేవి. రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ పలు ప్రాథమిక హక్కులను కూడా వారు పొందలేకపోతున్నారు. వాళ్ల పిల్లలకు విద్య ఇప్పటికీ ఒక కలగానే మిగిలిపోయింది. గొత్తికోయలు అడవి మధ్యలో ఉండటం వల్ల సుదూర మైదాన ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లలేరు. అక్కడక్కడ కొన్ని స్వచ్ఛంద సంస్థలు బ్రిడ్జ్ స్కూళ్లను ప్రారంభించినప్పటికీ, ప్రాథమిక విద్య తర్వాత ముందుకు సాగడం లేదు. బాలికలు తమ ఇళ్లలో పనులకు, చిన్న పిల్లలను చూసుకోవడం వరకే పరిమితమవుతున్నారు. బాలురు అతికష్టంగా హైస్కూలు దాకా వచ్చి అర్ధాంతరంగా ఆపేసి కూలీలుగా మారిపోతున్నారు. షెడ్యూల్డ్ తెగలుగా గుర్తింపు లేకపోవడం వల్ల ఉన్నత విద్యా సంస్థల్లో, వసతి గృహాల్లో ప్రవేశం పొందలేకపోతున్నారు. చదువులే ఇలా ఉన్నాయంటే, ప్రజారోగ్యం మరీ దయనీయంగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అడవి బిడ్డలకు అందని చందమామలు. అప్పుడప్పుడు నర్సులు రావడం, గర్భిణులను సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకుపోవడం మినహా మిగతావాళ్లకు ఎటువంటి వైద్య సౌకర్యాలు అందడం లేదు.

హక్కులు దక్కకపోవడమే కాకుండా పుండు మీద కారం చల్లినట్లు పోలీసు కేసులు గొత్తికోయలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చాలా గూడేలలో వయసుతో నిమిత్తం లేకుండా పురుషులు సమీప పోలీసు స్టేషన్లకు వెళ్లి హాజరు వేసి రావలసి ఉంటుంది. అలా వెళ్లినవారితో చాకిరీ చేయిస్తుంటారు. అప్పుడప్పుడు తప్పుడు కేసులతో నిరుత్సాహ పరుస్తుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అధికారులు గిరిజన గూడేలను రెవెన్యూ గ్రామాలుగా గానీ, అటవీ గ్రామాలుగా గానీ గుర్తించరు. కాబట్టి, ప్రభుత్వ లెక్కల ప్రకారం గొత్తికోయల ఆవాసాలు మనుగడలో ఉండవు. తరచుగా అటవీ అధికారులు వారిని ఖాళీ చేయించడం, వారు మరో చోట గూడు చూసుకోవడం పరిపాటిగా మారింది.

గొత్తికోయలకు గుర్తింపు ఇవ్వాలనే విషయంలో రెండు రాష్ట్రాలలోని పాలక, ప్రతిపక్షాలకు అభ్యంతరాలు లేవు. కానీ తగిన చొరవ కరవైనందున సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి కాడువడిన అడవిబిడ్డలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అందించాలి. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికులు, స్పందించే మనసున్న వ్యక్తులు కూడా దగాపడిన అడవి బిడ్డలకు ఊతమివ్వాలి. విద్య, వైద్యం వారికి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలి.

త్రిపురలో దశాబ్దాలుగా నలుగుతున్న ఇలాంటి సమస్యను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పరిష్కరించింది. 1990వ దశకంలో మిజోరంలో జాతుల పోరాటం తీవ్రరూపం దాల్చింది. బ్రూ– రియాంగ్ తెగకు చెందిన ఆదివాసులు పెద్దఎత్తున త్రిపురకు వలస వెళ్లారు. మన గొత్తికోయల మాదిరిగానే వాళ్లు కూడా స్వదేశంలో శరణార్థులై గుర్తింపు, హక్కులు లేకుండా రెండు దశాబ్దాలు దయనీయమైన పరిస్థితుల్లో జీవించారు. 2020లో కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించింది. వలస వచ్చిన 43 వేల మంది బ్రూ– రియాంగ్ ఆదివాసులకు త్రిపురలో పునరావాసం కల్పించింది. వాళ్లకు గుర్తింపునిచ్చి ఇళ్లు కట్టించింది. వాళ్ల జీవితాలలో వెలుగు నింపేందుకు తగిన ఏర్పాట్లు చేసింది. తెలుగు రాష్ట్రాల గొత్తికోయలు కూడా సరిగ్గా బ్రూ– రియాంగ్ ఆదివాసుల మాదిరిగానే ఇబ్బందులు పడుతున్నారు. రెండు రాష్ట్రాలు సత్వరం స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ । pvg@ekalavya.net

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

జైలు విడిది

అత్యాచార కేసులో నిందితుడైన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ (డేరా సచ్చా సౌదా అధిపతి) పది నెలల్లో తన ఎనిమిదో పెరోల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. చూస్తుంటే ఆయన శిక్ష అనుభవిస్తున్నట్టు లేదు; 'జైల్ బీఎన్‌బీకి వెళ్తొస్తున్నట్టున్నారు.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

వారిదే గెలుపు

ఒక పందెం కాస్తాను: జరుగుతున్న విషయాలను గమనిస్తే మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలను శరద్ పవార్, ఉద్ధవ్ ఠాకరే ఊడ్చేయనున్నారు. ఊడ్చేస్తారంతే!

– సుహేల్ సేథ్, నట రచయిత

ఎలా లెక్కేస్తారు?

ఇండియాలో వేసేది రహస్య ఓటు. ఎవరు ఎవరికి వేశారో ఎవరికీ తెలీదు. అలాంటిది దళితులు, ముస్లింలు అంటూ వర్గీకరించే ఓట్ల సంఖ్యలు ఎలా వస్తాయి? సాధారణంగా ఎగ్జిట్ పోల్స్ నుంచి ఇవి తీసుకుంటారు. కానీ విశ్వసనీయత లేని ఎగ్జిట్ పోల్స్ నుంచి ఈ సంఖ్యలను తీసుకోవచ్చా? తీసుకోకూడదు. అందుకే చాలామంది తమ అంకెల సోర్సులను వెల్లడించరు.

– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

అడగనేకూడదా?

వేసవి సెలవులను పిల్లలు అమ్మమ్మ దగ్గర గడుపుతున్నారు. ఆమె పిల్లల అపభాషను (స్లాంగ్), తనలోని సహనపు నిల్వలను కొత్తగా గుర్తిస్తోంది. పొద్దున్నే ఆమె నుంచి ఆందోళనతో కూడిన మెసేజ్: "స్నానం చేయమని అడిగితే వాడు నన్ను 'క్యాజువల్ ఇన్‌సల్ట్' చేశానని నిందిస్తున్నాడు. ఇంతకీ అదేమిటది?"

– శమికా రవి, ఆర్థికవేత్త

పెరిగిన బడ్జెట్

పాకిస్తాన్ పన్ను రెవెన్యూ సాపేక్షంగా తక్కువే. కానీ దాని రక్షణ వ్యయం చాలా ఎక్కువ. సైన్యమే దేశానికి అసలు పాలిక అయినందువల్ల కావొచ్చు. దివాళా తీసిన పాకిస్తాన్ ఇప్పటికే ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్య నిధి) నుంచి ఆర్థిక సహాయం (బెయిల్ అవుట్) తీసుకుంది, మళ్లీ కోరుతోంది. అయినప్పటికీ తన భారీ రక్షణ బడ్జెట్‌ను 17.6 శాతం పెంచింది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

నీచమైన మీమ్స్

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఇండియా ప్రధాని మోదీలను ఉద్దేశించి చేస్తున్న మీమ్స్‌కు అదుపు లేకుండా పోయింది. అవి నీచంగా ఉండటమే కాదు, ఇండియాలో ఉన్న హాస్యానికి అధమ స్థాయి ప్రతిబింబాలు.

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

జాతీయ గీతంతో...

మొదటిసారి జమ్ము కశ్మీర్ విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో ఉదయపు అసెంబ్లీని జాతీయ గీతం 'జన గణ మన'తో ప్రారంభించాలని ఆదేశించింది. 1950ల నుంచి 80ల వరకు పాఠశాలలు 'లబ్ పే ఆతీ హై దువా' లాంటి భిన్న ప్రార్థనలతో మొదలుపెట్టేవి. కొన్ని 'సారే జహా సే అచ్ఛా', 'జన గణ మన'ను కూడా కలిపేవి. 1990ల్లో మిలిటెన్సీ తర్వాత చాలా పాఠశాలలు దేశభక్తి గీతాలను వదిలేసి, 'యా రబ్ దిల్–ఎ–ముస్లిం కోను స్వీకరించాయి. కొత్త ఆదేశం 'జన గణ మన'ను తప్పనిసరి చేసింది.

– అహ్మద్ అలీ ఫయాజ్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

రాజకీయాలకు చట్టం బలి


ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత సంతకం చేసిన ఫైళ్లలో ఒకటి ల్యాండ్ 'టైటిల్ గ్యారంటీ చట్టం రద్దు' ఫైల్. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న టైటిల్ గ్యారెంటీ చట్టాన్ని భూ సంస్కరణలలో భాగంగా భారత దేశంలో మొట్టమొదటిసారి అమలు చేసిన రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్. ఒక్కో గ్రామంలో భూ సమస్య పరిష్కారం కావడానికి తరతరాలు పడుతోంది. దీన్ని నివారించడానికి తెచ్చినదే 'టైటిల్ గ్యారంటీ చట్టం.' అప్పుడెప్పుడో శతాబ్దాల క్రితం చేసిన సర్వే తప్ప ఇటీవలి కాలంలో భూసర్వే జరగనే లేదు. అందుకే ఈ కొత్త చట్టం ప్రకారం సమగ్ర భూ సర్వే, డిజిటల్ ల్యాండ్ సర్వే చేసి ఏమైనా సమస్యలు ఉంటే సర్వే సెటిల్మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అక్కడికక్కడే పరిష్కరించి పట్టా పాస్ బుక్కులు ఇచ్చారు. అయినా ఎన్నికల్లో దీన్ని ఎందుకు ప్రచారాస్త్రం చేశారు? 'సింగిల్ సెటిల్మెంట్‌తో భూ సమస్య పరిష్కారం అయితే మేమేం కావాలి? మా పూట ఎలా గడవాలి' అని గ్రామాల్లో పూట గడుపుకునే పెద్ద మనుషుల నుండి రైతులను చెప్పులు అరిగేలా కోర్టుల చుట్టూ తిప్పుతూ ఉన్న న్యాయవాదుల వరకు వ్యతిరేకించారు. అందుకే ఈ చట్టం ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా మారింది.

తెలంగాణలో గొప్పలకు పోయి తెచ్చిన పట్టాదార్ పాస్ బుక్ చట్టం – 2020, 'ధరణి' పోర్టల్ వంటివి పెద్ద అక్రమాలకు తావిచ్చాయి. అందుకే ఆంధ్ర ప్రదేశ్‌లో చేసిన టైటిల్ గ్యారంటీ చట్టాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో కూడా ఈ చట్టాన్ని ఉదాహరణగా తీసుకుని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంటే నలభై సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం, గుడ్ గవర్నెన్స్, గుడ్ అడ్మినిస్ట్రేషన్ లాంటి సర్టిఫికెట్లు ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ చట్టాన్ని ఎన్నికల ప్రచార అస్త్రంగా ఎందుకు మలిచారు? అధికారం చేపట్టగానే రెండో సంతకం ఈ ఫైల్ మీదే ఎందుకు చేసినట్టు? ఈ సందర్భంగా భూ చట్టాల న్యాయ నిపుణులు 'మంచి చట్టాన్ని చెత్త రాజకీయాలు చంపేశాయ'ని అంటున్నారు.

– బండెల సురేందర్ రెడ్డి, మాజీ సైనికుడు

దాయాది శత్రుత్వం

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

భారత యుద్ధం దాయాదుల పోరే. అయితే ఒకరిని ధర్ములని, మరొకరిని అధర్ములని అంటాం. సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులెవరు? ప్రజాకంటకులెవరు? స్త్రీలను విధవలను, పిల్లలను అనాథలను చేసిందెరు? ఈ దృష్టితో రాజకీయనాయకులను విశ్లేషించాలి. బంధుమిత్ర, రాజకీయాధికార దాయాదులుంటారు. కొన్నిసార్లు రెండు దాయాదిత్వాలు కలుస్తాయి.

కాంగ్రెస్‌కు పిల్ల కాంగ్రెస్‌లు కొంత నష్టంచేశాయి. ఇందిర చతురత, అవసర వామపక్ష సమర్థక చర్యలు కాంగ్రెస్‌ను బలోపేతం చేశాయి. ఆమెకు పాతతరం కాంగ్రెస్‌వాళ్ల వలన జరిగిన నష్టం కంటే, వారికి ఆమెతో నష్టం ఎక్కువ జరిగింది. మోదీ దాయాదిత్వంతో ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషి, జస్వంత్ సింగ్, యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి వగైరాల రాజకీయ జీవితాలు మాయమయ్యాయి. బీజేపీ అగ్రనాయక ద్వయం గడ్కరీ ఓటమికి విఫలయత్నం చేసిందట. మహారాష్ట్ర శివసేన, నేషనల్ కాంగ్రెస్‌లు దాయాదిత్వంతో చీలాయి. తెలుగు దేశంలో ఎన్టీఆర్ –చంద్రబాబు, చంద్ర బాబు–కేసీఆర్‌ల రాజకీయ దాయాది ద్వేషాలు తెలుగు రాష్ట్రాలకూ, దేశానికీ నష్టం చేశాయి. ఆంధ్ర తాజా పూర్వ ముఖ్యమంత్రికి బంధుమిత్ర దాయాదులతో నష్టం జరిగింది. ప్రతిపక్ష కూటమికి ఊహించని విజయం దక్కింది. వామపక్షాల నుండి పెట్టుబడిదారి పార్టీలకు మారినవారి దాయాదిత్వం వామపక్ష వ్యతిరేక విమర్శలకు తావిచ్చింది. వారికి భావజాల నష్టం కలిగించింది. ప్రతి పార్టీలో కుల మత లింగ వివక్షతలున్నాయి. మహిళా రిజర్వేషన్‌కు పెట్టుబడిదారీ పార్టీల మగ దాయాదిత్వమే అడ్డంకి.



సంకీర్ణ పక్షాలే నేడు మోదీకి దాయాదులు. మిత్రులుగా విడిపోగానే, పాత పొత్తును మర్చి ఉక్రోషంతో తిట్టుకున్నారు. పలుమార్లు కలిసి విడిపోయి కలిసిన మోదీ, అమిత్, నితీశ్, బాబు తీవ్రంగా తిట్టుకున్నారు. అధికార కాంక్షతో కలిసినపుడు పాత తిట్లు గుర్తుకురావా?

సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు నేరుగా చేరాలి. దళారీలకు, కార్పొరేట్లకు లాభం చేయరాదు. అర్హులందరికీ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రయోజనాలు అందాలి. సమాజాన్ని వర్గ, వర్ణ రహితానికి చేర్చాలి. ఈ ఉన్నత దశకు చేరిన పౌరులు రెండు తరాల వరకు ఆ పాలకులను మరువరు.

ఓట్ల కోసమే ఐనా సంక్షేమ పథకాలను తరతమ భేదాలతో అన్ని పార్టీలు ప్రకటిస్తాయి. బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం కల్పించిన ప్రజా సౌకర్యాలను తృణాముల్ కాంగ్రెస్ రద్దుచేయలేదు. మరింత మెరుగుపరచింది. స్కాండినేవియన్ దేశాల్లో గత వామపక్ష, సోషలిస్టు ప్రభుత్వాల సంక్షేమ రాజ్య పథకాలను నిన్నటి మధ్యేమార్గ పాలకులు కాని, నేటి మతవాద పాలకులు కాని రద్దు చేయలేకున్నారు. సామ్రాజ్యవాద అమెరికా ఉచ్చులో పడి ప్రపంచీకరణ పథకాలను అనుమతించారు. బహుళజాతి సంస్థలకు సాయపడుతున్నారు. కాని, ప్రజాసంక్షేమాన్ని తగ్గించలేదు.

మన రాజకీయులు పోటీపడి అవసరాలను, అమలు అవకాశాలను పరిశీలించకుండా, ఎన్నికల ఎత్తుగడతో కొత్త పథకాలను, పాత పథకాల లబ్ధిని పెంచుతున్నారు. కాని మరో రూపాల్లో ప్రజల నుండి డబ్బు వసూలు చేస్తున్నారు. ఆస్తులు, అధికారాలు వెంటరావు. గుణగణాలు చరిత్రలో నిలుస్తాయి. విభేదాలకు, కలహాలకు... కలిసి మాట్లాడుకోడం, చర్చలే ఏ సమస్యకైనా పరిష్కారం చూపుతాయి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, నాగపూర్ నుండి । 94902 04545

శాంతాత్ముల సహనం

సీతమ్మను లంకాధిపతియైన రావణుడు అపహరించి తీసుకువెళ్ళి లంకలోని అశోకవనంలో దాచాడు. అది తెలుసుకున్న శ్రీరాముడు వెంటనే సముద్రాన్ని దాటి లంకకు చేరే ప్రయత్నం మొదలుపెట్టాడు. తెప్పలు కట్టుకుని దాటడానికి ఎదురుగా ఉన్నది చిన్న నది కాదు కాబట్టి, సముద్రుడిని ప్రసన్నం చేసుకోవడం ఒక్కటే మార్గం అని విభీషణుడు సలహా ఇచ్చాడు. దాన్ని అంగీకరించాడు శ్రీరాముడు. సముద్రుడిని దారి వదలమని ప్రార్థించడానికి పూనుకున్నాడు. సముద్ర తీరంలోని ఇసుకపై దర్భలతో తయారుచేయబడిన చాపమీద తన కుడిభుజాన్ని తలగడగా చేసుకుని శయనించి ఏకాగ్ర చిత్తంతో సాగరుడిని ప్రసన్నం కమ్మని ప్రార్థించాడు. అలా ప్రార్థిస్తూ ఉండగా విభావరులొక మూడు గడిచాయట! అనగా మూడు రాత్రులు గడిచాయి శ్రీరాముడి జీవితంలో! మూడురోజులు ప్రార్థించినప్పటికీ సముద్రుడి నుండి సమాధానం రాకపోవడంతో సహనం కోల్పోయాడు శ్రీరాముడు. పక్కనే ఉన్న లక్ష్మణుడితో 'తమ్ముడా, ఈ సముద్రుడు నన్ను అసమర్థుడిగా జమకట్టాడు. ఇతడితో సహనం పాటించడం వివేకంతో కూడుకున్న పని కాదు. ఇతడు దారికి రావాలంటే దండన ఒక్కటే ఇప్పుడు మిగిలున్న మార్గం. బాణాగ్ని చేత ఈ సాగరుడిని శోషింపజేసి, మన సైన్యం నడిచి వెళ్ళడానికి దారి కల్పిస్తాను!' అని శక్తిమంతమైన ఒక బాణాన్ని సంధించి సముద్రుడి మీదికి వదిలాడు శ్రీరాముడు. దశదిశలలో దారుణ అగ్నిశిఖలను విరజిమ్ముతూ ఆ బాణం సముద్రంలో ప్రవేశించగానే, నిలువెల్లా వణికిపోతూ సముద్రుడు పరుగున వచ్చి శ్రీరాముడి ముందు నిలిచాడు. సముద్రుడి అప్పటి అవస్థను ఏనుగు లక్ష్మణకవి తన 'రామేశ్వర మాహాత్మ్యము', ప్రథమాశ్వాసంలోని ఈ క్రింది కంద పద్యంలో అలతి మాటలలో వర్ణించాడు.

జ్యోతిర్మయం

కోపంబు సంహరింపుము
నీ పదకమలములు గొలిచి నిల్చిన నన్నుం
జేపట్టుము మ్రొక్కెద, నా
చాపలము సహింపు రామ సద్గుణధామా!

'కోపాన్ని ఉపసంహరించుకో శ్రీరామా! నీ పాదములపై వాలి వేడుకుంటున్న నన్ను సేవకుడిగా భావించి ఆదరించు! సద్గుణాలకు నెలవైన ఓ స్వామీ, నా తెలివితక్కువ చేష్టకు నన్ను దయతో మన్నించు!' అని సముద్రుడు వేడుకున్నాడు. ధీరులు, శాంతాత్ములు, పరమాత్మ స్వరూపులుగా ఉండేవారి సహనాన్ని పరీక్షించే చాపల్యపు పనికి పూనుకుంటే, సముద్రుడంతటి వాడికైనా భంగపాటు తప్పదని పై సన్నివేశం బోధిస్తుంది.

– భట్టు వెంకటరావు

ఆ 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయి!?

వేసిన ఓటు ఎక్కడికి పోతోందోనని ప్రజల్లో అనుమానం: ఉండవల్లి అరుణ్‌కుమార్

సాక్షి, రాజమహేంద్రవరం: దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 20 లక్షల ఈవీఎంలు కనపడకుండా పోయాయంటూ కమ్యూనిస్టులు, ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలపై సీఎం చంద్రబాబునాయుడు స్పందించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల నిమిత్తం 60 లక్షల ఈవీఎంలు దిగుమతి చేసుకుంటే.. వీటిలో 40 లక్షలు వినియోగించారని, మిగిలిన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడో ఒక చోట ఉండాలి కదా అని ప్రశ్నించారు. ఈవీఎంల వినియోగం విషయమై సమాచార హక్కు చట్టం ద్వారా ఎన్నికల కమిషన్‌ను కోరితే.. తమకేం తెలీదని.. ప్రభుత్వం తమకు ఇచ్చిన ఈవీఎంలనే ఉపయోగించామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఉండవల్లి అన్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇదే విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎన్నికల కమిషన్‌ను అడగాలంటూ తప్పించుకుంటోందని ఆరోపించారు. ఓ కమ్యునిస్టు నేత సైతం ఇదే అనుమానం వ్యక్తంచేశారన్నారు. ఈవీఎంల గోల్‌మాల్ అంశాన్ని ఒక కమ్యూనిస్టు నాయకుడు తన దృష్టికి తీసుకొచ్చారని ఉండవల్లి చెప్పారు. గతంలో ఈవీఎంల పనితీరుపై చంద్రబాబు అనుమానాలు వ్యక్తంచేసినందున ఇప్పుడు ఈవీఎంల గోల్‌మాల్‌పై విచారణకు ఆయన డిమాండ్ చేయాలని కోరారు. తాము వేసిన ఓటు ఎవరికి వెళ్లిందోననే అపోహ ప్రస్తుతం నెలకొందని, ప్రజల్లో అటువంటి అనుమానం రావడం మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై చంద్రబాబు దృష్టిపెట్టాలని ఉండవల్లి సూచించారు. కేంద్రంలో ఎన్డీయే, ఇండియా కూటములకు ఓట్ల తేడా కేవలం 1.9 శాతం మాత్రమేనన్నారు. అహంకారం పెరిగిపోయిందని ప్రధాని మోదీని ఉద్దేశించి ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ అని ఉండవచ్చన్నారు.



వైఎస్సార్‌సీపీకి మళ్లీ మంచి రోజులు..

ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనైపోయిందనుకోవద్దని.. ఓటమి పాలైన ఆ పార్టీ నాయకులు నిరాశ చెందాల్సిన అవసరంలేదన్నారు. 11 స్థానాలే వచ్చినా ఆ పార్టీ ఓట్ల శాతం బాగుందని.. వారికి మళ్లీ మంచి రోజులు రావచ్చని ఉండవల్లి చెప్పారు. గతంలో ఓటమి చెందిన చంద్రబాబు ప్రస్తుత గెలుపే దీనికి నిదర్శనమన్నారు. ఇదే తరహా పరిస్థితులు తమిళనాడు రాజకీయాల్లో సైతం గతంలో చోటుచేసుకున్నాయని చెప్పారు. తమిళనాడులో 1989లో ఎంజీ రామచంద్రన్ మరణానంతరం జరిగిన ఎన్నికల్లో కరుణానిధి పార్టీకి 169, జయలలిత పార్టీకి 30 సీట్లు వచ్చాయని.. ఆ తర్వాత 1991లో జరిగిన ఎన్నికల్లో జయలలితకు 225, కరుణానిధికి 7 సీట్లు మాత్రమే వచ్చాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రతిపక్ష పాత్ర పోషించారని చెప్పారు. అలాగే, 1996లో కరుణానిధి 221 సీట్లు సాధించగా.. జయలలిత నాలుగు స్థానాలకే పరిమితమయ్యారన్నారు. మళ్లీ 2011 ఎన్నికల్లో జయలలిత ఏకంగా 203 సీట్లు సాధించారని చెప్పారు. దీనినిబట్టి చూస్తే రాజకీయాల్లో నిస్సత్తువ ఉండకూడదని ఉండవల్లి అన్నారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషించాలని సూచించారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం బాబు పోరాడాలి..

మరోవైపు.. ఎన్డీయే ప్రభుత్వం చంద్రబాబుపై ఆధారపడి ఉందని, ఆయన ఢిల్లీలో తన పలుకుబడి ఉపయోగించి రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్రానికి అందాల్సిన నిధుల సాధనకు కృషిచేయాలని ఉండవల్లి సూచించారు. రాష్ట్ర విభజన హామీ మేరకు ఏపీకి రూ.1.42 లక్షల కోట్లలో 50 శాతం ఆస్తులు రావాలని, వాటిని సాధించుకునేందుకు పోరాడాలని సూచించారు. రాష్ట్ర విభజన బిల్లుపై చర్చ సందర్భంగా 2014లో పార్లమెంట్‌లో ఏం జరిగిందో తెలుసుకుని, ఇప్పుడు బాబు చర్చకు డిమాండ్ చేయాలన్నారు. అలాగే, త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై నోటీసు ఇప్పించాలన్నారు. వివాదాస్పద ఎలక్టోరల్ బాండ్లపై సైతం చర్చ జరగాలని ఆకాంక్షించారు. ఇక స్కిల్ డెవలప్‌మెంట్ కేసును చంద్రబాబు ప్రభుత్వమే సీబీఐకి అప్పగించే అవకాశం ఉందని ఉండవల్లి చెప్పారు.

జగన్ జైలుకెళ్లే అవకాశం ఉండదు..

అక్రమాస్తుల కేసులో జగన్ మళ్లీ జైలుకెళ్లే అవకాశం ఉండదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ కేసులకు సంబంధించి అన్ని చార్జిషీట్లూ పూర్తయ్యాయని చెప్పారు. ఇక కమ్మ, కాపులది డెడ్లీ కాంబినేషన్ అని.. కసి, పట్టుదలవల్లే చంద్రబాబు మరోసారి అధికారంలోకి వచ్చారని, ఆయనపై జగన్ కక్షసాధింపు చర్యలు చేపట్టారని ప్రజలు నమ్మారని ఉండవల్లి అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఓటమికి మద్యం పాలసీ కూడా ఒక కారణం కావచ్చునన్నారు. ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. అలాంటి వారివల్లే కొంతమంది వైఎస్సార్‌సీపీకి దూరమయ్యారని చెప్పారు.

ఈవీఎంలతో మోసం చేశారు

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- ఈవీఎంల ద్వారా దేశవ్యాప్తంగా జరిగిన మోసాలపై డెమో



ఈవీఎంలలో మోసాలు జరిగాయంటూ డెమో ద్వారా వివరిస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాల్సిన ఎన్నికలు కుట్రలు, మోసాలతో జరిగాయని, ఈవీఎంల ద్వారా మోసాలకు పాల్పడి గెలుపొందారని తాను అనుకున్నట్లే ప్రజలు కూడా అనుకుంటున్నారని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ధర్మవరంలోని తన నివాసంలో ఈవీఎంల ద్వారా దేశ వ్యాప్తంగా ఎన్నికల్లో మోసాలు జరిగాయంటూ డెమో ద్వారా వివరించారు. నియోజకవర్గాలలో పోలైన ఓట్లు, ఈవీఎంల ద్వారా లెక్కించిన ఓట్లలో భారీ వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఇలా జరగలేదని, దేశంలోని పలు రాష్ట్రాలలో ఈవీఎంల ద్వారా మోసాలు చేసి గెలుపొందారని చెప్పారు. దేశ వ్యాప్తంగా 140 నియోజకవర్గాల్లో మోసాలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఒక ప్రణాళిక ప్రకారం కౌంటింగ్ రోజు ఉదయం 10 గంటలకే కూటమి అభ్యర్థులు 120 సీట్లు గెలిచారు.. 150 సీట్లు గెలిచారంటూ టీవీలలో చూపించారన్నారు. ఇలా చేయడం వల్ల కౌంటింగ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు బయటకు వెళ్లిపోతే అధికారులతో వన్‌సైడ్‌గా చెప్పించుకోవచ్చని పథకం పన్ని అమలు చేసినట్లు తెలుస్తోందని చెప్పారు. తాను ఓడిపోయిన బాధలో మాట్లాడట్లేదని, తాము వేసిన ఓట్లన్నీ ఎక్కడికి పోయాయని ప్రజలు అడుగుతున్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలల పాటు సమయం ఇవ్వాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వారు ఏ మాత్రం ప్రయత్నిస్తారో వేచి చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తాను ఓడినా ప్రజల కోసం గొంతు వినిపిస్తానన్నారు. కార్యకర్తలెవ్వరూ అధైర్య పడొద్దన్నారు. రానున్న రోజులు మంచిగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

'కువైట్' మృతుల్లో ముగ్గురు ఏపీ వాసులు

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ప్రభుత్వ నష్టపరిహారం

సాక్షి, అమరావతి: కువైట్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన భారీ అగ్నిప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు చనిపోయినట్లు ఏపీ ఎన్‌ఆర్టీఎస్ ప్రకటించింది. ఈ ఘోర అగ్నిప్రమాదంలో మరణించిన 49 మందిలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ముగ్గురు సజీవ దహనం అయ్యారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్రకు చెందిన తామాడ లోకనాథం (31), తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లికి చెందిన సత్యనారాయణ, అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరుడు ఉన్నారు. మృతదేహాలు శనివారం ఉదయానికి విశాఖకు చేరుకుంటాయని అక్కడ నుంచి వాటిని వారి స్వస్థలాలకు పంపనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు ఏపీ ఎన్‌ఆర్టీఎస్ ఆ ప్రకటనలో పేర్కొంది. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.5 లక్షల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

త్వరలో స్కిల్ సెన్సెస్-2024

- నోడల్ ఏజెన్సీగా ఏపీఎస్ఎస్‌డీసీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రస్తుతం యువతకు ఉన్న నైపుణ్యం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించడానికి స్కిల్ సెన్సెస్-2024 చేపడుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు ఐదో సంతకంగా చేసిన స్కిల్ సెన్సెస్-2024కు సంబంధించి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)ని నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెన్సెస్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15 నుంచి 29 ఏళ్లలోపు ఉన్న యువతలో నైపుణ్యాలను గుర్తించడమే కాకుండా వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణ అవసరమవుతుంది, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అవసరం అవుతుంది, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏంటి, ఇందుకోసం పాలసీ తీసుకురావడం ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

'ఎక్స్'లో మంత్రి నారా లోకేశ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రులకు శాఖలను కేటాయించిన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. 'హెచ్ఆర్‌డీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీ శాఖల మంత్రిగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కల్పించిన చంద్రబాబు గారికి ధన్యవాదాలు. నాడు పల్లె సేవే పరమాత్ముడి సేవ అని భావించి పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గ్రామాల రూపురేఖలు మార్చాను. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రిగా అనేక కంపెనీలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాను. గత అనుభవం నేర్పిన పాఠాలతో ఇప్పుడు మరింత సమర్థవంతంగా పనిచేస్తాను. యువగళం పాదయాత్రలో కేజీ నుంచి పీజీ వరకూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తానని హామీ ఇచ్చాను. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకున్న నాకు గ్రామీణ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాన్ని ఒక పవిత్రమైన బాధ్యతగా స్వీకరిస్తున్నాను. రాష్ట్రానికి ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు తీసుకొచ్చి పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తాను' అని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

లబ్ధిదారులకు మేలు జరిగేలా ఇళ్ల పథకం

గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిరుపేదలైన లబ్ధిదారులకు మేలు జరిగేలా ఇళ్ల పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. మంత్రిగా నియమితులైన ఆయన శుక్రవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. త్వరలోనే శాఖాపరమైన సమీక్ష నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

బీఎస్ఎన్ఎల్ మిగులు భూములు, బిల్డింగుల మానిటైజేషన్

- ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్ బిడ్‌కు అవకాశం
- ఏపీ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం



మధురానగర్(విజయవాడ సెంట్రల్): బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ విస్తరణ, మౌలిక సదుపాయాల అప్‌గ్రేడేషన్‌లో పెట్టుబడి పెట్టేందుకు బీఎస్ఎన్ఎల్ మిగులు భూములు, బిల్డింగ్ ఆస్తులు మానిటైజేషన్ చేస్తున్నట్లు ఏపీ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం తెలిపారు. విజయవాడ చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ ప్రణాళికలలో భాగంగా పరికరాలు సూక్ష్మీకరణ, నూతన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా మిగులుగా మారిన బీఎస్ఎన్ఎల్ ల్యాండ్ పార్శిల్స్, భవనాల నుంచి బీఎస్ఎన్ఎల్ అధనపు ఆదాయం ఆర్జిస్తుందన్నారు. మిగులు భూముల వివరాలు http://landmonitisation.bsnl.co.in లోను, భవనాల వివరాలు http://rental.bsnl.co.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ మిగులు భూములు, బిల్డింగ్ ఆస్తులు అమ్మకం, లీజు ద్వారా మిగులు స్థిరాస్తుల విలువను అన్‌లాక్ చేసినట్లు చెప్పారు. ఏపీ సర్కిల్‌లో గత ఆర్థిక సంవత్సరంలో రెండు మిగులు భూములను విక్రయించటం ద్వారా రూ.40 కోట్ల ఆదాయం ఆర్జించామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ప్రదేశాలలో మిగులు నిర్మాణ స్థలాలను లీజుకు ఇవ్వటం ద్వారా సుమారు రూ.10 కోట్ల ఆదాయం లభించిందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రముఖ ప్రాంతాల్లో 27 మిగులు భూములను ఎంఎస్‌టీసీ ద్వారా ఈ-వేలంలో ఉంచినట్లు తెలిపారు. రాష్ట్రంలోని తుని బ్యాంక్ కాలనీలోని 6,377 చ.మీ ఖాళీ స్థలం, పాలకొల్లులోని స్టోర్‌యార్డ్ కాంపౌండ్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ దగ్గర 4,180 చ.మీ స్థలం, కొండపల్లి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కాంపౌండ్ వద్ద 6 వేల చ.మీ స్థలానికి ఆన్‌లైన్ ద్వారా బిడ్‌లు స్వీకరిస్తున్నామన్నారు. వీటికి గానూ వరుసగా రూ.12.94 కోట్లు, రూ. 11.19 కోట్లు, రూ.11.02 కోట్లు రిజర్వ్ ధరను నిర్ణయించినట్లు తెలిపారు. వీటికి ఇప్పటికే బిడ్ స్వీకరణ ప్రారంభమైందని, ఈ నెల 30వ తేదీలోపు ఆసక్తి కలిగిన వారు బిడ్‌లను దాఖలు చేయాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ మిగులు భూమి, భవన ఆస్తుల లీజు, కొనుగోలు తదితర సమాచారం కోసం 9490100072 నంబర్ వాట్సప్, afm.apb@bsnl.co.in ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

జీ7 ప్యాకేజీ ఎప్పుడు? ఎలా?

యుద్ధంలో నష్టపోయిన ఉక్రెయిన్‌కు రూ.4.17 లక్షల కోట్ల రుణ ప్యాకేజీ

- స్తంభింపజేసిన రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయంతో రుణం చెల్లింపు
- నిర్ణయం తీసుకున్న జీ7 దేశాలు..
- రుణసాయంలో ఇబ్బందులు ఉన్నాయంటున్న నిపుణులు
- చట్టపరంగా సమస్యలు ఎదురవుతాయని వెల్లడి
- పశ్చిమ దేశాల నిర్ణయంపై రష్యా ఆగ్రహం
- ప్రతీకారం తప్పదని హెచ్చరిక


జీ7 వర్కింగ్ సెషన్‌లో అధినేతల చర్చలు

28 నెలలుగా కొనసాగుతున్న రష్యా దండయాత్రతో ఉక్రెయిన్ చాలావరకు ధ్వంసమైంది. యుద్ధం ఆగేదెన్నడో, ఉక్రెయిన్ పునర్నిర్మాణం మొదలయ్యేదెప్పుడో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో జీ7 దేశాల కూటమి 50 బిలియన్ డాలర్ల (రూ.4.17 లక్షల కోట్లు) రుణ ప్యాకేజీని ప్రకటించడం ఉక్రెయిన్‌కు ఎంతగానో ఊరట కలిగించే పరిణామం అనే చెప్పాలి. వివిధ దేశాల్లో ఉన్న రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయం నుంచే ఈ ప్యాకేజీని ఉక్రెయిన్‌కు ఇవ్వనున్నట్లు జీ7 దేశాలు వెల్లడించాయి. దీనిపై ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ హర్షం వ్యక్తం చేశారు. రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ విజేతగా నిలవడానికి ఈ సాయం ఒక గొప్ప ముందడుగు అని అభివర్ణించారు. ఈ నేపథ్యంలో జీ7 ప్రకటించిన రుణ ప్యాకేజీ, ఉక్రెయిన్‌కు కలిగే లబ్ధి, ఇందులో ఇమిడి ఉన్న ఇబ్బందులు, వివిధ దేశాలు స్తంభింపజేసిన రష్యా ఆస్తుల గురించి తెలుసుకుందాం.

2022 ఫిబ్రవరిలో రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై హఠాత్తుగా దాడికి దిగింది. క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఉక్రెయిన్ సైతం ఎదురుదాడి ప్రారంభించింది. ఇరు దేశాల మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. వేలాది మంది సామాన్య ప్రజలు, సైనికులు మరణించారు. ఉక్రెయిన్‌పై దాడులు ఆపాలంటూ పశ్చిమ దేశాలు హెచ్చరించినా రష్యా లెక్కచేయడం లేదు. దీంతో రష్యాను ఆర్థికంగా దెబ్బకొట్టడానికి తమ దేశంలో ఉన్న రష్యన్ సెంట్రల్ బ్యాంక్ ఆస్తులను పశ్చిమ దేశాలు స్తంభింపజేశాయి. ఈ ఆస్తుల విలువ 300 బిలియన్ డాలర్ల (రూ.25.06 లక్షల కోట్లు) వరకు ఉంటుంది. వీటిపై ప్రతి సంవత్సరం 3 బిలియన్ డాలర్ల (రూ.25 వేల కోట్లు) వడ్డీ, ఆదాయం లభిస్తోంది. రష్యా ఆస్తులు చాలావరకు యూరోపా దేశాల్లో ఉన్నాయి. ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్నందుకు రష్యా పరిహారం చెల్లించాల్సిందేనని అమెరికా సహా పశ్చిమ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. అందుకు రష్యా ఒప్పుకోవడం లేదు. దాంతో రష్యా ఆస్తులపై వస్తున్న వడ్డీని, ఆదాయాన్ని పరిహారం కింద ఉక్రెయిన్‌కు ఇవ్వాలని తాజాగా జీ7 దేశాలు నిర్ణయించాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇబ్బందులు ఏమిటి?

విదేశాల్లో ఉన్న ఆస్తులు ఒకవేళ మళ్లీ రష్యా నియంత్రణలోకి వస్తే రుణాన్ని తిరిగి చెల్లించడం కష్టమే. స్తంభింపజేసిన రష్యా ఆస్తులను శాంతి చర్చల్లో భాగంగా విడుదల చేయాల్సి వస్తే రుణాన్ని చెల్లించడానికి జీ7 దేశాలు మరో మార్గం వెతుక్కోవాలి. మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల రష్యా ఆస్తులపై కొన్నిసార్లు అనుకున్నంత వడ్డీ గానీ, ఆదాయం గానీ రాకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో రుణం తిరిగి చెల్లించడంలో ఇబ్బందులెదురవుతాయి. అలాగే రుణ భారాన్ని జీ7 దేశాలన్నీ పంచుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. మరో వారం రోజుల్లో తుది ప్రణాళికను ఖరారు చేయనున్నారు. యూరప్‌లోని రష్యా ఆస్తులపై ఆంక్షలను కొనసాగించడానికి ప్రతిఏటా యూరోపియన్ యూనియన్(ఈయూ)లో ఓటింగ్ జరుగుతోంది. ఈయూలోని ఏ ఒక్క సభ్యదేశం వీటో చేసినా ఆంక్షలు రద్దవుతాయి. ఆస్తులు రష్యా అధీనంలోకి వెళ్లిపోతాయి. ఈయూలోని హంగేరీ దేశం ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్ పట్ల సానుకూలంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ హంగేరీ వీటో చేస్తే ఉక్రెయిన్ రుణ ప్యాకేజీ ప్రణాళికలు మొత్తం తలకిందులవుతాయి. తమ ఆస్తులపై వచ్చే వడ్డీని, ఆదాయాన్ని పశ్చిమ దేశాలు మింగేస్తామంటే రష్యా చూస్తూ కూర్చోదు కదా! కచ్చితంగా ప్రతీకార చర్యలకు దిగుతుంది. రష్యాలోనూ పశ్చిమ దేశాల ఆస్తులున్నాయి. వాటిని రష్యా ప్రభుత్వం గతంలోనే స్తంభింపజేసింది. తమ ఆస్తులపై వడ్డీని కాజేసినందుకు ప్రతిచర్యగా పశ్చిమదేశాల ఆస్తులపై వడ్డీని సైతం రష్యా లాక్కొనే అవకాశం లేకపోలేదు.

ఏ దేశంలో రష్యాకు ఎన్ని ఆస్తులు?

దేశం	రష్యా ఆస్తులు(రూ.లలో)
ఫ్రాన్స్	5.93 లక్షల కోట్లు
జపాన్	4.84 లక్షల కోట్లు
జర్మనీ	4.59 లక్షల కోట్లు
అమెరికా	3.17 లక్షల కోట్లు
యూకే	2.17 లక్షల కోట్లు
ఆస్ట్రేలియా	1.42 లక్షల కోట్లు
కెనడా	1.33 లక్షల కోట్లు

ఇది ముమ్మాటికీ దొంగతనమే: పుతిన్



రష్యా ఆస్తులపై వచ్చే ఆదాయంతో ఉక్రెయిన్‌కు ప్యాకేజీ ఇవ్వాలన్న జీ7 దేశాల నిర్ణయంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ దొంగతనమేనని చెప్పారు. చోరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. తమ ఆస్తుల జోలికి వస్తే ప్రతీకారం తీర్చుకుంటామని, తగిన బుద్ధి చెప్తామని పేర్కొన్నారు. పుతిన్ శుక్రవారం రష్యా విదేశాంగ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. జీ7 దేశాల నిర్ణయంపై చర్చించారు. ఎవరు ఎన్ని ట్రిక్కులు ప్లే చేసినా దొంగతనం కచ్చితంగా దొంగతనమే అవుతుందన్నారు. జీ7 దేశాల నిర్ణయాన్ని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా శుక్రవారం ఖండించారు. ఈ నిర్ణయం చట్టపరంగా చెల్లదని తేల్చిచెప్పారు.

హక్కులు బదిలీ చేయడం సాధ్యమేనా?

రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయాన్ని నష్టపరిహారంగా ఉక్రెయిన్‌కు ఇవ్వాలనుకోవడం బాగానే ఉన్నప్పటికీ ఇందులో చట్టపరమైన అవరోధాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. రష్యా అంగీకారం లేకుండా ఇలా చేయడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంటున్నారు. మొండిగా ముందుకెళ్తే తీవ్ర వివాదానికి దారితీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. తొలుత న్యాయస్థానాల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. ఒక దేశానికి సంబంధించిన ఆస్తులను స్తంభింపజేసిప్పటికీ వాటిపై హక్కులను ఇతర దేశాలకు బదిలీ చేయడం సాధ్యం కాదు. అవి ఎప్పటికైనా సొంత దేశానికే చెందుతాయి. భౌగోళికంగా తమ దేశంలో ఉన్న ఇతర దేశాల ఆస్తులను ఆయా దేశాల అనుమతి లేకుండా స్వాధీనం చేసుకొని అనుభవిస్తామంటే కుదరదు.

రష్యా ఆస్తులను ఎలా వాడుకోవచ్చు?

రష్యా ఆస్తులపై వచ్చే వడ్డీ, ఆదాయాన్ని నేరుగా ఉక్రెయిన్‌కు ఇచ్చేసే అవకాశం లేదు. జీ7లోని ఏ దేశమైనా అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకొని ఆ సొమ్మును ఉక్రెయిన్‌కు ఇవ్వొచ్చు. రుణాన్ని తీర్చేయడానికి రష్యా ఆస్తులపై వస్తున్న వడ్డీ, ఆదాయాన్ని చెల్లించవచ్చు. తమకు అందే సొమ్మును ఆయుధాలు కొనుగోలు చేయడానికి, దేశ పునర్నిర్మాణానికి ఉక్రెయిన్ ఉపయోగించుకొనేందుకు ఆస్కారం ఉంది. జీ7 నుంచి రుణ ప్యాకేజీ ఇప్పటికిప్పుడు ఉక్రెయిన్‌కు చేరే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. ప్రపంచ బ్యాంకు ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసిన ఓ నివేదిక ప్రకారం.. ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి రాబోయే పదేళ్లలో 486 బిలియన్ డాలర్లు (రూ.40.58 లక్షల కోట్లు) అవసరం.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 22 నుంచి!

- ఆగస్టు 9 దాకా సమావేశాలు
- పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 22 నుంచి ఆగస్టు 9వ తేదీ దాకా జరుగుతాయని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశాల్లో తొలిరోజే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతారని తెలిపాయి. బడ్జెట్‌కు ముందు వివిధ శాఖలతో జరిపే సంప్రదింపులను ఆర్థిక శాఖ ఈనెల 17 నుంచి ప్రారంభించనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గడిచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన ఆర్థిక విజయాలను, ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదిగిన క్రమాన్ని ఆమె ఆనాడు వివరించారు. కాగా 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 24 నుంచి జూలై 3 దాకా జరగనున్నాయి. 24, 25 తేదీల్లో నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు దీన్ని ధృవీకరించారు.



వయనాడ్ నుంచి ప్రియాంక?

రాయ్‌బరేలీ వైపే రాహుల్ మొగ్గు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ స్థానాన్ని వదులుకొని, ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నారని ఏఐసీసీ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాహుల్ రాజీనామా చేసిన వెంటనే ఆయన సోదరి ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి రాజకీయ అరంగేట్రం చేసే అవకాశం ఉందని సమాచారం. నియోజకవర్గంలో ప్రియాంక రాకను స్వాగతిస్తూ ఇప్పటికే పోస్టర్లు వెలిశాయి. ఏ స్థానాన్ని వదులుకోవాలన్న దానిపై కొంత డైలమా ఉందని స్వయంగా రాహుల్ గాంధీ పేర్కొన్నప్పటికీ, రాయ్‌బరేలీతో గాంధీ కుటుంబానికి ఉన్న అనుబంధం, ఉత్తరప్రదేశ్ క్రియాశీల రాజకీయాల్లో రాహుల్ అవసరం దృష్ట్యా ఆయన అక్కడే కొనసాగాలని పార్టీ పెద్దల నుంచి భారీగా వస్తున్న వినతులపై రాహుల్ సానుకూలత వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. తన రాజీనామా ఆమోదం పొందిన వెంటనే వయనాడ్‌లో భారీ బహిరంగ సభ ద్వారా ప్రియాంకను నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంతో పాటు ప్రచారాన్ని రాహుల్ మొదలుపెడతారని ఏఐసీసీ వర్గాలు అంటున్నాయి.

టెక్నాలజీలో గుత్తాధిపత్యానికి తెరపడాలి

- సమ్మిళిత సమాజానికి టెక్నాలజీ బాటలు వేయాలి
- జీ7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ ఉద్బోధ

బరీ(ఇటలీ): సాంకేతికత అనేది కేవలం అతి కొద్ది సంస్థలు, దేశాల చేతుల్లో ఉండకూడదని, ఇలాంటి గుత్తాధిపత్యానికి తెరపడాలని ప్రధాని నరేంద్ర మోదీ అభిలషించారు. ఇటలీలోని బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో జరుగుతున్న జీ7 దేశాల 50వ శిఖరాగ్ర సదస్సులో శుక్రవారం ప్రధాని మోదీ సాంకేతికత అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. '' మనం వినూత్న టెక్నాలజీని సృష్టించాలేగానీ విధ్వంసకర సాంకేతికతను కాదు. సాంకేతికతో గుత్తాధిపత్యం పోవాలి. సాంకేతికతను ప్రజాస్వామ్యయుతంచేయాలి. అప్పుడే సమాజంలోని అన్ని వర్గాలకు దానిని చేరువ చేయగలం. సాంకేతికత ఫలాలు అందరికీ అందాలి. అప్పుడే సమ్మిళిత సమాజాభివృద్ధికి బాటలు వేసిన వారమవుతాం. మానవీయ విలువలున్న సాంకేతికత ద్వారా మెరుగైన భవిష్యత్తు కోసం భారత్ కలలు కంటోంది. కృత్రిమ మేథపై జాతీయ విధానాన్ని రూపొందించి అమలుచేస్తున్న అతి కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటి. ఈ వ్యూహంలో భాగంగానే ఈ ఏడాది భారత్‌లో 'ఏఐ మిషన్'కు అంకురార్పణ చేశాం. అందరికీ ఏఐ అనేది దీని మంత్రం. 'గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ఏఐ'లో వ్యవస్థాపక సభ్యునిగా, ఈ కూటమి ప్రస్తుత సారథిగా అన్ని దేశాల మధ్య సహకారాన్ని ఆశిస్తున్నా'' అని మోదీ అన్నారు.

ఏఐపై అంతర్జాతీయ నియమావళి ఉండాల్సిందే

''విస్తృతమవుతున్న ఏఐ రంగంపై అంతర్జాతీయంగా ఏకరూప నియమావళి ఉండాల్సిందే. గత ఏడాది ఢిల్లీ వేదికగా జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులోనూ భారత్ ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. భవిష్యత్తులోనూ పారదర్శక, స్వేచ్ఛా, సురక్షిత, సులభతర వినియోగ, బాధ్యతాయుత ఏఐ కోసం అన్ని దేశాలతో భారత్ కలిసి పనిచేస్తుంది. ఇంధనం పైనా భారత వైఖరి మారదు. ఇంధనం అందరికీ అందుబాటులో ఉండాలి. అందరూ వినియోగించుకోగలగాలి. అందరికీ ఆ స్తోమత ఉండాలి. ఇందుకు అందరి ఆమోదం కూడా ఉండాలి'' అని అన్నారు.

గ్లోబల్ సౌత్ దేశాలపై భారం

''అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిర, ఉద్రిక్త పరిస్థితుల దుష్ప్రభావాలు ఏ పాపం చేయని గ్లోబల్ సౌత్ దేశాలపై పడుతున్నాయి. అందుకే మా సమస్యలు, ప్రాధాన్యాలను ఇలాంటి ప్రపంచ వేదిక సాక్షిగా చాటేందుకు భారత్ తన వంతు బాధ్యతగా ముందుకొచ్చింది. అందులో భాగంగానే ఆఫ్రికాకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. గత ఏడాది జీ20 సారథిగా భారత్ ఆఫ్రికా యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇప్పించినందుకు గర్వపడుతోంది. ఆఫ్రికా దేశాల ఆర్థిక, సామాజిక, భద్రత, సుస్థిరాభివృద్ధికి భారత్ తన వంతు సాయం అందిస్తోంది. ఇక మీదటా ఈ సాయం కొనసాగుతోంది'' అని అన్నారు.

'లైఫ్'ను పట్టించుకోండి

''పర్యావరణహిత జీవితశైలి(ఎల్ఐఎఫ్ఈ– లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)ని అలవర్చుకోండి. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత్‌లో ప్రారంభించిన 'మట్టి మాతృమూర్తికోసం మొక్క' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటండి. అందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నా. ఈ ప్రజాఉద్యమాన్ని అంతర్జాతీయ బాధ్యతను భావించి ప్రపంచ దేశాలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలి. మొక్కల పెంపకం భూమిపై పచ్చదనాన్ని పెంచుతుంది. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 2070 ఏడాదికల్లా కర్బన తటస్థత(కార్బన్ నెట్‌జీరో) సాధించేందుకు భారత్ శతథా కృషిచేస్తోంది. హరిత యుగం మళ్లీ సాకారమయ్యేలా మనందరి కలిసి కృషిచేద్దాం'' అని మోదీ పిలుపునిచ్చారు.

'నీట్'పై కేంద్రం, ఎన్‌టీఏకు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: నీట్–యూజీలో చోటుచేసుకున్న అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. కేంద్ర ప్రభుత్వానికి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి నోటీసులు జారీ చేసింది. హతేన్సింగ్ కాశ్యప్‌తోపాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ శుక్రవారం విచారణ చేపట్టింది. రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ కేంద్రానికి, ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. రాజస్తాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు జరిగాయని ప్రస్తావించారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. అనవసరమైన భావోద్వేగపూరిత వాదనలు చేయొద్దని హితవు పలికింది.

యడ్యూరప్పకు హైకోర్టులో ఊరట

బెంగళూరు: మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడ్యూరప్పకు శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. యడ్యూరప్పను అరెస్టు చేయవద్దని కర్ణాటక హైకోర్టు సీఐడీ పోలీసులను ఆదేశించింది. పోస్కో చట్టం కింద నమోదైన కేసును విచారిస్తున్న సీఐడీ ఎదుట ఈనెల 17న హాజరుకావాలని బీజేపీ సీనియర్ నేత, 81 ఏళ్ల యడ్యూరప్పను హైకోర్టు ఆదేశించింది.

అరుంధతి రాయ్‌పై ఉపా కేసు



న్యూఢిల్లీ: 2010లో రెచ్చగొట్టే ప్రసంగం చేశారనే అభియోగాలపై అత్యంత కఠినమైన 'చట్టవిరుద్ధ కార్యాకలాపాల నిరోధక చట్టం (ఉపా)' కింద రచయిత్రి అరుంధతి రాయ్‌పై విచారణ జరపడానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా శుక్రవారం అనుమతి మంజూరు చేశారు. ఢిల్లీలో 2010 అక్టోబరు 21న 'ఆజాదీ.. ది ఓన్లీ వే' పేరిట జరిగిన సదస్సులో అరుంధతి రాయ్, కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అభియోగం.

భారత్‌కు చేరుకున్న 'కువైట్' బాధితుల మృతదేహాలు


కొచ్చిలో మృతులకు నివాళులర్పిస్తున్న కేరళ సీఎం విజయన్ తదితరులు

కొచ్చి: మూడు రోజుల క్రితం ఎడారి దేశం కువైట్‌లో వలసకార్మికులు ఉంటున్న భవంతిలో సంభవించిన అగ్నిప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 31 మంది భారతీయుల మృతదేహాలు స్వదేశానికి చేరుకున్నాయి. వీరిలో అత్యధికంగా 23 మంది కేరళీయులు ఉన్నారు. మృతుల్లో కర్ణాటక సంబంధించి ఒకరు, తమిళనాడుకు చెందిన ఏడుగురి మృతదేహాలనూ తీసుకొచ్చారు. మృతదేహాలను తొలుత శుక్రవారం ఉదయం కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకొచ్చారు. ఎయిర్‌పోర్ట్‌లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ వారికి నివాళులర్పించారు. '' జీవనోపాధి కోసం విదేశం వెళ్లి విగతజీవులైన బడుగుజీవుల కష్టాలను కేంద్రప్రభుత్వం పట్టించుకోవాలి. మృతుల కుటుంబాలకు ఇచ్చే ఆర్థికసాయం సరిపోదు' అని సీఎం అన్నారు. కువైట్ నుంచి మృతదేహాల తరలింపు ప్రక్రియను దగ్గరుంచి చూసుకున్న విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తోపాటు తమిళనాడు మైనారిటీ సంక్షేమ మంత్రి కేఎస్ మస్తాన్‌లు సైతం పార్థివదేహాల వద్ద నివాళులర్పించారు.

మృతుల్లో ముగ్గురు తెలుగువారు

అగ్నిప్రమాదంలో ముగ్గురు తెలుగువ్యక్తులు సైతం చనిపోయారని ఆంధ్రప్రదేశ్ నాన్–రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన టి. లోకనాథం, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎం.సత్యనారాయణ, ఎం.ఈశ్వరుడు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని ఏపీఎన్ఆర్‌టీఎస్ పేర్కొంది. '' సొంత పనిమీద స్వదేశానికి వచ్చిన లోకనాథం తిరిగి కువైట్ బయల్దేరారు. స్వస్థలం నుంచి తొలుత జూన్ 5న హైదరాబాద్‌కు వచ్చి నాలుగు రోజులు ఉండి తర్వాత జూన్ 11న కువైట్ చేరుకున్నారు. ఆయన భవంతికి వచ్చి బసచేసిన అదే రోజున అగ్నిప్రమాదం జరిగి తుదిశ్వాస విడిచారు'' అని లోకనాథం బంధువు శాంతారావు చెప్పారు.

నాటో యత్నం ఆపండి

- రష్యా ఆక్రమిత ప్రాంతాలను వదిలేయండి
- అలా అయితే తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తాం
- ఉక్రెయిన్‌కు రష్యా తాజా ఆఫర్

మాస్కో: భీకరదాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఉక్రెయిన్ పట్ల దయ చూపుతామని మొట్టమొదటిసారిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వయంగా వ్యాఖ్యానించారు. తమ షరతులకు ఉక్రెయిన్ ఒప్పుకుంటే తక్షణం కాల్పుల విరమణ అమలుచేస్తానని ప్రకటించారు. శుక్రవారం మాస్కోలోని రష్యా విదేశాంగ శాఖ కార్యాలయంలో పుతిన్ ప్రసంగించారు. ఉక్రెయిన్ సమస్యపై జీ7 దేశాలు ఇటలీలో భేటీ అయిన వేళ పుతిన్ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. '' 2022లో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య తర్వాత మా అధీనంలోకి వచ్చిన నాలుగు ప్రాంతాలపై ఉక్రెయిన్ ఆశ వదులుకోవాలి. ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి(నాటో)లో చేరే ప్రయత్నాలను ఉక్రెయిన్ తక్షణం ఉపసంహరించుకోవాలి. ఈ షరతులకు ఉక్రెయిన్ ఒప్పుకుంటే వెంటనే తమ సైనిక చర్య ఆపేసి తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తా'' అని పుతిన్ వ్యాఖ్యానించారు. ''ఉక్రెయిన్‌తో ఘర్షణాత్మక ప్రతిష్టంభనకు చరమగతం పాడేందుకు రష్యా సిద్ధంగా ఉంది. ఇక ఆలస్యం చేయకుండా చర్చలు జరిపేందుకు రెడీగా ఉన్నాం. అయితే మాకు కొన్ని షరతులు ఉన్నాయి. అణ్వస్త్రదేశంగా ఉక్రెయిన్ అవతరించకూడదు. రష్యాపై అన్ని పశ్చిమదేశాలు విధించిన ఆంక్షలను ఎత్తేయాలి'' అని పుతిన్ స్పష్టం చేశారు.


శుక్రవారం జీ7 సదస్సు ప్రాంగణంలో పోప్ ఫ్రాన్సిస్‌తో మోదీ ఆత్మీయ ఆలింగనం

కృత్రిమ మేధపై పోప్ ఆందోళన

బరీ(ఇటలీ): రోజురోజుకూ విశ్వవ్యాప్తంగా విస్తృతమవుతున్న కృత్రిమ మేధపై పోప్ ఫ్రాన్సిస్ ఒకింత ఆందోళన వ్యక్తంచేశారు. కృత్రిమ మేధ అభివృద్ధి, వినియోగంలో మనిషి గౌరవానికి భంగం కలుగకుండా చూసుకోవాలని జీ7 శిఖరాగ్ర సదస్సు వేదికగా పోప్ పిలుపునిచ్చారు. ఇంతటి అత్యాధునిక సాంకేతికతలు మితిమీరితే మానవ సంబంధాలు సైతం కృత్రిమంగా మారే ప్రమాదముందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. 'మానవ భవిష్యత్తుకు కృత్రిమ మేధ(ఏఐ) భరోసా, బెంగ' అంశంపై పోప్ మాట్లాడారు. అంతర్జాతీయ సమావేశాలు, ప్రభుత్వాల విధానపర నిర్ణయాలు, కార్పొరేట్ బోర్డుల వంటి అంశాలే ఎజెండాగా సాగే జీ7 వంటి అగ్రస్థాయి కూటమి భేటీలో పోప్ మాట్లాడటం చరిత్రలో ఇదే తొలిసారికావడం విశేషం. '' ఏఐ అనేది మానవ కేంద్రీకృతంగా ఎదిగేలా రాజకీయ నేతలు ఓ కంట కనిపెట్టాలి. మనుషులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలను మనుషులే తీసుకోవాలిగానీ మెషీన్లు కాదు. మెషీన్ల నిర్ణయాలపై ఆధారపడి, కనీసం మన జీవితాల గురించి కూడా సొంతంగా ఆలోచించలేని పరిస్థితిని మనం కోరుకోవద్దు' అని అన్నారు. ఓపెన్‌ఏఐ వారి చాట్‌జీపీటీ చాట్‌బోట్ తరహా ఏఐ వినియోగం విస్తృతమవుతున్న తరుణంలో ఏఐకు పూర్తిగా దాసోహమవడంపై ప్రపంచదేశాలు, అంతర్జాతీయ సంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హితవు పలికారు.

భారత్‌లో పర్యటించండి: పోప్‌కు ఆహ్వానం

జీ7 సదస్సుకు విచ్చేసిన పోప్ ఫ్రాన్సిస్‌ను మోదీ కలిశారు. వీల్‌చైర్‌లో కూర్చున్న పోప్‌ను మోదీ ఆప్యాయంగా ఆలింగం చేసుకున్నారు. కొద్దిసేపు మాట్లాడారు. భారత్‌లో పర్యటించాలని పోప్‌ను మోదీ ఆహ్వానించారు.

చర్చలు, దౌత్యంతోనే ఉక్రెయిన్‌లో శాంతి

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ సందర్భంగా మోదీ వ్యాఖ్య



బరీ(ఇటలీ): ఉక్రెయిన్‌లో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని భారత ప్రధాని మోదీ ఆకాంక్షించారు. చర్చలు, దౌత్య మార్గాలతోనే ఉక్రెయిన్‌లో శాంతి సాధ్యమని పేర్కొన్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఇటలీలోని అపూలియో ప్రాంతంలోని విలాసవంత బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌కు మోదీ శుక్రవారం చేరుకున్నారు. జీ7లో పాల్గొనేందుకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో మోదీ అక్కడే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉక్రెయిన్ తాజా పరిణామాలపై నేతలిద్దరూ అభిప్రాయాలు పంచుకున్నారు. ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని తాము కోరుకుంటున్నట్లు మోదీ తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతికి చొరవ చూపాలని మోదీని జెలెన్‌స్కీ కోరారు. ' ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన కోసం 15, 16 తేదీల్లో స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న శాంతి సదస్సుకు భారత్ అత్యున్నత దౌత్యబృందాన్ని పంపుతున్నందుకు మోదీకి కృతజ్ఞతలు. నల్లసముద్రం మీదుగా ఎగుమతుల కారిడార్‌పైనా చర్చించాం. వ్యవసాయంలో నూతన సాంకేతికతల వినియోగం అనుభవాలను మాతో పంచుకోవాలని కోరాం' అని జెలెన్‌స్కీ చెప్పారు. జెలెన్‌స్కీతో భేటీ వివరాలను తర్వాత మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'జెలెన్‌స్కీతో చర్చ ఫలవంతంగా సాగింది. భారత్–ఉక్రెయిన్ మధ్య సంబంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉంది. ఉక్రెయిన్‌లో సంక్షోభం సమసిపోవాలంటే మానవ కేంద్రిత పరిష్కార మార్గమే శరణ్యం. చర్చలు, దౌత్యమార్గంలోనే శాంతి వెల్లివిరిసేలా చేయగలం. శాంతియుత పరిష్కారం కోసం ఎంతటి సాయమైనా చేసేందుకు భారత్ సదా సిద్ధంగా ఉంది' అని మోదీ వ్యాఖ్యానించారు. మూడోసారి ప్రధాని అయినందుకు మోదీకి జెలెన్‌స్కీ అభినందనలు తెలిపారు.

స్వేచ్ఛా వాణిజ్యంపై మోదీ, రిషీ సమీక్ష



జీ7 భేటీ కోసం వచ్చిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. భారత్–యూకే వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టంచేస్తామని ప్రధాని మోదీ అన్నారు. బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో పురోగతిపై సునాక్‌తో కలిసి మోదీ సమీక్ష చేశారు. మూడోసారి ప్రధాని అయ్యారంటూ మోదీని సునాక్ అభినందనలు తెలపగా త్వరలో జరగబోయే బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలంటూ సునాక్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు చేయాల్సిన కృషిపై కూలంకషంగా చర్చించారు. '' రక్షణ, భద్రత, వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలు, కీలక, అధునాతన సాంకేతిక రంగాలతోపాటు ప్రజాసంబంధాల్లోనూ ఇరుదేశాల మధ్య భాగస్వామం మరింత బలపడటంపై ఇరు నేతలు చర్చించారు'' అని భేటీ తర్వాత భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో చర్చలు



జీ7 సమావేశం కోసం విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తోనూ మోదీ చర్చలు జరిపారు. 'మా ఇద్దరి మధ్య ఏడాదికాలంలో జరిగిన నాలుగో భేటీ ఇది. అద్భుతంగా జరిగింది. ఇండో-పసిఫిక్ రోడ్‌మ్యాప్, హొరిజాన్ 2047 సహా రక్షణ, అణు, అంతరిక్షం, సముద్రమార్గంలో వాణిజ్యం, విద్య, వాతావరణ మార్పులు, డిజిటల్ మౌలిక వసతులు, కనెక్టివిటీ, కృత్రిమ మేథ రంగాల్లో పరస్పర తోడ్పాటుపై చర్చలు జరిపాం. యువతలో ఆవిష్కరణలు, పరిశోధనలపై మరింత మక్కువ పెంచేలా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనేదీ మాట్లాడుకున్నాం' అని మోదీ చెప్పారు. శుక్రవారం ఇటలీకి చేరుకున్నాక మోదీ తొలుత మేక్రాన్‌ను కలిశారు. మూడోసారి ప్రధాని అయ్యాక ఒక అంతర్జాతీయ నేతతో మోదీ సమావేశంకావడం ఇదే తొలిసారి. జూలై 26 నుంచి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో సమ్మర్ ఒలంపిక్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మేక్రాన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

మోదీకి మెలోనీ సాదర స్వాగతం



భేటీకి వస్తున్న మోదీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఎదురెళ్లిమరీ సాదర స్వాగతం పలికారు. మోదీ ఆమెకు నమస్కారం చేశారు. తర్వాత ఇద్దరూ పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. జీ7 భేటీకి వచ్చిన అగ్రనేతలనూ మోదీ కలిశారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా, యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్, జోర్డాన్ రాజు అబ్దుల్లా, జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌తోనూ మోదీ మాట్లాడారు.

‘ఇఫ్కో’ సూక్ష్మ ఎరువులకు పెరుగుతున్న డిమాండ్

దేశీయంగా పెరుగుతున్న నానో ఎరువుల వినియోగం

- అన్ని పోషకాలతో పర్యావరణ హితంగా నానో ఎరువులు
- సంప్రదాయ ఎరువులకంటే ధర తక్కువ
- అమెరికాతో సహా పలు దేశాలూ ఆసక్తి
- ఇఫ్కో బాటలోనే కోరమాండల్, పీపీఎల్‌లో సూక్ష్మ ఎరువుల తయారీ
- మూడేళ్లలో మూడు రెట్లు పెరిగిన అమ్మకాలు
- వినియోగంలో దక్షిణాది రాష్ట్రాల్లో రెండో స్థానంలో ఏపీ
- వచ్చే ఖరీఫ్ నుంచి నానో కాపర్, నానో జింక్ ఎరువులు



సాక్షి, అమరావతి: ఎరువుల్లో నానో ఎరువులు ఓ సంచలనం. సంప్రదాయ ఎరువులకు భిన్నంగా నానో టెక్నాలజీ ద్వారా ద్రవ రూపంలో అభివృద్ధి చేసిన ఈ సూక్ష్మ ఎరువులను సంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా భారత రైతులు ఎరువులు సహకార సంస్థ (ఇఫ్కో) మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఈ నానో ఎరువులకు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. విదేశాలు సైతం ఇఫ్కో సూక్ష్మ ఎరువుల కోసం క్యూకడుతున్నాయి. మరో వైపు దేశీయంగా ఇతర ఎరువుల కంపెనీలు సైతం వీటి తయారీకి ముందుకొస్తున్నాయి.

నానో యూరియాకు పేటెంట్ హక్కు

ప్రపంచంలోనే తొలిసారిగా నానో బయో టెక్నాలజీ ద్వారా ఇఫ్కో సూక్ష్మ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టింది. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన సూక్ష్మ ఎరువులకు ఇఫ్కో పేటెంట్ హక్కు పొందింది. నానో యూరియాను 2021-22 సీజన్‌లో భారతీయ మార్కెట్‌లోకి విడుదల చేసిన ఇఫ్కో గతేడాది నుంచి నానో డీఏపీని కూడా తీసుకొచ్చింది. 500 మిల్లీ లీటర్ల బాటిల్‌లో ఉండే నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాకు సమానం. బస్తా యూరియా ధర రూ.266.50 ఉంటే, నానో యూరియా బాటిల్ ధర రూ.225 మాత్రమే. డీఏపీ ఎరువుల బ్యాగ్ ధర రూ.1,350గా ఉండగా, నానో డీఏపీ 500 మిల్లీ లీటర్ల బాటిల్ ధర రూ.600కే అందుబాటులోకి తెచ్చారు.

మూడేళ్లలో 3 రెట్లు పెరిగిన డిమాండ్

పర్యావరణ హితంతో పాటు సంప్రదాయ ఎరువులో ఉండే పోషకాలన్నీ నానో ఎరువుల్లో ఉంటాయి. భూసారంతో పాటు భూగర్భ జలాలపై ఎలాంటి ప్రభావం ఉండదని నిరూపితమవడంతో రైతులు కూడా వీటి పట్ల ఆసక్తిని చూపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వీటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

ఫలితంగా గత మూడేళ్లలో వీటి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. 2021-22 సీజన్‌లో దేశవ్యాప్తంగా 2.12 కోట్ల బాటిల్స్ విక్రయాలు జరగ్గా, 2022-23లో 3.30 కోట్ల బాటిల్స్ విక్రయమయ్యాయి. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల వలన 2023-24 సీజన్‌లో 2.50 కోట్ల బాటిల్స్ విక్రయాలు జరిగాయి. 2024-25 సీజన్‌లో 4.60 కోట్ల నానో యూరియా, 2 కోట్ల నానో డీఏపీ బాటిల్స్ విక్రయం లక్ష్యంగా నిర్ణయించారు.

ఏపీలో రికార్డు స్థాయి అమ్మకాలు

నానో ఎరువుల వినియోగంలో ఉత్తర ప్రదేశ్, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలు, దక్షిణ భారతదేశంలో కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో గడిచిన మూడేళ్లలో ఏపీలో ఆర్బీకేల ద్వారా రికార్డుస్థాయిలో 10.50 లక్షల బాటిల్స్ విక్రయాలు జరిగాయి. 2024-25 సీజన్ కోసం 10 లక్షల నానో యూరియా, 4 లక్షల నానో డీఏపీ బాటిల్స్‌ను ఏపీ రైతుల కోసం ఇఫ్కో సరఫరా చేస్తోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి నాలుగింతల నత్రజని (16 శాతం)తో సహా అధిక పోషక విలువలతో కూడిన నానో యూరియా ప్లస్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది.

విదేశాలకు ఎగుమతులు

సూక్ష్మ ఎరువుల వినియోగానికి విదేశాలు కూడా ముందుకు వస్తున్నాయి. అమెరికా, బ్రెజిల్, జాంబియా, గునియా, శ్రీలంక, ఆఫ్రికన్ దేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. 2024-25 సీజన్‌లో 72 వేల లీటర్ల యూరియా, డీఏపీ బాటిల్స్ ఎగుమతి చేసేందుకు ఇఫ్కో సన్నాహాలు చేస్తోంది. సూక్ష్మ ఎరువుల తయారీలో దేశీయ ఎరువుల కంపెనీలు కూడా భాగస్వాములవుతుండగా, మరికొన్ని మార్కెటింగ్ చేస్తున్నాయి. మురుగప్పా గ్రూప్‌నకు చెందిన కాకినాడలోని కోరమాండల్ ఎరువుల కర్మాగారం నానో యూరియా, నానో డీఏపీ తయారు చేస్తోంది. ఒడిశాలోని పారాదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్ (పీపీఎల్) కూడా సూక్ష్మ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టింది. నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), రాష్ట్రీయ కెమికల్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్)తో పాటు ఫ్యాక్ట్ వంటి ఎరువుల కంపెనీలు ఇఫ్కో సూక్ష్మ ఎరువులను మార్కెటింగ్ చేస్తున్నాయి.

సూక్ష్మ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది



ఇఫ్కో సూక్ష్మ ఎరువులకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ దేశాలు సైతం వీటి వినియోగానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఇఫ్కో బాటలోనే ఇతర ఎరువుల కంపెనీలు సైతం సూక్ష్మ ఎరువుల తయారీకి ముందుకొస్తున్నాయి. తొలి ఏడాది 2 కోట్ల బాటిల్స్ అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది 6.60 కోట్ల బాటిల్స్ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. నానో యూరియా, నానో డీఏపీతో పాటు ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి నానో యూరియా ప్లస్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చాం. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి నానో జింక్, నానో కాపర్‌ను తీసుకొచ్చేందుకు ఇఫ్కో సన్నాహాలు చేస్తోంది.

– టి.శ్రీధర్‌రెడ్డి,
ఏపీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్, ఇఫ్కో

గిరిజన పాఠశాల భూమి కబ్జా

- గొలగమూడి గురుకుల పాఠశాల ఖాళీ స్థలాన్ని ఆక్రమించిన టీడీపీ నేతలు
- అడ్డుకోబోయిన మహిళా టీచర్లకు బెదిరింపులు



గొలగమూడిలో ఆక్రమిత భూమిలో జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం



ఆక్రమణలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికారం చేపట్టిన గంటల వ్యవధిలోనే టీడీపీ నేతలు బరి తెగించారు. ప్రభుత్వ స్థలాల కబ్జాకు తెర తీశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి అండతో స్థానిక నేతలు చెలరేగిపోతున్నారు. వెంకటాచలం మండలం గొలగమూడిలో టీడీపీ నాయకులకు ప్రభుత్వ భూమిపై కన్ను పడింది. అనుకున్నదే తడవుగా పట్ట పగలే జేసీబీ యంత్రంతో ఆ భూమిని చదును చేశారు. వెంకటాచలం మండలం గొలగమూడిలో ప్రభుత్వ ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలకు ఆనుకుని సీజేఎఫ్ఎస్ భూములున్నాయి. ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల కోసం మరింత స్థలం కేటాయించాలని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది కోరడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీకి చెందిన వ్యక్తికి గతంలో సీజేఎఫ్ఎస్ పథకం కింద కేటాయించిన 1.25 ఎకరాల భూమిని పాఠశాల కోసం అప్పగించింది. వాస్తవానికి సీజేఎఫ్ఎస్ పథకం కింద కేటాయించిన భూమిపై ఏ వ్యక్తికీ అధికారం లేదు. ఈ భూమికి ఆర్డీవో హక్కుదారుగా ఉంటారు. సదరు వ్యక్తికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూమిని కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. అయితే ఇంతలోనే సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఈ ఎన్నికల్లో సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలవడం, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ టీడీపీ నేత అది తన భూమేనంటూ దౌర్జన్యపూరితంగా ఆక్రమించేందుకు ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది. ఒక గిరిజన పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించే సాహసం చేయడం చూస్తే టీడీపీ నేతలు ఏ విధంగా బరి తెగించారో అర్థమవుతోంది. ఈ భూఆక్రమణను ఆశ్రమ గిరిజన పాఠశాల ఉపాధ్యాయినులు అడ్డుకోబోతే వారిని సైతం బెదిరించారు. ఈ భూమి పాఠశాలకు కేటాయించారని చెప్పినా వినకుండా చదును చేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు సాక్షి ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై న్యాయవాద మండలి హర్షం

సాక్షి, అమరావతి: ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై రాష్ట్ర న్యాయవాద మండలి (బార్ కౌన్సిల్) హర్షం వ్యక్తం చేసింది. తమ అభ్యర్థనను మన్నించి ఈ చట్టాన్ని రద్దు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపింది. న్యాయవాదులు, రైతాంగం ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేయడం సరైన చర్యగా బార్ కౌన్సిల్ అభివర్ణించింది. భూ యాజమాన్య హక్కు చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ మండలి గత ఏడాది డిసెంబర్‌లో తీర్మానం చేసిందని, ఈ చట్టం వల్ల న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్.ద్వారకనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

న్యాయవాదులకు అవగాహన సదస్సు

ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.ప్రసాదరావును సత్కరిస్తున్న ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి తదితరులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ను సత్కరిస్తున్న బార్ కౌన్సిల్ సభ్యులు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో రాష్ట్ర న్యాయవాదుల రెసిడెన్షియల్ ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన న్యాయవాదులకు రోల్ ఆఫ్ బార్, బెంచ్, ఆస్తి బదిలీ చట్టం, ఆస్తి హక్కు, నిర్దిష్ట ఉపశమన చట్టం, రిజిస్ట్రేషన్ చట్టం, మేధో సంపత్తి హక్కులు, ఎలక్ట్రానిక్ ఆధారాలు, రాజ్యాంగ లక్ష్యాలను సాధించడంలో న్యాయవాది పాత్ర, డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని న్యాయవాదుల ప్రయోజనాల కోసం, వారి వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగు పరచడానికి చట్టం విషయంలో వారి జ్ఞానాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.ప్రసాదరావును ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయవాడ- ముంబై విమాన సర్వీస్ ప్రారంభం



సాక్షిప్రతినిధి, విజయవాడ: విజయవాడ నుంచి దేశ వాణిజ్య రాజధాని ముంబై నగరానికి శనివారం విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి విమాన సర్వీసును ప్రారంభించనున్నారు. శనివారం సాయంత్రం 5.45 గంటలకు ఎయిర్ ఇండియా విమానం ముంబై నుంచి విజయవాడకు చేరుకుంటుంది. తిరిగి రాత్రి 7.10 గంటలకు విజయవాడ నుంచి ముంబై నగరానికి బయలుదేరుతుంది. 180 సీట్ల సామర్థ్యం కలిగిన ఏఐ 599 నంబరు విమానం ప్రతిరోజూ విజయవాడ–ముంబై మధ్య సేవలు అందించనుంది. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆ చర్చల ఫలితంగానే నేడు విజయవాడ ముంబై మధ్య విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు. ఈ సర్వీస్ వలన ఈ ప్రాంతంలో పండించే పంటలు, కూరగాయలు, మామిడి పండ్లు, పూలు, కరివేపాకు, సముద్ర ఉత్పత్తులైన చేపలు, రొయ్యలు, పీతలు మొదలైనవి తక్కువ సమయంలో విదేశాలకు చేరుకోవడానికి ఎంతగానో ఉపయోగ పడుతోందని పేర్కొన్నారు. విమాన సర్వీస్ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వ పౌర విమాన యాన శాఖకు శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వార్తలు

విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం సందర్శన



విపత్తుల సంస్థ అవలంభిస్తున్న సాంకేతికతల గురించి వివరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు నవజ్యోతి మిశ్రా, మండా జావలి ఆల్ఫోన్స్, మనోజ్‌రామ్‌నాథ్, పాటిల్ దేవరాజ్, రోహిత్ కుమార్ చౌదరి శుక్రవారం సందర్శించారు. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వారికి విధివిధానాలు వివరించారు. సంస్థ అవలంభిస్తున్న సాంకేతిక పద్ధతుల గురించి చెప్పారు. విపత్తుల సమయంలో నిరంతరం పర్యవేక్షిస్తూ అలర్ట్స్ పంపే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్, వాకీటాకీ, వి శాట్ కమ్యూనికేషన్ వ్యవస్థల పనితీరును తెలియజేశారు.

యార్డులో 31,130 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,324 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 31,130 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 20,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,588 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

డాక్ ‘పే’.. జిందాబాద్

- తపాలా శాఖ ముందంజ
- డిజిటల్ లావాదేవీలు పెంచే దిశగా యాప్
- గూగుల్ పే, ఫోన్‌పేలకు దీటుగా రూపకల్పన
- డాక్ పే లావాదేవీలపై గ్రీవెన్స్ వెసులుబాటు
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 155299



డాక్ పే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లోగో

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దేశంలో డిజిటల్ లావాదేవీలను పెంచే దిశగా తపాలాశాఖ వినియోగదారులకు పలు రకాల సేవలను అందించడంలో ఆసక్తి చూపుతోంది. ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, కొరియర్, స్పీడ్ పోస్ట్‌తోపాటు ప్రైవేటు సంస్థలకు దీటుగా బ్యాంకింగ్, గోల్డ్ బాండ్, బీమా తదితర సేవలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. మరో అడుగు ముందుకేసి డిజిటల్ లావాదేవీల పెంపునకు గూగుల్ పే, ఫోన్ పే మాదిరిగా డాక్ పే అనే యాప్‌ను 2021లోనే దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు దీనిని ప్రజలకు చేరువ చేసే దిశగా దూసుకెళుతోంది. ఈ డాక్ పే ద్వారా ప్రజలు డిజిటల్ ఫైనాన్స్ సేవలు పొందడంతోపాటు ఇండియా పోస్టు, ఐపీపీబీ, అందించే బ్యాంకింగ్ సేవల విషయమై సాయం పొందవచ్చు. డబ్బు పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, డిజిటల్ రూపంలో వ్యాపారులకు నగదు చెల్లించడం లాంటి పనులను చక్కబెట్టుకోవచ్చు. ప్రతి భారతీయుడి అవసరాలను తీర్చేలా డాక్ పేను రూపొందించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో యూపీఐ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే దిశగా దీనిని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తున్నారు. ఈ యాప్‌ను ఏ బ్యాంకు ఖాతాదారులైనా వినియోగించవచ్చు.

గ్రీవెన్స్ వెసులుబాటు

గూగుల్ పే, ఫోన్ పే నగదు లావాదేవీల్లో ఏవైనా పొరపాట్లు చోటుచేసుకుంటే ఫిర్యాదులు చేసేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే వాటి కార్యాలయాలు మనకు అందుబాటులో ఉండవు. అయితే డాక్‌పే యాప్ ద్వారా నగదు బదిలీ సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే ఫిర్యాదుల స్వీకరణకు తపాలా శాఖ వెసులుబాటు కల్పించింది. డాక్ పే అనే యాప్ తపాలాశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తుండటంతో మన డబ్బుకు గ్యారెంటీ ఉంటుంది. యాప్ గురించిన సమగ్ర సమాచారం కోసం ఐపీపీబీ టోల్‌ఫ్రీ నంబర్ 155299ను వినియోగదారులు సంప్రదించొచ్చని తపాలా శాఖా అధికారులు చెబుతున్నారు.

పచ్చిరొట్ట పుడమికి రక్ష

ఘంటసాల కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత



ఘంటసాల: భూసారం ఎంతగా పెరిగితే అందులో మనం పండించే పంటలు అంతగా దిగుబడిని అందిస్తాయని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. నేటి కాలంలో వాడే ఎన్నో రకాల రసాయన మందుల వలన భూమి సారవంతం తగ్గి, పంట దిగుబడి తక్కువగా వస్తోందన్నారు. రైతులు వీలైనంత తక్కువగా రసాయన ఎరువులను వాడుతూ ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టను ఉపయోగించాలన్నారు. పచ్చిరొట్ట వేయడం ద్వారా పంటలకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో తెలుసుకుందాం...

పచ్చిరొట్ట ఎరువులను భూమికి రెండు విధాలుగా అందించవచ్చు.

1.పచ్చిరొట్ట ఎరువులు. 2.పచ్చిఆకు ఎరువులు

పచ్చిరొట్ట ఎరువులు : జనుము, జీలుగ, పెసర, అలసంద వంటి పంటలను పూత వరకు పెంచి ఆ తర్వాత నేలలో కలిపి దున్నడాన్ని పచ్చిరొట్ట ఎరువులు అంటారు.

పచ్చిఆకు ఎరువులు : కానుగ, గ్లెరిసిడియా, అవిశ, సీమతంగేడు, వెంపలి వంటి మొక్కల ఆకులను కోసుకొచ్చి పొలంలో తొక్కి వేయడాన్ని పచ్చిఆకు ఎరువులు అంటారు.

కట్టె జనుము : ఇది అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. పచ్చిరొట్టగా, పశువుల మేతగా ఉపయోగించవచ్చు. ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు చల్లుకోవాలి. దీనివల్ల 5 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.



జీలుగ పంట

పిల్లి పెసర : దీనికి తేలిక, బరువైన నేలలో కూడా సాగు చేయవచ్చు. చౌడు భూముల్లో ఇవి సాగుకు పనికిరావు. ఎకరానికి 6 నుంచి 8 కిలోల విత్తనాలు అవసరం అవుతుంది. దీనివల్ల 3 నుంచి 4 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.

నీలి వెంపలి : ఇవి చాలా ప్రదేశాల్లో కలుపు మొక్కలుగా కనబడతాయి. ఇవి అన్ని రకాల నేలల్లో వేసుకోవచ్చు. వీటిని పచ్చిరొట్ట ఎరువులుగా వాడుకోవచ్చు. ఇవి ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాలను అందుకుంటాయి.



జనుము పంట

పచ్చిరొట్ట పైరుకు ఉండవల్సిన లక్షణాలు

- తక్కువ రోజుల్లో బాగా పెరిగి ఎక్కువ పచ్చిరొట్టను ఇచ్చేలా ఉండాలి. అన్ని రకాల నేలల్లో పెరిగే గుణాన్ని కలిగి ఉండాలి.
- పచ్చిరొట్ట పీచు శాతం తక్కువగా ఉండి ఎక్కువ ఆకు కలిగి రసభరితంగాఉండాలి.
- నేలలో కలియదున్నినప్పుడు త్వరగా కుళ్లి భూమిలో కలిసేటట్లు ఉండాలి.
- త్వరగా పెరిగి కలుపు మొక్కల పెరుగుదలను అరికట్టాలి.
- పచ్చిరొట్ట వేర్లు చాలా లోతుకు పోయేలా ఉండాలి.
- పప్పు జాతి మొక్కల వేర్లలో బుడిపెలు ఉండి వాతావరణంలో నత్రజని స్థిరీకరణ చేసే విధంగా ఉండాలి.
- ఏ రకమైన నేలలో అయినా పెరిగే గుణాన్ని కలిగి ఉండాలి.
- తక్కువ వనరులు వినియోగించుకుంటూ సాధారణ యాజమాన్యంలో త్వరగా పెరిగి అధికంగా పచ్చిరొట్ట పైర్లు అందించేలా ఉండాలి.

పచ్చిరొట్ట ఎరువుల వాడకంలో సూచనలు

- పచ్చిరొట్ట ఎరువులను పూత దశలో ఉన్నప్పుడు కలిపి దున్నాలి.
- నేలలో కలిపి దున్నే నాటికి పైర్లలో 40 నుంచి 80 శాతం తేమ ఉండటమే కాకుండా నేలలో కూడా సరిపడ నీరు ఉన్నట్లయితే అవి త్వరగా మురుగుతాయి. ఇక పైరు మొత్తం మురిగిన తర్వాత పాత నీటిని తీసివేయాలి. వేరే నీటిని అందించాలి.
- పచ్చిరొట్ట పంటలు సాగు చేసే నేలలో నత్రజని తక్కువగా ఉండటం వల్ల నత్రజని వేసినట్లయితే అవి ఏపుగా పెరిగి రొట్ట దిగుబడి ఎక్కువగా ఉంటుంది. వేరు బుడిపెలు కూడా పెరుగుతాయి.

పచ్చిరొట్ట ఎరువుల వాడకం

- ఎకరానికి 24 కిలోల జనుము, 12 నుంచి 14 కిలోల జీలుగ, 14 నుంచి 16 కిలోల పెసర, 6 నుంచి 8 కిలోల అలసంద వంటి పచ్చిరొట్ట పంటలను పెంచుకోవచ్చు.

పచ్చిరొట్ట పైర్ల సాగులో ఇబ్బందులు

పచ్చిరొట్ట ఎరువులు వేసిన తర్వాత నేలలో వేసి కలియదున్నడానికి సుమారు 45 రోజుల వ్యవధి పడుతుంది. ఏపుగా పెరిగి ఎక్కువ పచ్చిరొట్టను ఇవ్వాలంటే తేమ అవరమవుతుంది.

పచ్చిరొట్ట ఎరువులతో లాభాలు

- నేలలో సేంద్రియ పదార్థం వేయడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. జీవ రసాయనిక చర్యల వల్ల నేల సారం పెరుగుతుంది.
- నేలలో లభ్యం కాని రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి. భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగపడతాయి.
- జీలుగు, జనుము, పిల్లి పెసర వంటి పైర్లు వేసినప్పుడు వీటి వేర్లు ఎక్కువ లోతుకు వెళ్లడం వల్ల భూమి లోపలి పొరల్లో నిక్షిప్తమైన అనేక పోషకాలను తెచ్చి పంటకు అందిస్తాయి.
- పప్పుజాతి పంటల వల్ల రైజోబియం అనే బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా ఉంటుంది.
- పచ్చిరొట్ట పైర్లు ఎరువులు గానే కాకుండా పశువులకు మేతగాను ఉపయోగపడతాయి.

మాఊరు పేరే ఇంటిపేరైంది

సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): తన ఊరుపేరు సుద్దాలను ఇంటిపేరుగా తన తండ్రి హనుమంతు మార్చారని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. విజయవాడ మానసిక వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో సాహిత్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుద్దాల అశోక్‌తేజను తొలుత నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ సినీ గేయాల విశిష్టతను సోదాహరణంగా, చతురోక్తులతో వివరించారు. ఇప్పటివరకూ 2200లకు పైగా పాటలు రాశానని, దాదాపు 16పుస్తకాలు రచించినట్లు తెలిపారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డికి తాను ఏకలవ్య శిష్యుడినన్నారు. కేవలం విప్లవ గీతాలే కాకుండా అన్నిరకాల పాటలు రాసినట్లు చెప్పారు. ఠాగూర్ సినిమాలో ‘నేను సైతం ప్రపంచాగ్నికి’ అనే పాటకు జాతీయ ఉత్తమ గేయ రచయిత అవార్డు లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్, మానసిక వైద్యురాలు వి.రాధికారెడ్డి, ఇండ్లాస్ హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, డాక్టర్ కృష్ణమోహన్, ఆర్కే అయోధ్య, డాక్టర్ విశాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సుద్దాల అశోక్‌తేజను సత్కరిస్తున్న మానసిక వైద్యులు

క్లుప్తంగా...

టీడీపీ, జనసేన కార్యకర్తల కుమ్ములాట

మట్టి అమ్మకాల వ్యవహారమే కారణం



ఘర్షణ పడుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు

నల్లజర్ల : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి విజయం సాధించి పట్టుమని పది రోజులు కూడా కాలేదు. అప్పుడే క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఆవపాడులో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు, కుమ్ములాటలే దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. జనసేన నేత ఆవపాడు సర్పంచ్‌గా ఉన్నారు. కూటమి గెలుపొందడంతో ఆయన మట్టి అమ్మకాలకు తీర తీశారు. పోలవరం కాలువ గట్టు మట్టిని టిప్పర్ల ద్వారా తాడేపల్లిగూడెం తరలిస్తున్నారు. దీనికి టీడీపీ కార్యకర్తలు అడ్డు చెప్పారు. దీంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదాలు, ముష్టియుద్ధాలు సైతం జరిగాయి. మేం ఎన్నికల్లో గెలిచాం.. మట్టి అమ్మకాల వంటి వ్యవహారాలూ మేమే చూసుకుంటాం.. అని టీడీపీ నేతలు చెప్పగా, మేం మద్దతిస్తేనే మీరు గెలిచారు.. మీ గొప్పేం లేదు.. అంటూ జనసేన నేతలు తిరగబడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య చాలా సేపు గొడవ జరిగింది. వ్యవహారం చివరకు పోలీస్ స్టేషన్‌కు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఉమ్మడి పశ్చిమ గోదావరి మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వద్దకు చేరింది. వారు సర్దుబాటు చేయడంతో ఇరు వర్గాలు శాంతించాయి.

బంధువులను పిలిపించి మరీ కొట్టించాడు



గాయపడిన శ్రీకాంత్‌రెడ్డి

కొలిమిగుండ్ల: నంద్యాల జిల్లా కల్వటాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డిపై శుక్రవారం టీడీపీ నాయకులు దాడిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌గా ఉన్న ఆయన్ని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. కొలిమిగుండ్లలో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి మధ్యాహ్నం భోజనం చేసేందుకు బైక్‌పై ఇంటికి వెళుతుండగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద దాడిచేశారు. స్థానిక టీడీపీ నాయకుడు మునగాల ప్రతాప్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా కొత్తపల్లెకు చెందిన ఆయన బంధువులను పిలిపించి దాడిచేయించినట్లు బాధితుడు చెప్పారు. బైక్ పైనుంచి కిందపడేసి కొట్టడంతో కంటికి, చేయి వద్ద గాయాలయ్యాయి. ఈ మేరకు శ్రీకాంత్‌రెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కళ్ళిఫలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడి



గాయపడిన నాగేంద్రబాబు

రేపల్లె రూరల్: నిజాంపట్నం మండలం కళ్ళిఫలం గ్రామంలో గురువారం రాత్రి ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడిచేసి గాయపరిచారు. మేడికొండ నాగేంద్రబాబు, కట్టుపల్లి శాంతకుమారి, కట్టుపల్లి కిషోర్, కట్టుపల్లి నరేష్, పరిశ శ్రీనులపై అదే గ్రామానికి చెందినవారు దాడిచేశారు. ఈ దాడిలో నాగేంద్రబాబు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని స్థానికులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేపల్లె పట్టణ పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

ముస్లిం మత బోధకుడిని కొట్టి.. అతనిపైనే కేసు పెట్టి..

ఆత్మకూరు రూరల్: నంద్యాల జిల్లా ఆత్మకూరులో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. స్థానిక ముస్లిం మత బోధకుడిపై శుక్రవారం టీడీపీ కార్యకర్త దాడిచేసి తీవ్రంగా కొట్టాడు. పట్టణానికి చెందిన ఖాజా ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూనే మసీదులో మత బోధకుడిగా ఉంటున్నారు. అతడికి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకపోయినా.. ఎన్నికల సమయంలో టీడీపీకి ఓటు వేస్తే నేరుగా బీజేపీకి వేసినట్టేనని ప్రచారం చేశాడని టీడీపీ కార్యకర్త శాలుపైల్వాన్ ఆరోపిస్తున్నాడు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకుని శుక్రవారం ఖాజాపై దాడిచేసి దుస్తులు చించి కొట్టడంతోపాటు దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరించాడు. అవమానభారంతో ఇంటికెళ్లిన ఖాజాను ఓదార్చి ధైర్యం చెప్పిన సోదరులు, చుట్టుపక్కలవారు శాలుపైల్వాన్‌ను నిలదీసేందుకు అతడి ఇంటి వద్దకు వెళ్లారు. అప్పటికే తాళం వేసి పోలీసుస్టేషన్‌కు వెళ్లిన శాలుపైల్వాన్ తనకు ఖాజా వల్ల ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపించారు. స్థానిక మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ పువ్వాడి దివ్య భర్త భాస్కర్‌పై బుధవారం దాడిజరిగిన విషయం తెలిసిందే.



చిత్తూరు జిల్లా జీఎంఆర్ పురంలో ధ్వంసం చేసిన నవరత్నాలు, డిజిటల్ లైబ్రరీ శిలాఫలకాలు



పల్నాడు జిల్లా చింతలచెరువులో టీడీపీ శ్రేణులు పగలగొట్టిన గ్రామ సచివాలయం శిలాఫలకాలు



అనంతపురం జిల్లా రాచానపల్లిలో టీడీపీ కార్యకర్తలు తొలగించి బయట పడేసిన వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకం



టీడీపీ శ్రేణుల దాడిలో పగిలిపోయిన నెల్లూరు జిల్లా బోయలచిరివెళ్ల ఆర్బీకే భవనం కిటికీ అద్దాలు

యథేచ్ఛగా టీడీపీ దాడులు

పలు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం

- జేసీబీతో జగనన్న లేఔట్‌లో విధ్వంసం
- శిలాఫలకాలను పగలకొట్టిన టీడీపీ కార్యకర్తలు
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన దాష్టీకాలు



అనంతపురం జిల్లా రాచానపల్లిలో ఆర్బీకే శిలాఫలకాన్ని పగులకొడుతున్న టీడీపీ కార్యకర్తలు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చౌటభీమవరంలో టీడీపీ నాయకుడు రాంబాబు తవ్వేసిన జగనన్న లేఔట్



కర్నూలు జిల్లా పూడిచెర్లలో దుండగులు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం



చిత్తూరు జిల్లా ఆలకుప్పంలో బీఎంసీ సెంటర్ శిలాఫలకం తొలగించిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో అధికార మత్తుతో టీడీపీ నేతలు, కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ ఆస్తులను, అభివృద్ధి పథకాల శిలాఫలకాలను యథేచ్ఛగా ధ్వంసం చేస్తున్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి ఈ విధ్వంసం కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం కూడా టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. పలుచోట్ల విధ్వంసానికి దిగారు.

అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో పట్టపగలు అందరూ చూస్తుండగానే రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకాలను ధ్వంసం చేశారు. వీటి పక్కనే ఉన్న జగనన్న పాలవెల్లువ 'నేమ్ బోర్డు'ను తొలగించారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చింతలచెర్వు గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని పగులకొట్టారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం బోయలచిరివెళ్ల సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలపై దాష్టీకానికి పాల్పడ్డారు. వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ పేరుతో వేసిన శిలాఫలకంపై ఉన్న వైఎస్ జగన్, మేకపాటి విక్రమ్‌రెడ్డి చిత్రాలను బండరాయితో తుడిచే ప్రయత్నం చేశారు. రైతు భరోసా కేంద్రం, సచివాలయం భవనాలకు ఉన్న కిటికీ అద్దాలను పగులగొట్టారు. అలాగే ఏఎస్‌పేట మండలం చౌటభీమవరంలో జగనన్న లేఔట్‌ను టీడీపీ నాయకుడు రాంబాబు జేసీబీతో తవ్వేశారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలంలో సచివాలయాలు, ఆర్బీకే భవనాల శిలాఫలకాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ధ్వంసం చేశారు. కీలపల్లిలో గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలకు అమర్చిన శిలాఫలకాలు, బోర్డు దిమ్మెలను గునపాలు, సమ్మెటతో పగులకొట్టారు. అలాగే గండ్రాజుపల్లి పంచాయతీ ఆలకుప్పంలో బీఎంసీ సెంటర్‌కు అమర్చిన శిలాఫలకాన్ని ఆ గ్రామ టీడీపీ నాయకులు తొలగించారు. శ్రీరంగరాజపురం మండలం నెలవాయి సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ వద్ద, జీఎంఆర్ పురం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నవరత్నాలు, డిజిటల్ లైబ్రరీ శిలాఫలకాలను ధ్వంసం చేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల మెట్ట సమీపంలో ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు.

కుమిలికుమిలి.. కలత చెంది..

- వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ఒక్కరోజే ఐదుగురు మృతి
- జగన్ ప్రతి హామీని అమలు చేసినా ఓడిపోయారని మనోవ్యథ



మృతిచెందిన కైపు పెద్ద వెంకట సుబ్బారెడ్డి



మృతిచెందిన అంకిరెడ్డి లక్ష్మీదేవమ్మ



రామగిరి ఖాశింబీ (ఫైల్)



పూసర్ల అప్పారావు(ఫైల్)



ఏసురత్నం మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సాక్షి, నెట్‌వర్క్: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆవేదనతో శుక్రవారం ఒక్కరోజే ఐదుగురు మృతిచెందారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినా జగనన్న ఓడిపోయారనే దిగులుతో అన్నం మానేసిన ప్రకాశం జిల్లా దర్శి మండలం ఎర్ర ఓబనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కైపు పెద్ద వెంకట సుబ్బారెడ్డి (78) మరణించాడు. పెద్ద వెంకట సుబ్బారెడ్డి ఎన్నికల లెక్కింపు రోజు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేదని తెలిసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ రోజు నుంచి అన్నం తినడం మానేశారు. కుటుంబ సభ్యులు బతిమిలాడినా అన్నం తినలేదు. గ్రామంలో నాయకులు కూడా రోజూ వెళ్లి మాట్లాడి, మళ్లీ జగనన్న అధికారంలోకి వస్తారని నచ్చజెప్పినా ఆయన ముద్ద ముట్టలేదు. 'జగన్ పార్టీలు చూడకుండా అందరికీ పథకాలు ఇచ్చారు.. అందరూ రూ.లక్షల్లో లబ్ధిపొందారు.. ఓట్లు మాత్రం వేయలేదా? లేక ఈవీఎం మిషన్లు మోసం చేశాయా' అని వారిని ప్రశ్నించేవారు. ఈ క్రమంలో తీవ్ర ఆవేదనతో శుక్రవారం మృతి చెందాడు. పేద రైతు అయిన సుబ్బారెడ్డికి రెండెకరాలు డీకే పట్టా భూమి మాత్రమే ఉంది. ఆయనకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, అందరికీ వివాహాలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన మృతదేహానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కైపు పెద్ద వెంకట సుబ్బారెడ్డి మృతిచెందారని తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక మనో వ్యథతో ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పోలవరానికి చెందిన రామగిరి ఖాశింబీ (55) గుండెపోటుతో మృతి చెందింది. ఫలితాల రోజు నుంచి ఖాశింబీ మానసికంగా కుమిలిపోయి అనారోగ్యానికి గురైందని కుటుంబ సభ్యులు తెలిపారు.

మనోవ్యథతో గుండెపోటుకు గురై..

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గంధవరం గ్రామానికి చెందిన పూసర్ల అప్పారావు.. వైఎస్సార్, వైఎస్ జగన్‌లకు వీరాభిమాని. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న అప్పారావు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ఎన్నో పథకాల వల్ల మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమాగా ఉండేవాడు. అయితే ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందడంతో మనోవ్యథ చెందాడు. దీంతో గుండెపోటుకు గురికావడంతో అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెండ్రోజుల కిందట ఇంటికి వచ్చిన అప్పారావుకు మళ్లీ గుండెపోటు రావడంతో మృతి చెందాడు. డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మొల్లి చినఅప్పలనాయుడు తదితరులు ఆయనకు నివాళులు అర్పించారు.

అన్నపానీయాలు మాని..

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పరాజయాన్ని తట్టుకోలేక చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఏసురత్నం (62) గుండెపోటుతో మృతి చెందాడు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలు కావడంతో ఏసురత్నం అన్నపానీయాలను మాని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే జగన్ ముఖ్యమంత్రి కాలేదనే ఆవేదనతో వైఎస్సార్ జిల్లా లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి చందిన అంకిరెడ్డి లక్ష్మీదేవమ్మ (60) గుండెపోటుతో మృతిచెందింది. గ్రామంలో అవులస్వామి దేవస్థాన మహిళా సంఘ అధ్యక్షురాలిగా ఆమె కొనసాగుతోంది. ఎన్నికల కౌంటింగ్ ముగిసినప్పటి నుంచి వైఎస్ జగన్ తిరిగి ముఖ్యమంత్రి కాలేదని మనోవ్యథకు గురైంది. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందిందని ఆమె కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపాడు

వైఎస్ జగన్ నాటిన మొక్కను నరికేశారు

విజయవాడ కోర్టు ఆవరణలో టీడీపీ మూకల దౌర్జన్యం



వైఎస్ జగన్ నాటిన మొక్కను నరికేసిన దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ అల్లరి మూకల పిచ్చి పరాకాష్టకు చేరుకుంది. ఓట్ల లెక్కింపురోజు నుంచే విధ్వంసాలకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు తాజాగా ఓ మొక్కపై ప్రతాపం చూపారు. కోర్టు ఆవరణలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం హోదాలో నాటిన మొక్కను నరికేశారు. విజయవాడలో నిర్మించిన సివిల్ కోర్టుల ప్రాంగణాన్ని రెండేళ్ల కిందట అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆ సమయంలో చెరో మొక్క నాటారు. రెచ్చిపోయి వ్యవహరిస్తున్న టీడీపీ అల్లరిమూకలు గురువారం రాత్రి జగన్ నాటిన మొక్కను నరికేశారు. శుక్రవారం ఉదయాన్నే కోర్టుకు వచ్చిన న్యాయవాదులు ఈ ఘటనను చూసి అవాక్కయ్యారు. ఈ ఘటన జరగడానికి ముందురోజే కోర్టు ఎదురు రోడ్డులో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కొందరు టీడీపీ గూండాలు హత్యాయత్నం చేశారు. ఈ రెండు ఘటనలతో.. టీడీపీ అల్లరి మూకల అధికారమత్తు తీవ్ర స్థాయిలో నెత్తికెక్కిందంటూ పలువురు న్యాయవాదులు పేర్కొంటున్నారు.

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పీఏపై టీడీపీ నాయకుల దాడి

వినుకొండ (నూజెండ): పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పీఏ శివపై శుక్రవారం పిట్టంబండ, ఉమ్మడివరం, ఏనుగుపాలెం గ్రామాలకు చెందిన కొందరు టీడీపీ నాయకులు దాడిచేశారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తరువాత ఈ నెల 5వ తేదీన శివకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నలబోతు వెంకటేశ్వర్లు ఫోన్‌చేసి బెదిరించాడు. గ్రామంలోకి వస్తే అంతు చూస్తామని అనటంతో ఈ విషయంపై తనకు ప్రాణహాని ఉందని శివ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక వినుకొండ పోలీస్‌స్టేషనులో వివాదం లేకుండా సమస్యను పరిష్కరించుకోవాలనే డీఎస్పీ సూచనల మేరకు శుక్రవారం టీడీపీ నాయకులు, ఫిర్యాది శివ పోలీస్టేషనుకు చేరుకున్నారు. బైక్‌పై వస్తున్న శివను ఆపి వాటర్ బాటిల్ విసిరి దుర్భాషలాడుతూ దాడిచేశారు. మాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ నలబోతు వెంకటేశ్వర్లు, మక్కెన వెంకట్రావు, వెంకటేశ్వర్లు, దావులూరి వీరాంజి, మక్కెన అనిల్, వీరగంధం ప్రశాంత్, దావులూరి వీరాంజి దాడిచేసినట్లు శివ చెప్పారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శివ తెలిపారు.

వైఎస్సార్ జిల్లాలో టీడీపీ నేత వీరంగం

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఆధీనంలో ఉన్న పొలం దున్నివేత, నర్సరీ ధ్వంసం



నర్సరీని జేసీబీతో ధ్వంసం చేస్తున్న రాధాకృష్ణయ్య అనుచరులు

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లెలో శుక్రవారం టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాధాకృష్ణయ్య వీరంగం సృష్టించాడు. కొన్నేళ్లుగా ఆయనకు, వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులుకు మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిపై కోర్టులో కేసు నడుస్తోంది. శ్రీనివాసులు ఆధీనంలో ఉన్న భూమిలోకి రాధాకృష్ణయ్య శుక్రవారం జేసీబీ, ట్రాక్టర్లతో దౌర్జన్యంగా ప్రవేశించి పశువుల గడ్డి పొలాన్ని దున్ని, నర్సరీని ధ్వంసం చేశాడు. వివరాలిలా ఉన్నాయి... సురభి గ్రామం నాగలగుట్టపల్లె వద్ద సర్వే నంబరు 1092లో ఉన్న భూమి కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారింది. శ్రీనివాసులు, రాధాకృష్ణయ్య కోర్టుకెళ్లారు. ఆ భూమి తమకు కొనుగోలు ద్వారా వచ్చిందని ఇద్దరూ చెబుతున్నారు. కొన్నేళ్లుగా శ్రీనివాసులు ఆధీనంలో ఉన్న భూమిని శుక్రవారం రాధాకృష్ణయ్య దున్నేశారు. కేసు కోర్టులో ఉన్నప్పుడు దౌర్జన్యంగా ఎలా దున్నుతారని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల ఆగడాలు పెచ్చుమీరి పోతున్నాయని పేర్కొంటున్నారు. జేసీబీ, ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున మనుషులను తీసుకొచ్చి అక్రమంగా చొరబడి నర్సరీని ధ్వంసం చేసి, పశువుల గడ్డి ఉన్న పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నేసినట్లు శ్రీనివాసులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూల్చివేత

- ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆందోళన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్
- టీడీపీ ప్రభుత్వం రాగానే కూల్చేస్తామని గతంలోనే హెచ్చరిక



ధారవరం పాఠశాలలో ప్రహరీని కూల్చి, రహదారిగా మార్చిన దృశ్యం

చాగల్లు: తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం ధారవరం గ్రామ ప్రాథమిక పాఠశాల(మెయిన్) ప్రహరీని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి కూల్చి వేశారు. అక్కడ రాత్రికి రాత్రే గ్రావెల్‌తో కచ్చా రోడ్డు వేశారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 'మన బడి నాడు – నేడు' పథకం రెండో విడతలో భాగంగా ఈ పాఠశాలలో ప్రహరీ నిర్మించారు. అప్పటికే చుట్టుపక్కల వారు పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించారు. అధికారుల సమక్షంలో ఈ ఆక్రమణలను తొలగించి ప్రహరీ నిర్మిస్తుండగా స్థానికులు కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ప్రహరీ నిర్మాణ పనులను నిలిపివేశారు. టీడీపీ ప్రభుత్వం రాగానే గోడను కూల్చి వేస్తామని అప్పట్లోనే వారు హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రాత్రికి రాత్రే ఈ గోడను దౌర్జన్యంగా కూల్చివేశారు. ఎంతో మంది పేద విద్యార్థులు చదువుతున్న పాఠశాల స్థలాన్ని ఆక్రమించడం దారుణమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించడం సరికాదని సర్పంచ్ రవి అన్నారు. ప్రహరీ కూల్చివేతపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని ఎంఈవో సుభాకర్ తెలిపారు.

మహిళపై టీడీపీ నేత దౌర్జన్యం

- పూటుగా మద్యం తాగి నడిరోడ్డుపై రగడ చేసిన మాజీ కౌన్సిలర్
- షాపు ఖాళీ చేయాలంటూ మహిళపై దాష్టీకం



మహిళ షాపు ఎదుట కూర్చుని బెదిరింపులకు పాల్పడుతున్న టీడీపీ మాజీ కౌన్సిలర్ శేషాచలపతినాయుడు

మదనపల్లె : పూటుగా మద్యం తాగిన టీడీపీ నేత ఒకరు చిరు దుకాణంతో జీవనం సాగించే మహిళపై అందరూ చూస్తుండగానే దౌర్జన్యం చేశాడు. మాజీ కౌన్సిలర్ అయిన ఆ నాయకుడు ఆమెను షాపు ఖాళీ చేయాలంటూ నడి రోడ్డుపై పెద్ద ఎత్తున రగడ చేశాడు. పోలీసులను కూడా లక్ష్య పెట్టకుండా, పరుష పదజాలంతో వారిపై విరుచుకుపడ్డాడు. ఆ మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, రాజకీయ జోక్యంతో పోలీసులు రాజీ చేసి పంపారు. ఈ సంఘటన శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని సుందరరాజ్ పెట్రోల్ బంకు ఎదురు రోడ్డులో శ్రీకరి శారీస్ సెంటర్‌తో కృష్ణవేణి జీవనం సాగిస్తున్నారు. షాపు యజమానికి నెల నెలా అద్దె చెల్లించనవసరం లేకుండా రూ.3,42,000 ముందుగానే చెల్లించి ఒప్పందం చేసుకున్నారు. కొన్నాళ్ల తర్వాత యజమాని వచ్చి షాపు ఖాళీ చేయమని చెప్పారు. ఒప్పందం ప్రకారం తనకు ఇంకా గడువు ఉందని, ఈలోపు ఖాళీ చేయలేనని ఆమె చెప్పారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో షాపు యజమానికి స్నేహితుడైన టీడీపీ మాజీ కౌన్సిలర్ శేషాచలపతినాయుడు శుక్రవారం సాయంత్రం పూటుగా మద్యం తాగి అనుచరులతో కలిసి కృష్ణవేణి షాపు వద్దకు వచ్చాడు. షాపు ఖాళీ చేయాలని హుకుం జారీ చేశాడు. షాపు ఎదుటే కుర్చీ వేసుకుని కూర్చుని, వచ్చిపోయే వారిని అడ్డుకుంటూ, మహిళను బండబూతులు తిడుతూ పెద్ద ఎత్తున రగడ చేశాడు. దీంతో బాధిత మహిళ 100 నంబర్‌కు ఫోన్‌చేసి జరిగిన అన్యాయం చెప్పుకుంది. ఓ కానిస్టేబుల్ అక్కడకు రాగా, టీడీపీ నాయకులు బెదిరించి అతన్ని పంపేశారు. తర్వాత సీఐ వలీబాషు ఆదేశాల మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ అక్కడకు వెళ్లి గొడవ చేయకుండా వెళ్లిపోవాలని శేషాచలపతినాయుడుకు చెప్పారు. దీంతో మరింత రెచ్చిపోయిన ఎస్‌ఐపైనా దౌర్జన్యం చేశాడు. ఒక దశలో దాడికి కూడా ప్రయత్నించాడు. మా ప్రభుత్వంలో మాకే అడ్డు చెబుతారా అంటూ బెదిరించారు. దీంతో ఎస్‌ఐ హరిహరప్రసాద్ ఆ మాజీ కౌన్సిలర్‌ను బలవంతంగా జీపులోకి ఎక్కించి స్టేషన్‌కు తీసుకువచ్చాడు. బాధిత మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈలోపు పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు అధికమవడంతో అతడిని స్టేషన్‌లో కూర్చోపెట్టి, బాధిత మహిళకు సర్దిచెప్పి, రాజీ చేసి పంపేశారు.



కనపడే కష్టం అమ్మ చేస్తుంది.
కనపడనివ్వని శ్రమ నాన్న చేస్తాడు.
చూపులకు చిక్కే ప్రేమ అమ్మది.
గుండెల్లో దాగి ఉండే మమకారం నాన్నది.
నాన్న ఉద్యోగం చేస్తాడు.
షాపులో కూచుంటాడు.
పనిముట్లు పట్టి శ్రమ చేస్తాడు.
పంటచేలో మంచె ఎరగని ఎండ కాస్తాడు.
తింటాడో లేదో. ఖర్చెంతో జమ ఎంతో.
కాని పిల్లలు అడిగింది అందించాలనే
ఆర్తితో ఉంటాడు.
ఎప్పుడూ చిర్నవ్వు...
అప్పుడప్పుడూ కోపం
ఆలోచనల పరధ్యానం.
ఏమీ చెప్పుకోని నాన్నకు
మనసారా కృతజ్ఞతలు
చెప్పాల్సిన రోజు ఇది.

రేపు ఫాదర్స్ డే

ఓ నాన్నా... నీ మనసే వెన్న...

ఒక తండ్రి తన కొడుకును తీసుకొని పొరుగూరి నుంచి తన ఊరికి నడుస్తున్నాడు. ఐదారు మైళ్ల దూరం. తండ్రి వయసు 40 ఉంటుంది. కొడుకు వయసు 15 ఉంటుంది. దారిలో వాన మొదలైంది. క్షణాల్లో పెరిగింది. వడగండ్లుగా మారింది. పెద్ద వడగండ్లు. రాళ్ల వంటి వడగండ్లు. గుండ్ల వంటి వడగండ్లు. దారిలో ఎక్కడా చెట్టు లేదు. తల దాచుకోవడానికి చిన్నపాటి నీడ లేదు. పరిగెత్తి ఎక్కడికీ పారిపోవడానికి లేదు. కేవలం పొలాలు ఉన్నాయి. వడగండ్ల దెబ్బకు పిల్లాడు అల్లాడి పోతున్నాడు. తండ్రి నెత్తి చిట్లిపోయేలా ఉంది. అయినా ఆ తండ్రి భయపడలేదు. కొడుకును పొట్ట కిందకు తీసుకున్నాడు. చటుక్కున బోర్లా పడుకున్నాడు. తండ్రి శరీరం కింద పిల్లాడు సురక్షితం అయ్యాడు. తండ్రి తన దేహాన్ని ఉక్కుఛత్రంలా మార్చి కొడుక్కు అడ్డుపెట్టాడు. వడగండ్లు కురిసి కురిసి అలసిపోయాయి. తండ్రి కొడుకును సుక్షితంగా ఇల్లు చేర్చి ఆ గాయాలతో మరికొన్నాళ్లకు చనిపోయాడు. నాన్న శౌర్యమంటే అది. కుటుంబం కోసం నాన్న చేయగలిగే అంతిమ త్యాగం అది. ఈ కథలోని తండ్రి అమితాబ్ బచ్చన్ ముత్తాత. ఈ ఉదంతాన్ని అమితాబ్ తండ్రి హరివంశరాయ్ బచ్చన్ తన ఆత్మకథలో రాశాడు.

ఒకనాడు పులిలా ఉండే నాన్న ఇవాళ తన గాంభీర్యం తగ్గించుకున్నాడు. నేటి నాన్న ఇంటి పని చేస్తాడు. అమ్మను అదిలించకుండా స్నేహంగా ఉంటాడు. పిల్లలను ఎత్తుకుంటాడు. ఆడిస్తాడు. వారితో సరదా కబుర్లు చెబుతాడు. కొట్టని, తిట్టని నాన్నలే ఇప్పుడు ఎక్కడ చూసినా. అంత మాత్రాన పిల్లలు తేలిగ్గా తీసుకుంటే తన సత్తా చూపే శక్తి నాన్నకు ఉంటుంది.

మరో ఉదంతంలో ... తండ్రికి గవర్నమెంట్ ఉద్యోగం లేదు. అసలు ఏ ఉద్యోగమూ లేదు. బాధ్యతలు ఎక్కువున్నాయి. బరువులు మోయలేనన్ని. చదువుకున్నది అంతంత మాత్రమే. ట్యూషన్లు మొదలెట్టాడు. అతడు జీనియస్. ఏ సబ్జెక్ట్ అయినా ఇట్టే నేర్చుకుని చెప్పగలడు. లెక్కలు, ఇంగ్లిషు, సైన్సు, ఎకనమిక్సు, కామర్సు.... నేర్చుకోవడం... పిల్లలకు చెప్పడం... ఆ వచ్చే జీతం ఇంటికి... తనపై ఆధారపడ్డ బంధువులకు... ఖర్చులు పెరిగే కొద్ది క్లాసులు పెరిగాయి. ఉదయం ఐదు నుంచి రాత్రి పది వరకు... చెప్పి చెప్పి చెప్పి... సరైన తిండి లేదు.. విశ్రాంతి లేదు.. విహారం లేదు... వినోదం లేదు.... బాధ్యత... బాధ్యత బాధ్యత.... పిల్లలు ఎదిగొస్తుంటే చూడటం ఒక్కటే ఊరడింపు... కాని చేయాల్సింది చాలా ఉంది. ఈలోపు ఆ శ్రమకు దేహం అలసిపోయింది. మధ్య వయసులోనే ఓడిపోయింది. ఆ తండ్రి దూరమైనా ఆ త్యాగం పిల్లలు ఏనాడూ మర్చిపోలేదు. ఇది సిరివెన్నెల సీతారామశాస్త్రి తన తండ్రి గురించి చెప్పిన కథ.

కుటుంబానికి ఆపద వస్తే నాన్న పులి. తిండి సమకూర్చే వేళ ఎద్దు. రక్షణకు కాపు కాచే గద్ద. నాలుగు గింజల కోసం ఎంతదూరమైనా వెళ్లే వలస పక్షి.

నాన్న అతి నిరాడంబరుడు. రెండు జతల బట్టలు, రోజూ ఉదయం చదవడానికి న్యూస్ పేపర్, వినేందుకు రేడియో, అడిగినప్పుడు దొరికే కాఫీ. ఇవి ఉంటే చాలు. కొందరు నాన్నలు వీలైతే పడక్కుర్చీ పొందేవారు. అదే సింహాసనంలా భావించేవారు. మంత్రులు, ముఖ్యమంత్రులు ఉదయం పూట ప్రజా దర్బార్ నడుపుతారు. కాని నాన్న దర్బార్ ఎప్పుడూ రాత్రి భోజనాలయ్యాకే. విన్నపాలన్నీ అమ్మ నుంచే వచ్చేవి. ఇంటికి కావలసినవి, పిల్లలకు కావలసినవి, అత్తమామలకు కావలసినవి, ఆడపడుచులకు అమర్చవలసినవి అన్నీ ఏకరువు పెట్టేది. రూపాయి రాక, రూపాయి పోకలో నాన్న వాటా ఏమీ ఉండేది కాదు. అమ్మ కూడా పెద్దగా అడిగేది కాదు. అమ్మను మంత్రిగా పెట్టుకుని నాన్న మధ్యతరగతి రాజ్యాన్ని నెట్టుకొచ్చేవాడు.

దేశంలో డబ్బు లేని రోజులవి. నిస్సహాయ రోజులు. నాన్న ఎంత కష్టపడేవాడో. ఒకోసారి ఎంత కోప్పడేవాడో. ఆ పైన ఎంత బాధ పడేవాడో. పుస్తకాలు కొనిస్తానని, బూట్లు కొనిస్తానని, కొత్త బట్టలు కొనిస్తానని తీర్చలేని హామీలు ఇవ్వడానికి నాన్న ఎంత బాధ పడేవాడో. అరడజను అరటి పండ్లు తెచ్చి ఏడుగురు సభ్యుల ఇంటిలో ఎవరూ గొడవ పడకుండా పంచే గొప్ప మేథమెటీషియన్ నాన్నే. కొత్త సినిమా ఊళ్లోకొస్తే దాని ఊసు ఇంట్లో రాకుండా జాగ్రత్త పడేవాడు. 'సినిమాకెళ్తాం నాన్నా' అనంటే కేకలేసేవాడు. కాని ఏదో ఒక వీలు దొరికి కాసిన్ని డబ్బులు చేతికొస్తే తనే అందరినీ వెంటబెట్టుకొని తీసుకెళ్లి సంతోషపడేవాడు.

లోకం చెడ్డది. జీతం ఇచ్చే చోట, పని చేసే చోట ఎన్నో అవస్థలు. ఎందరో శత్రువులు. నాన్న ఆ పోరాటం అంతా చేసి ఇంటికి ఏమీ ఎరగనట్టుగా వచ్చేవాడు. మరుసటి రోజు అవమానం ఎదురుకానుందని తెలిసినా పిల్లల కోసం తప్పక వెళ్లేవాడు. తాను అవమానపడి పిల్లలకు అన్నం పెట్టేవాడే కదా నాన్న.

ఆరోగ్యం పట్టించుకోడు. అప్పుకు వెరవడు. కుటుంబానికి మాట రాకుండా తనను తాను నిలబెట్టుకుంటూ పరువు కోసం పాకులాడతాడు. తన జ్ఞానం, కామన్‌సెన్స్ పిల్లలకు అందిస్తాడు. ఇలా వెళ్లు గమ్యం వస్తుందని సద్బుద్ధిని, సన్మార్గాన్ని చూపిస్తాడు. తన కోసం ఏదీ వెనకేసుకోడు. సంపాదించిందంతా పిల్లలకే ఇవ్వాలని తాపత్రయ పడతాడు.

తన యవ్వనాన్ని పిల్లలకు ధారబోసిన నాన్నకు వయసైపోయాక పిల్లలు ఏం చేస్తున్నారు? ఎప్పుడో ఒకసారి మాట్లాడుతున్నారు. ఎప్పుడో ఒకసారి కనపడుతున్నారు. ఏది అడిగినా నీదంతా చాదస్తం అంటున్నారు. తమకు పుట్టిన సంతానాన్ని వారి ఒడిలో కూచోబెట్టలేనంత దూరం ఉంటున్నారు. అన్నీ ఉన్నా నాన్నకు తలనొప్పులు తెచ్చి పెట్టే పిల్లలను ఏమనాలి? కొత్త టెన్షన్స్ తెచ్చి పెడుతూ ఏడిపించే పిల్లలు పిల్లలేనా? నాన్న కన్నీరు భూమి మీద రాలితే అది ఆ పిల్లలకు శుభం చేస్తుందా?

భర్తలుగా, కోడళ్లుగా మారిన పిల్లలూ... మీ నాన్న గురించి ఆలోచించండి. ఆయన సంతోషంగా ఉన్నాడా లేదా గుర్తించండి. మీ బాల్యంలో యవ్వనంలో మీ కోసం ఏమేమి చేశాడో గుర్తు చేసుకోండి. ఈ ఫాదర్స్ డేకి మీ నాన్నతో గడుపుతూ ఆయన మనసు మాట వినండి.



తండ్రి కళ్లలో కోటి వెలుగులు తెచ్చింది

ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేట్ అయిన మాన్సీ జైన్‌కు రాజేష్ జైన్ తండ్రి మాత్రమే కాదు ఆప్త మిత్రుడు. దారి చూపే గురువు. తన తండ్రితో కలిసి గురుగ్రామ్ కేంద్రంగా 'డిజిటల్ పానీ' అనే స్టార్టప్‌ను మొదలుపెట్టింది. పరిశ్రమలు, నివాస ప్రాంతాలలో మురుగు జలాలను తక్కువ ఖర్చుతో శుద్ధి చేయడానికి ఉపకరించే కంపెనీ ఇది. తండ్రి మార్గదర్శకత్వంలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించిన మాన్సీ జైన్ గురించి...

స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ నుంచి ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్‌లో పట్టా పుచ్చుకున్న తరువాత ఇండియాకు తిరిగి వచ్చిన మాన్సీ జైన్‌లో స్టార్టప్ కలలు మొదలయ్యాయి. తన ఆలోచనలను తండ్రి రాజేష్‌తో పంచుకుంది.

'నువ్వు సాధించగలవు. అందులో సందేహమే లేదు' కొండంత ధైర్యం ఇచ్చాడు తండ్రి.

మాన్సీ తండ్రి రాజేష్ జైన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ చేశాడు. వాటర్ అండ్ ఎనర్జీ ఇండస్ట్రీలో ఇంజినీర్‌గా పాతిక సంవత్సరాలు పనిచేశాడు.

వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీస్ విషయంలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. తండ్రి నుంచి చందమామ కథలు విన్నదో లేదు తెలియదుగానీ నీటికి సంబంధించిన ఎన్నో విలువైన విషయాలను కథలు కథలుగా విన్నది మాన్సీ. పర్యావరణ అంశాలపై ఆసక్తి పెంచుకోవడానికి, ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్ చదవడానికి తాను విన్న విషయాలు కారణం అయ్యాయి.

'మన దేశంలో తొంభైవేల మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఉన్నాయి. 95 శాతం పని మాన్యువల్‌గానే జరుగుతోంది. ప్రతి ప్లాంట్‌లో ఆపరేటర్‌లను నియమించారు. లోపాలను ఆలస్యంగా గుర్తించడం ఒక కోణం అయితే చాలామంది ఆపరేటర్‌లకు సమస్యలను పరిష్కరించే నైపుణ్యం లేకపోవడం మరో అంశం. ఈ నేపథ్యంలోనే సరియైన పరిష్కార మార్గాల గురించి ఆలోచన మొదలైంది' గతాన్ని గుర్తు తెచ్చుకుంది మాన్సీ.

మురుగునీటి శుద్ధి ప్లాంట్లలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల గురించి తండ్రితో ఎన్నో రోజుల పాటు చర్చించింది మాన్సీ.

ఆ మేథోమథనంలో నుంచి పుట్టిందే... 'డిజిటల్ పానీ' స్టార్టప్.

నివాస ప్రాంతాలు, పరిశ్రమలలో నీటి వృథాను అరికట్టేలా, తక్కువ ఖర్చుతో మురుగునీటిని శుద్ధి చేసేలా 'డిజిటల్ పానీ'కి రూపకల్పన చేశారు.

ఎక్విప్‌మెంట్ ఆటోమేషన్, వాట్సాప్ అప్‌డేట్స్, 24/7 మేనేజ్‌మెంట్.., మొదలైన వాటితో వాటర్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌గా 'డిజిటల్ పానీ' మంచి గుర్తింపు తెచ్చుకుంది.

'నీటి మౌలిక సదుపాయాలకు సంబంధించి మా ప్లాట్‌ఫామ్‌ని వైద్యుడిగా భావించాలి. ఎక్కడ సమస్య ఉందో గుర్తించి దాని నివారణకు తగిన మందును ఇస్తుంది. సాంకేతిక నిపుణులకు దిశానిర్దేశం చేస్తుంది. ఎన్నో రకాలుగా క్లయింట్స్ డబ్బు ఆదా చేయగలుగుతుంది' అంటుంది మాన్సీ.

టాటా పవర్, ఢిల్లీ జల్ బోర్డ్, లీలా హాస్పిటల్స్‌తో సహా 40 పెద్ద పరిశ్రమలు 'డిజిటల్ పానీ' సాంకేతికతను ఉపయోగించుకుంటున్నాయి. 'డిజిటల్ పానీ' ప్రస్తుతం పద్నాలుగు రాష్ట్రాలలో పనిచేస్తోంది. 'ఎకో రివర్' క్యాపిటల్‌లాంటి గ్లోబల్ ఇన్వెస్టర్‌ల నుంచి కంపెనీకి అవసరమైన నిధులను సేకరించారు.



తండ్రి రాజేష్ జైన్‌తో మాన్సీ జైన్

నాన్న హృదయం ఆనందమయం

పిల్లలు విజయం సాధిస్తే ఎంత సంతోషం కలుగుతుందో, వారితో కలిసి విజయం సాధిస్తే అంతకంటే ఎక్కువ సంతోషం కలుగుతుంది. మాన్సీ తండ్రిగా ప్రస్తుతం అలాంటి ఆనందంలోనే ఉన్నాడు రాజేష్ జైన్. స్టార్టప్ పనితీరు గురించి పక్కా ప్రణాళిక రూపొందించడం నుంచి అది పట్టాలెక్కి మంచి పేరు తెచ్చుకోవడం వరకు కూతురికి అండగా నిలబడ్డాడు. దిశానిర్దేశం చేశాడు. బిజినెస్ రియాలిటీ టెలివిజన్ సిరీస్ 'షార్క్ ట్యాంక్'లో కుమార్తె మాన్సీతో కలిసి పాల్గొన్న రాజేష్ జైన్‌లో సాంకేతిక నిపుణుడు, సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ కంటే చల్లని మనసు ఉన్న తండ్రి కనిపించాడు. కుమార్తెతో కలిసి సాధించిన విజయానికి ఉప్పొంగి పోతున్న తండ్రి కనిపించాడు.

'వాళ్ల సమర్థమైన పనితీరుకు ఈ ప్లాట్‌ఫామ్ అద్దం పడుతుంది' అంటున్నారు 'డిజిటల్ పానీ'లో పెట్టుబడి పెట్టాలని నిర్ణయం తీసుకున్న 'ఏంజియా వెంచర్స్'కు చెందిన కరుణ జైన్, శివమ్ జిందాల్.

'డిజిటల్ పానీ'కి ముందు కాలంలో...

ఎన్నో స్టార్టప్‌ల అపురూప విజయాల గురించి ఆసక్తిగా చర్చించుకునేవారు తండ్రి, కూతుళ్లు. ఆ స్టార్టప్‌ల విజయాల గురించి లోతుగా విశ్లేషించేవారు. ఈ విశ్లేషణ ఊరకే పోలేదు. తమ స్టార్టప్ ఘన విజయం సాధించడానికి అవసరమైన పునాదిని ఏర్పాటు చేసుకోవడానికి కారణం అయింది.

'షార్క్ ట్యాంక్ ఇండియా' టీవీ ప్రోగ్రామ్‌లో తండ్రి రాజేష్‌తో కలిసి పాల్గొంది మాన్సీ.

తాగునీటి సమస్య, నీటి కాలుష్యం... మొదలైన వాటి గురించి సాధికారికంగా మాట్లాడింది.

జడ్జిలు అడిగే క్లిష్టమైన ప్రశ్నలకు తడుముకోకుండా జవాబు చెప్పింది.

'మీరు చాలా తెలివైనవారు' అని జడ్జి ప్రశంసించేలా మాట్లాడింది. ఆ సమయంలో తండ్రి రాజేష్ జైన్ కళ్లలో ఆనంద వెలుగులు కనిపించాయి. కుమార్తెతో కలిసి సాధించిన విజయం తాలూకు సంతృప్తి ఆయన కళ్లలో మెరిసింది.

సముద్రం ఘోషిస్తోంది



ఉమామణి

సముద్రం నిత్యం ఘోషిస్తూ ఉంటుంది. ఆ ఘోషకు భావకవులు రకరకాల అర్థాలు చెప్తుంటారు. కానీ సముద్రం లోపల ఏముంది? సముద్రం లోపల మరో ప్రపంచం ఉంది. పగడపు దీవులమయమైన ఆ అందమైన ప్రపంచాన్ని చందమామ కథల్లో చదివాం. మన ఊహల్లో అద్భుతమైన దృశ్యాన్ని ఊహించుకున్నాం. ఇప్పటికీ అదే ఊహలో ఉన్నాం. కానీ ఆ ఊహలో నుంచి వాస్తవంలోకి రమ్మని చెబుతున్నారు ఉమామణి. ఒకప్పుడు అందమైన పగడపు దీవులను చిత్రించిన ఆమె కుంచె ఇప్పుడు అంతరించిపోయిన పగడపు దీవులకు అద్దం పడుతోంది.

బొమ్మలేయని బాల్యం

"మాది తమిళనాడులోని దిండిగల్. నాకు బొమ్మలేయడం చాలా ఇష్టం. చిన్నప్పుడు ఎప్పుడు చూసినా రంగు పెన్సిళ్లతో బొమ్మలు గీస్తూ కనిపించేదాన్ని. అది చూసి నానమ్మ 'పిచ్చి బొమ్మల కోసం కాగితాలన్నీ వృథా చేస్తున్నావు. చక్కగా చదువుకోవచ్చు కదా' అనేది. అలా ఆగిపోయిన నా చిత్రలేఖనం తిరిగి నలభై దాటిన తర్వాత మొదలైంది. ఈ మధ్యలో నాకు ఓ డాక్టర్‌తో పెళ్లి, వారి ఉద్యోగరీత్యా మాల్దీవులకు వెళ్లడం, ఓ కొడుకు పుట్టడం, ఆ కొడుకుకి కాలేజ్ వయసు రావడం జరిగిపోయాయి. ఇంత కాలం గృహిణిగా ఉన్న నాకు కొడుకు కాలేజ్ కెళ్లిపోయిన తర్వాత ఆ ఖాళీ సమయాన్ని చిన్నప్పుడు తీరని కోరిక కోసం కేటాయించాను. గులాబీల నుంచి టులిప్స్ వరకు రకరకాల పూలబొమ్మలు వేసిన తర్వాత నా చుట్టూ ఉన్న సముద్రం మీదకు దృష్టి మళ్లింది. పగడపు దీవులు నా చిత్రాల్లో ప్రధాన భూమిక అయ్యాయి. తొలి చిత్ర ప్రదర్శన మాల్దీవులలోని మెరైన్ సెంటర్‌లో పెట్టాను. ఆ తర్వాత అనేక ప్రదర్శనల్లో నా చిత్రాలను ప్రదర్శించాను. వివాంత మాల్దీవ్స్ ప్రదర్శన సమయంలో ఒక భారతీయ మహిళ వేసిన ప్రశ్న నా దిశను మార్చింది. 'సముద్ర గర్భం ఎలా ఉంటుందో ఏమేమి ఉంటాయో స్వయంగా చూడకుండా బొమ్మలేయడం ఏమిటి' అన్నదామె. ఆమె వ్యాఖ్య నాకు మొదట్లో అసమంజసంగా అనిపించింది. అనేక పరిశోధకుల డాక్యుమెంటరీలను చూసిన అనుభవంతోనే కదా చిత్రించాను. నేను స్వయంగా చూస్తే కొత్తగా కనిపించేది ఏముంటుంది... అని కూడా అనుకున్నాను. ఇంత సందిగ్ధం ఎందుకు... ఒకసారి సముద్ర గర్భంలోకి వెళ్లి చూద్దాం అని కూడా అనుకున్నాను. అప్పుడు మా అబ్బాయి మా పాతికేళ్ల వివాహ వార్షికోత్సవం బహుమతిగా నన్ను స్కూబా డైవింగ్ కోర్సులో చేర్చాడు. డైవింగ్ కంటే ముందు ఈత రావాలి కదా అని చెన్నైకి వచ్చి రెండు వారాల స్విమ్మింగ్ కోర్సులో చేరాను. తిరిగి మాల్దీవులకెళ్లి స్కూబా డైవింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టాను. తొలి రోజు అంతా అగమ్యంగా అనిపించింది. రెండవ రోజు కూడా అదే పరిస్థితి. మానేద్దామనే నిర్ణయానికి వచ్చేశాను. కోచ్ నా మాటలు పట్టించుకోలేదు. ప్రయత్నాన్ని కొనసాగించమని మాత్రం చెప్పారు. నాకు నేను నెల రోజుల గడువు పెట్టుకున్నాను. ఆ నెలలో నావల్ల కాకపోతే మానేద్దామని నా ఆలోచన. ఆ నెల రోజుల్లో డైవింగ్‌కి అనుగుణంగా మానసికంగా ట్యూన్ అయిపోయాను.





సముద్రగర్భాన్ని చిత్రించాను

సముద్రం అడుగున దృశ్యాలు నన్ను వేరేలోకంలోకి తీసుకెళ్లిపోయాయి. పగడపు చెట్లు నిండిన దిబ్బలు, రకరకాల చేపలు, పాములు ఒక మాయా ప్రపంచాన్ని చూశాను. ఆ ప్రపంచాన్ని కాన్వాస్ మీద చిత్రించడం మొదలుపెట్టాను. ఒక చిత్రానికి మరో చిత్రానికి మధ్య మాటల్లో వర్ణించలేనంత వైవిధ్యత వచ్చేసింది. ఆ చిత్రాలన్నింటినీ మాల్దీవుల మెరైన్ సింపోజియమ్ 2016లో ప్రదర్శించాను. ఆ చిత్రాలు ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్‌లా ఓషన్ రీసెర్చర్‌లు, అంతరించిపోతున్న పగడపు దిబ్బల పరిశోధకులకు ఉపయోగపడ్డాయి. కొంతకాలం తర్వాత సముద్రగర్భంలోని సన్నివేశాలను కెమెరాలో బంధించాలనుకున్నాను. ఫొటోగ్రఫీలో అనుభవం లేకపోవడంతో శబ్దరహితంగా పేలవంగా వచ్చింది ఫిల్మ్. అప్పటి నుంచి ఫిల్మ్ మేకింగ్, డాక్యుమెంటరీలు తీసే వారి దగ్గర మెళకువలు నేర్చుకునే ప్రయత్నం చేశాను. చాలామంది స్పందించలేదు. ఫిల్మ్ మేకర్ ప్రియా తువాస్సెరీ మాత్రం నాతో కలిసి ఫిల్మ్ తీయడానికి సిద్ధమయ్యారు. చిత్రీకరణ కోసం 2018లో మన దేశంలోని రామేశ్వరం, రామనాథపురం, టూటికోరన్ తీరాల్లో డైవ్ చేశాను. ఆశ్చర్యంగా సముద్రం అడుగుకి వెళ్లే కొద్దీ పగడపు దిబ్బలు కాదు కదా జలచరాలు కూడా కనిపించలేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు దిబ్బలుగా పేరుకుపోయి ఉన్నాయి. రసాయనాలు, పురుగు మందులు, ఎరువుల వ్యర్థాలను సముద్రపు నీటిలోకి వదలడంతో జలచరాలు అంతరించి పోయాయి. సునామీ విలయంలో పగడపు దీవులు అతలాకుతలం అయిపోయాయి. శిథిలమైన ఆనవాళ్లు తప్ప పగడపు చెట్ల సమూహాలు లేవు. చెట్లు చనిపోయిన దిబ్బలనే వీడియో, ఫొటోలు తీశాను. మనిషి తన సౌకర్యం కోసం చేసే అరాచకానికి సముద్రం ఎలా తల్లడిల్లిపోతోందో తెలియచేస్తూ ఆ ఫొటోలతో ప్రదర్శన పెట్టాను. మా సొంతూరు తమిళనాడులోని దిండిగల్‌తో మొదలు పెట్టి అనేక స్కూళ్లు, కాలేజ్‌లకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నాను. సముద్రం ఘోషిస్తోంది. ఆ ఘోషను విందాం. ప్రకృతి సమతుల్యతను కాపాడుకుందాం. ఓషన్ కన్జర్వేషన్, క్లైమేట్ చేంజ్ మీద పరిశోధన చేసే వాళ్లకు నేను తీసిన ఫొటోలు, చిత్రలేఖనాలు ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్‌లా ఉపయోగపడుతున్నాయి.

ఒక సాధారణ గృహిణిగా నేను 43 ఏళ్ల వయసులో కుంచె పట్టి పెయింటింగ్స్ మొదలుపెట్టాను. 49 ఏళ్లకు స్కూబా డైవింగ్ నేర్చుకుని సాగర సత్యాలను అన్వేషించాను. సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని సేకరించగలిగాననే సంతృప్తి కలుగుతోంది. మొత్తంగా నేను చెప్పేదేమిటంటే 'వయసు ఒక అంకె మాత్రమే. మన ఆసక్తి మనల్ని చోదకశక్తిగా నడిపిస్తుంది'. అంటారు ఉమామణి.

సాక్షి బిజినెస్
శనివారం
15-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	182	76,993
నిఫ్టీ ▲	67	23,466

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,677	▲	12
డోజోన్స్	38,514	▼	133
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,147	▼	17
డాక్స్	18,002	▼	264
షాంఘై	3,033	▲	4
నికాయ్	38,815	▲	94

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	71,866	▲	353
బంగారం (22 క్యారట్)	71,578	▲	351
వెండి (కిలో)	87,833	▼	14

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.06	107.62
€	యూరో	ఎస్‌బీఐ	88.82	91.18
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.62	53.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.11	56.04
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.40	64.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

టోకు ధరల దడ

- మేలో 2.61 శాతం ద్రవ్యోల్బణం
- 15 నెలల గరిష్ట స్థాయి
- ఆహార ధరల తీవ్రత



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మేలో 2.61 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన 15 నెలల్లో ఈ స్థాయిలో టోకు ధరల పెరుగుదల రేటు నమోదుకావడం ఇదే తొలిసారి. తీవ్ర వేసవి ఆహార ధరలను తీవ్రతరం చేసింది. మూడు నెలలుగా టోకు ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తోంది. కీలక అంశాలను పరిశీలిస్తే...

- సమీక్షా నెల్లో ఫుడ్ ఆర్టికల్స్ ద్రవ్యోల్బణం 10 నెలల గరిష్ట స్థాయిలో 9.82 శాతంగా నమోదయ్యింది. కూరగాయలు ధరలు ఏకంగా 32.42% పెరిగాయి. ఏప్రిల్ పెరుగుదల రేటు (23.60%)కన్నా ఇది తీవ్రం కావడం గమనార్హం. ఉల్లి ధరలు 58.05% పెరిగితే, ఆలూ ధరలు 64.05% ఎగశాయి. పప్పులకు సంబంధించి ద్రవ్యోల్బణం 21.95 శాతం ఎగసింది.
- సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ రంగంలో ఏప్రిల్‌లో ధరలు పెరక్కపోగా (మైనస్ 0.42 %), మేలో 0.78 శాతంగా నమోయ్యింది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్లో ఏప్రిల్‌లో 1.38 శాతం ద్రవ్యోల్బణం నమోదుకాగా, మేనెల్లో ఈ రేటు స్వల్పంగా 1.35 శాతానికి తగ్గింది.
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాలసీ నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం మేలో ఏడాది కనిష్ట స్థాయి 4.75 శాతానికి తగ్గినప్పటికీ, ఒక్క ఆహార విభాగంలో ధరల స్పీడ్ ఆందోళన కలిగించే స్థాయిలో 8.69 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-6-2024	
విశాఖ	500-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

ఎకానమీకి వాణిజ్యలోటు పోటు

- మేలో 7 నెలల గరిష్ట స్థాయి
- 23.78 బిలియన్ డాలర్లుగా నమోదు
- ఎగుమతులు 9 శాతం వృద్ధితో 38.13 బిలియన్ డాలర్లకు అప్
- దిగుమతులు 7.7 శాతం పెరిగి 61.91 బిలియన్ డాలర్లకు చేరిక

న్యూఢిల్లీ: భారత్ ఎగుమతులు మేలో 9 శాతం (2023 ఇదే నెలతో పోల్చి) పెరిగాయి. విలువలో 38.13 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులుసైతం సమీక్షా నెల్లో 7.7 శాతం పెరిగి 61.91 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు భారీగా 7 నెలల గరిష్ట స్థాయిలో 23.78 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇంత భారీ వాణిజ్యలోటు ఎకానమీకి ఒకింత ఆందోళన కలిగించే అంశం. తాజా గణాంకాలను పరిశీలిస్తే..

- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి పరిస్థితి నెలకొన్నప్పటికీ, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా,



జౌళి, ప్లాస్టిక్స్ వంటి రంగాలు మంచి పనితీరును ప్రదర్శించాయి.

- మొత్తం దిగుమతుల్లో చమురు విభాగంలో 28 % పెరుగుదలను నమోదుచేసుకుని విలువలో 20 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- పసిడి దిగుమతులు మాత్రం స్వల్పంగా తగ్గి 3.69 బిలియన్ డాలర్ల నుంచి 3.33 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఏప్రిల్– మే నెలల్లో వృద్ధి 5.1 శాతం

ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలలు–ఏప్రిల్, మేలలో ఎగుమతులు 5.1 శాతం పెరిగి 73.12 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 8.89 శాతం పెరిగి 116 బిలియన్ డాలర్లకు ఎగశాయి. వెరసి వాణిజ్యలోటు 42.88 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక ఈ నెలల్లో ఒక్క చమురు దిగుమతుల విలువ 24.4 శాతం పెరిగి 36.4 బిలియన్ డాలర్లకు చేరింది.

సేవలూ బాగున్నాయ్...

సేవల రంగం ఎగుమతులు మేలో 30.16 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తొలి అంచనా. 2023 మేలో ఈ విలువ 26.99 బిలియన్ డాలర్లు. దిగుమతుల విలువ ఇదే కాలంలో 15.88 బిలియన్ డాలర్ల నుంచి 17.28 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

రత్నాలు, ఆభరణాల ఎగుమతులు డౌన్

మరోవైపు రత్నాలు, ఆభరణాల ఎగుమతుల అభివృద్ధి మండలి ఒక ప్రకటన చేస్తూ, మేనెల్లో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు 5 శాతం తగ్గి రూ.20,713.37 కోట్లుగా నమోదయినట్లు పేర్కొంది. 2023 ఇదే నెల్లో ఈ విలువ రూ.21,795.65 కోట్లు (2,647 మిలియన్ డాలర్లు).



చిన్న వ్యాపారులకు రూ.5 కోట్ల వరకు రుణం: ఎస్‌బీఐ

ముంబై: పైలట్ ప్రాజెక్టులో భాగంగా దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ నుంచి 20,000 మంది చిన్న వ్యాపారులకు ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా రుణాలను మంజూరు చేసినట్టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వెల్లడించింది. రుణగ్రహీతలకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణం అందజేసినట్టు తెలిపింది. ఇంటి వద్ద నుంచే కస్టమర్ ఈ రుణాలను అందుకున్నారని, పైలట్ ప్రాజెక్టు ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని ఎస్‌బీఐ వివరించింది. ఈ నేపథ్యంలో రుణ మొత్తాన్ని రూ.5 కోట్ల వరకు పెంచుతున్నట్టు ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీ సురేంద్ర రాణా తెలిపారు. అయిదు రోజుల్లోనే రుణం మంజూరు అవుతుందని చెప్పారు. చిన్న వ్యాపారాలకు రుణాలు ఇవ్వడం వచ్చే అయిదేళ్లలో సంస్థ వృద్ధి, లాభాలకు కేంద్ర బిందువు అవుతుందని ఎస్‌బీఐ ఇప్పటికే ప్రకటించింది. వ్యాపారులను చేరుకోవడానికి ప్రభుత్వం, లాభాపేక్ష లేని సంస్థలు, ఫిన్‌టెక్‌లతో బ్యాంకులు భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నాయని రాణా తెలిపారు. రానున్న రోజుల్లో వడ్డీ రేట్లు తగ్గుతాయని అంచనా వేస్తున్న బ్యాంకింగ్ దిగ్గజం దీనితో రుణ వృద్ధి మరింత పురోగమిస్తుందని అంచనా వేస్తోంది.



లక్ష్య సాధనకు పెన్నా డీల్ దోహదం

అంబుజా సిమెంట్స్ సీఈవో అజయ్ కపూర్

న్యూఢిల్లీ: పాత ప్లాంట్ల విస్తరణపై దృష్టి సారించామని.. 140 మిలియన్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యానికి చేరుకోవాలన్న సంస్థ లక్ష్యానికి పెన్నా సిమెంట్ వంటి కొనుగోలు అవకాశాలు సహాయపడతాయని దేశంలోని రెండవ అతిపెద్ద సిమెంట్ తయారీదారు అదానీ గ్రూప్ శుక్రవారం తెలిపింది. అదానీ గ్రూప్ కంపెనీ అయిన అంబుజా సిమెంట్ రూ.10,422 కోట్లకు పెన్నా సిమెంట్‌ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. శ్రీలంక మార్కెట్లో తిరిగి ఎంట్రీ ఇచ్చేందుకు తాజా డీల్ దోహదం చేస్తుందని ఇన్వెస్టర్ కాల్ సందర్భంగా అంబుజా సిమెంట్స్ సీఈవో, హోల్ టైమ్ డైరెక్టర్ అజయ్ కపూర్ శుక్రవారం తెలిపారు. అంబుజా ప్లాంట్లలో 40 మిలియన్ టన్నుల సామర్థ్యం జోడిస్తున్నామని చెప్పారు. 14 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన పెన్నా చేరికతో ప్రస్తుతం అదానీ సిమెంట్స్ సామర్థ్యం 93 మిలియన్ టన్నులకు చేరిందన్నారు. పెన్నా ప్లాంట్లలో విస్తరణ పూర్తి అయితే సామర్థ్యం 20% పెరుగుతుందని అంబుజా సీఎఫ్‌వో తెలిపారు. తద్వారా దక్షిణాది నుంచి అదానీ సిమెంట్స్ సామర్థ్యం 20 శాతానికి చేరుతుందని వివరించారు. ఈ ఏడాది చివరికి సంస్థ చేతిలో రూ.10,000 కోట్ల నగదు ఉంటుందన్నారు.

కొత్త శిఖరాలపై సూచీలు

ఇంట్రాడేలో నిఫ్టీ జీవితకాల రికార్డు

ముంబై: కేంద్రంలోని కొత్త ప్రభుత్వం మూలధన వ్యయాలకు ప్రాధాన్యత కొనసాగిస్తుందనే ఆశలతో దేశీయ స్టాక్ మార్కెట్ రికార్డుల ర్యాలీ శుక్రవారం కూడా కొనసాగింది. సెన్సెక్స్ 182 పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్టం 76,993 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 270 పాయింట్లు బలపడి 77,081 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 92 పాయింట్లు పెరిగి 23,490 వద్ద సరికొత్త రికార్డు లిఖించింది. ఆఖరికి 67 పాయింట్లు బలపడి కొత్త రికార్డు స్థాయి 23,466 వద్ద నిలిచింది.

- పెన్నా ఇండస్ట్రీస్‌ను సొంతం చేసుకోవడంతో అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్స్ షేరు 2% పెరిగి రూ.677 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 4% ఎగసి రూ.690 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ విలువ రూ.3,116 కోట్లు పెరిగి రూ.1.66 లక్షల కోట్లకు చేరింది.



ఐపీవో బాటలో హ్యుందాయ్

ఆటో రంగ దక్షిణ కొరియా దిగ్గజం హ్యుందాయ్ దేశీ విభాగం పబ్లిక్ ఇష్యూ బాట పట్టనుంది. ఇందుకు వీలుగా త్వరలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా కనీసం 3 బిలియన్ డాలర్లు(రూ. 25,000 కోట్లు) సమీకరించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. వెరసి హ్యుందాయ్ ఇండియా దేశీయంగా అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలవనున్నట్లు పేర్కొన్నాయి.

ఇండస్ నుంచి వొడాఫోన్ ఔట్!

టవర్స్ కంపెనీలో వాటా విక్రయానికి రెడీ • 21.5% వాటాకు రూ. 19,100 కోట్లు!

ముంబై: దేశీ మొబైల్ టవర్ల కంపెనీ ఇండస్ టవర్స్‌లో వాటాను విక్రయించేందుకు టెలికం రంగ బ్రిటిష్ దిగ్గజం వొడాఫోన్ గ్రూప్ ప్రణాళికలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇండస్‌లోగల పూర్తి వాటాను వొడాఫోన్ 2.3 బిలియన్ డాలర్లకు(రూ. 19,100 కోట్లు) విక్రయించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే వారం బ్లాక్‌డీల్స్ ద్వారా స్టాక్ మార్కెట్లో ఇండస్ వాటాను మొబైల్ దిగ్గజం విక్ర



యించే వీలున్నట్లు తెలియజేశాయి. ఇండస్‌లో గ్రూప్‌లోని వివిధ సంస్థల ద్వారా వొడాఫోన్ 21.5 శాతం వాటాను కలిగి ఉంది. బీఎస్‌ఈలో ఇండస్ టవర్స్ శుక్రవారం ముగింపు ధర రూ. 341తో చూస్తే వొడాఫోన్ వాటా విలువ రూ. 19,100 కోట్లుగా విశ్లేషకులు మదింపు చేశారు. నిధులను రుణ చెల్లింపులకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఇటీవల నిధుల సమీకరణ బాటలో సాగుతున్న వొడాఫోన్ ఐడియా షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 16.7 వద్ద ముగిసింది. గత కొద్ది రోజులుగా వొడాఫోన్ ఐడియా షేరు ర్యాలీ బాటలో సాగుతోంది.

కాగా.. డిమాండు ఆధారంగా వొడాఫోన్ గ్రూప్.. ఇండస్‌లో వాటా విక్రయాన్ని చేపట్టే వీలున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. వాటా విక్రయాన్ని నిర్వహించేందుకు వీలుగా బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, బీఎన్‌పీ పారిబాస్‌లను వొడాఫోన్ ఎంపిక చేసినట్లు పేర్కొన్నాయి. అయితే వొడాఫోన్ ఇండియా, బ్రిటిష్ మాతృ సంస్థ ప్రతినిధులు ఈ అంశంపై స్పందించకపోవడం గమనార్హం!

2022లోనూ..

నిజానికి 2022లో వొడాఫోన్.. ఇండస్ టవర్స్‌లోగల 28 శాతం వాటాను విక్రయించేందుకు నిర్ణయించినప్పటికీ స్వల్ప వాటాను మాత్రమే అమ్మగలిగింది. వాటా విక్రయానికి ప్రత్యర్థి టెలికం దిగ్గజాలతో చర్చలు చేపట్టినప్పటికీ ఫలించలేదు. ఇండస్‌లో వాటా విక్రయం ద్వారా 42 బిలియన్ డాలర్లకుపైగా గల నికర రుణాల్లో కొంతమేర తిరిగి చెల్లించేందుకు వొడాఫోన్ ప్రణాళికలు వేసింది. ప్రపంచంలోనే టెలికం టవర్ల దిగ్గజాలలో ఒకటిగా నిలుస్తున్న ఇండస్ టవర్స్ దేశీయంగా రెండో పెద్ద మొబైల్ టవర్ల కంపెనీగా నిలుస్తోంది. సుమారు 2,20,000 టవర్లు కలిగిన కంపెనీలో మరో మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌కు సైతం వాటా ఉంది.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో సుమిత్

పెరూగియా ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ఇటలీలో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 77వ ర్యాంకర్ సుమిత్ 6-4, 7-5తో మాక్స్ కస్నికౌస్కీ (పోలాండ్)పై గెలుపొందాడు. గంటా 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

యూకీ బాంబ్రీ జోడీ ఓటమి

బాస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సెమీఫైనల్లో ఓడిపోయింది. స్టుట్‌గార్ట్‌లో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ-ఒలివెట్టి ద్వయం 5-7, 4-6తో జూలియన్ క్యాష్ (బ్రిటన్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం 12 ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది.



ప్రణయ్ పరాజయం



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల కథ ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 10వ ర్యాంకర్ ప్రణయ్ 19-21, 13-21తో ఆరో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో... సమీర్ వర్మ 12-21, 13-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఆకర్షి 17-21, 12-21తో పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి ద్వయం 12-21, 14-21తో జెన్ బాంగ్ జియాంగ్-యా జిన్ వె (చైనా) చేతిలో ఓటమి చవిచూసింది.

భారత మహిళల ఆర్చరీ జట్టుకు నిరాశ

అంటాల్యా (టర్కీ): టాప్-4లో నిలిచి దర్జాగా పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించాలనుకున్న భారత మహిళల ఆర్చరీ జట్టుకు నిరాశ ఎదురైంది. చివరి క్వాలిఫయింగ్ టోర్నీలో దీపిక కుమారి, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. భారత జట్టు 3-5 (51-51, 55-52, 53-54, 52-54)తో వెరోనికా, అనస్తాసియా, ఒలాలతో కూడిన ఉక్రెయిన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరిన చైనా, చైనీస్ తైపీ, మలేసియా, బ్రిటన్ జట్లు ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో ఓడినప్పటికీ భారత జట్టుకు వరల్డ్ ర్యాంకింగ్ ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందే చివరి అవకాశం మిగిలి ఉంది. ప్రపంచకప్ స్టేజ్-3 టోర్నీ ముగిశాక ఈనెల 24న ప్రపంచ ర్యాంకింగ్స్ విడుదల చేస్తారు. ఇప్పటికీ ఒలింపిక్స్‌కు అర్హత పొందని రెండు ఉత్తమ ర్యాంక్ జట్లకు 'పారిస్' బెర్త్‌లు ఖరారవుతాయి. ఇప్పటి వరకు ఫ్రాన్స్, జర్మనీ, కొరియా, మెక్సికో, నెదర్లాండ్స్, అమెరికా, చైనా, చైనీస్ తైపీ, మలేసియా, బ్రిటన్ జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. చివరి రెండు బెర్త్‌లను వరల్డ్ ర్యాంకింగ్ ద్వారా ఖరారు చేస్తారు.



'సూపర్-8' కోసం సాధన!

నేడు కెనడాతో భారత్ చివరి లీగ్ మ్యాచ్

- జోరు మీదున్న టీమిండియా
- మ్యాచ్‌కు భారీ వర్షం ముప్పు
- రాత్రి 8 గంటల నుంచి నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

అమెరికా గడ్డపై అడుగు పెట్టినప్పటి నుంచి న్యూయార్క్‌లోనే ప్రాక్టీస్ మ్యాచ్, మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడిన భారత బృందం ఇప్పుడు అమెరికాలోనే మరో వేదికపై తమ సత్తాను చాటేందుకు సిద్ధమైంది. వరుసగా మూడు విజయాలతో ఇప్పటికే 'సూపర్-8' దశకు చేరిన జట్టు అప్రధాన్య పోరులో మరో పసి కూనను ఎదుర్కోనుంది. ఫామ్‌లో ఉన్న టీమిండియాకు కెనడా పోటీనివ్వడం కష్టమే అయినా తర్వాతి ప్రధాన మ్యాచ్‌లకు ముందు రోహిత్ బృందానికి మరో ప్రాక్టీస్ మ్యాచ్‌లాంటిదే. అయితే వర్షంతో ఆట జరుగుతుందా అనేది సందేహమే.

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): అమెరికాలో గత మూడు మ్యాచ్‌లలో పరుగుల కోసం మొఖం వాచిన భారత జట్టుకు కాస్త తెరిపినిచ్చే మైదానం సిద్ధమైంది. గతంలో పరుగుల వరద పారిన బ్రోవార్డ్ కౌంటీ స్టేడియంలో నేడు జరిగే గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో కెనడాతో భారత్ తలపడుతుంది. ఆడిన మూడు మ్యాచ్‌లలో విజయాలు సాధించిన భారత తమ స్థాయిని ప్రదర్శించగా... రెండు ఓటములతో కెనడా ఇప్పటికే ముందుకు వెళ్లే అవకాశాలు కోల్పోయింది.

కోహ్లి చెలరేగితే...

భారత జట్టుకు సంబంధించి ఈ మ్యాచ్‌కు ఎలాంటి ప్రాధాన్యత లేకపోయినా... తుది జట్టులో మార్పులు ఉంటాయా అనేది చూడాలి. ఫామ్‌పరంగా చూస్తే ఎవరినీ తప్పించే పరిస్థితి లేదు. కానీ ఒక అవకాశం ఇవ్వాలని భావిస్తే మాత్రం జడేజాకు బదులుగా కుల్దీప్‌ను ప్రయత్నించవచ్చు. జడేజా గత మ్యాచ్‌లో కనీసం ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. అమెరికాతో పర్వాలేదనిపించిన దూబే స్థానంలో సామ్సన్‌కు మేనేజ్‌మెంట్ అవకాశం కల్పిస్తే సూపర్-8కు ముందు ప్రాక్టీస్ లభిస్తుంది. ప్రస్తుత స్థితిలో యశస్వి, చహల్‌లు పెవిలియన్‌కే పరిమితం కావాల్సి రావచ్చు. అయితే అన్నింటికి మించి కోహ్లి ఫామ్‌లోకి రావాలని అంతా కోరుకుంటున్నారు. మూడు మ్యాచ్‌లలోనూ అతను సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. బౌలింగ్‌లో ముగ్గురు పేసర్లూ ఆకట్టుకున్నారు. రోహిత్, పంత్, సూర్య దూకుడైన బ్యాటింగ్‌ను నిలువరించడం కెనడాకు అంత సులువు కాదు.



కోహ్లి

పిచ్, వాతావరణం

ఫ్లోరిడాలో శనివారం భారీ వర్ష సూచన ఉంది. శుక్రవారం అమెరికా, ఐర్లాండ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మ్యాచ్ జరిగితే భారీ స్కోర్లు ఖాయం. భారత్ ఈ వేదికగా 2016 నుంచి వెస్టిండీస్ ప్రత్యర్థిగానే 8 మ్యాచ్‌లు ఆడింది. వీటిలో ఐదింటిలో గెలిచి, రెండింటిలో ఓడింది. ఒక మ్యాచ్ రద్దయింది.

సమష్టిగా రాణించాలని...

పాక్‌తో మ్యాచ్‌లో ఓడినా కెనడా గట్టి పోటీనిచ్చింది. విడిగా చూస్తే ఎవరికీ పెద్దగా పేరు లేకున్నా సమష్టిగా ఆ జట్టు వరల్డ్‌కప్‌లో తమదైన ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తోంది. ఓపెనర్ ఆరోన్ జాన్సన్ దూకుడుగా ఆడగల సమర్థుడు. నికోలస్ కీర్తన్, మొవ్వ శ్రేయస్ కూడా ప్రధాన బ్యాటర్లు. వీరిలో ఏ ఇద్దరైనా రాణిస్తే జట్టుకు మంచి స్కోరు అందించగలరు. కెప్టెన్, ఆల్‌రౌండర్ సాద్ బిన్ జఫర్ మరో ప్రధాన ఆటగాడు కాగా... లెఫ్టార్మ్ పేసర్ కలీమ్ ప్రభావం చూపగల బౌలర్. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఐర్లాండ్‌ను ఓడించగలిగిన కెనడా... టాప్ టీమ్‌ను ఎలా ఎదుర్కోగలదో చూడాలి.



టి20 ప్రపంచకప్‌లో నేడు
దక్షిణాఫ్రికా X నేపాల్
వేదిక: కింగ్స్‌టౌన్; ఉదయం గం. 5 నుంచి
న్యూజిలాండ్ X ఉగాండా
వేదిక: ట్రినిడాడ్; ఉదయం గం. 6 నుంచి
భారత్ X కెనడా
వేదిక: ఫ్లోరిడా; రాత్రి గం. 8 నుంచి
ఇంగ్లండ్ X నమీబియా
వేదిక: నార్త్‌సౌండ్; రాత్రి గం. 10:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

అమెరికా ముందుకు... పాక్ ఇంటికి

- సూపర్-8కు చేరిన ఆతిథ్య జట్టు
- లీగ్ దశలో నిష్క్రమించిన మాజీ విజేత
- వర్షంతో ఐర్లాండ్, అమెరికా మ్యాచ్ రద్దు

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): టి20 ప్రపంచ కప్‌లో అత్యంత కీలక ఫలితం! తొలిసారి ప్రపంచ కప్‌లో పాల్గొన్న ఆతిథ్య అమెరికా జట్టు సూపర్-8 దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'ఎ'లో శుక్రవారం అమెరికా, ఐర్లాండ్ మధ్య జరగాల్సిన లీగ్ మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దయింది. దాంతో ఈ గ్రూప్ నుంచి భారత్ (6 పాయింట్లు), అమెరికా (5 పాయింట్లు) ముందంజ వేశాయి. ఆడిన 3 మ్యాచ్‌లలో ఒకటే గెలిచిన 2009 చాంపియన్ పాకిస్తాన్ లీగ్ దశలోనే నిష్క్రమించింది. గత రెండు టి20ల్లో వరల్డ్ కప్‌లలో వరుసగా సెమీఫైనల్, ఫైనల్ వరకు చేరిన పాక్ ఈసారి పేలవ ప్రదర్శనతో కుప్పకూలింది. భారత్‌తో పాటు అమెరికా చేతిలో ఓడిన ఆ జట్టు కెనడాపై మాత్రం గెలవగలిగింది. ఈ గ్రూప్‌లో బలహీన కెనడాపై నెగ్గిన అమెరికా... పాక్‌పై సంచలన విజయం సాధించి తమ అవకాశాలు మెరుగుపర్చుకుంది. తాజా ఫలితంతో ఆదివారం ఐర్లాండ్‌తో తమ చివరి మ్యాచ్ ఆడకుండానే వరల్డ్ కప్‌లో పాక్ ఆట ముగిసింది. లాడర్‌హిల్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు శుక్రవారం కూడా తెరిపినివ్వలేదు. నిర్ణీత సమయం నుంచి దాదాపు మూడు గంటల సుదీర్ఘ సమయం పాటు వేచి చూసినా ఫలితం లేకపోయింది. వర్షం తగ్గినా మ్యాచ్ కోసం మైదానాన్ని సిద్ధం చేయడం సాధ్యం కాలేదు. పదే పదే తనిఖీల తర్వాత కనీసం 5 ఓవర్ల ఆట అయినా నిర్వహించాలని ఆశించినా... మళ్లీ చినుకులు మొదలయ్యాయి. దాంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆతిథ్య జట్టు హోదాలో బరిలోకి దిగి సూపర్-8కు చేరడం ద్వారా అమెరికా 2026 టి20 వరల్డ్ కప్‌కు కూడా నేరుగా అర్హత సాధించింది.



ఇంగ్లండ్ రేసులోకొచ్చింది!

48 పరుగుల లక్ష్యం 3.1 ఓవర్లలోనే ఛేదన • 8 వికెట్ల తేడాతో ఒమన్‌పై ఘనవిజయం

అంటిగ్వా: స్కాట్లాండ్‌తో మ్యాచ్ రద్దవడం, ఆస్ట్రేలియా చేతిలో ఓడటంతో గ్రూప్ 'బి'లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ ముందుకెళ్లే ఆశలు సన్నగిల్లాయి. అయితే ఒకే ఒక్క విజయం... 3.1 ఓవర్లలో ముగించేయడం... 101 బంతులు మిగల్చడం... ఇంగ్లండ్‌ను ఒక్కసారిగా ఈ టి20 ప్రపంచకప్ రేసులోకి తీసుకొచ్చింది. శుక్రవారం జరిగిన పోరులో బట్లర్ బృందం 8 వికెట్ల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 13.2 ఓవర్లలో 47 పరుగులకే కుప్పకూలింది. షోయబ్ ఖాన్ (23 బంతుల్లో 11; 1 ఫోర్) ఇన్నింగ్స్ టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆదిల్ రషీద్ 11 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్ 12 పరుగుల చొప్పున ఇచ్చి చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత ఇంగ్లండ్ 3.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ జోస్ బట్లర్ (8 బంతుల్లో 24 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), సాల్ట్ (3 బంతుల్లో 12; 2 సిక్స్‌లు) దంచేశారు.



ఆర్చర్

అదరగొట్టిన అఫ్గానిస్తాన్... సూపర్-8కు అర్హత

తరుబా (ట్రినిడాడ్): టి20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్తాన్ గ్రూప్ 'సి'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 6 పాయింట్లతో 'సూపర్-8' దశకు అర్హత సంపాదించింది. ఈ గ్రూప్ నుంచి వెస్టిండీస్ కూడా సూపర్-8కు చేరడంతో న్యూజిలాండ్ ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. శుక్రవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 7 వికెట్ల తేడాతో పాపువా న్యూగినీ జట్టుపై గెలిచింది. ముందుగా న్యూగినీ జట్టు 19.5 ఓవర్లలో 95 పరుగులకే ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫరూఖీ (3/16), నవీనుల్ (2/4) రాణించారు. అనంతరం అఫ్గానిస్తాన్ 15.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసి గెలిచింది. గుల్బదిన్ (36 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు.



ఫరూఖీ

క్లుప్తంగా...

కేంద్రాన్ని ప్రత్యేక హోదా అడగండి

సీఎం చంద్రబాబుకు ఏపీ పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ లగుడు గోవిందరావు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ సీట్లు టీడీపీ గెలిచిన సందర్భంగా.. రాష్ట్రానికి అవసరమైన ప్రత్యేక హోదాను తీసుకురావాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీపై ఉందని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ లగుడు గోవిందరావు తెలిపారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చే అవకాశం కూడా ఉందని సూచించారు. శుక్రవారం ఏపీ భవన్‌లో గోవిందరావు మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు సహకారంతోనే కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారన్నారు. ఈసమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడిగే హక్కు చంద్రబాబుకు మాత్రమే ఉంటుందన్నారు. హోదాతో పాటు వెనుకబడిన జిల్లాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేకమైన ప్యాకేజీ నిధులను తీసుకురావాలని కోరారు. విశాఖ రైల్వే జోన్ నిర్మాణాన్ని చేపట్టాలని, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులను తీసుకురావాలని, విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. నీట్‌పై కేంద్రం సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

క్రిస్టియన్ ఎయిడెడ్ స్కూళ్లలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ న్యాయవాది పెరికె వరప్రసాదరావు

సాక్షి, అమరావతి: మెగా డీఎస్సీ ప్రకటించిన సీఎం చంద్రబాబు అందులోనే ఆంధ్రప్రదేశ్‌లోని క్రిస్టియన్ ఎయిడెడ్ స్కూళ్లలో ఉన్న ఉపాధ్యాయ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్, న్యాయవాది పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టులు 20 వేల పైగా ఉన్నాయని, తక్షణమే మెగా డీఎస్సీలో భాగంగా ఈ పోస్టులు కూడా భర్తీ చేయాలని, ఇలా చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సీబీసీఎం, ఆర్సీఎం, సీఎస్ఐ, ఐసీఎం, సెవెంత్ డే, ఏబీఎన్ లూథరన్ ఎయిడెడ్ సంస్థలలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అదే విధంగా ఎస్సీలకు ఇప్పుడు కేవలం రెండు మంత్రి పదవులు మాత్రమే కేటాయించారనీ, మరో రెండు కేబినెట్ మంత్రి పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ కులాల జనాభా దామాషా ప్రకారం నలుగురు ఎస్సీలకు మంత్రి పదవులు కేటాయించాల్సి ఉందని చెప్పారు.

ఈతకు వెళ్లి ఇద్దరు స్నేహితుల మృత్యువాత




చందు, నవీన్ మృతదేహాలు

దర్శి: ఈత సరదా ఇద్దరు స్నేహితుల ప్రాణాలు తీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం వాగుమడుగుకు చెందిన వసంతపురం చెన్నయ్య కుమారుడు చందు(16), లంకోజనపల్లి పంచాయతీ లూర్దుగిరి కాలనీకి చెందిన బొందల బాలసౌరి కుమారుడు నవీన్(16)లు స్నేహితులు. వీరికి ఉన్న మరో స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా ఆహార పదార్థాలు తెచ్చుకుని తిన్నారు. అనంతరం చందు, నవీన్‌లు శివరాజనగర్‌లోని ఎన్ఏపీ రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. సరదాగా ఈతకొట్టాలనుకున్న వారు చొక్కాల్లో సెల్‌ఫోన్‌లు ఉంచి గోడపై పెట్టి నీటిలోకి దిగారు. వాళ్లు దిగిన చోట 18 అడుగుల లోతు ఉండటంతో పాటు కింద పూడు ఉంది. దీంతో ఈత కొట్టలేక లోపల పూడులో ఇరుక్కుని కూరుకుపోయారు. వాళ్లు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో పిల్లలకు తల్లిదండ్రులు ఫోన్ చేశారు. సమయానికి అటు వెళ్తున్న గేదెల కాపరులు ఫోన్ ఎత్తి ఇక్కడ దుస్తులు, ఫోన్ తప్ప ఎవరూ లేరని సమాధానం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు వచ్చి వెతుకులాడగా నీటిలో ఒక మృతదేహం బయట పడింది. మరో మృతదేహాన్ని అతి కష్టం మీద కర్రల సాయంతో బయటకు తీశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సుమన్, ఏఎస్ఐ రాంబాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులిద్దరూ ఇటీవల ఒంగోలులో ఇంటర్ చదివేందుకు కళాశాలను చూసి వచ్చారు. రెండు రోజుల్లో వెళ్లాల్సి ఉండగా ఇలా జరగడంపై కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

పంట పొలాలపై ఆగని ఏనుగుల దాడులు

కల్లూరు (చిత్తూరు జిల్లా): పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు ఆగడం లేదు. ఐదు రోజులుగా ఎక్కడో ఒక చోట రోజూ పంట పొలాలపై దాడులు చేస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇళ్లపైకి వస్తాయేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏనుగుల గుంపు శుక్రవారం తెల్లవారు జామున శ్రీనివాసపురంలో ప్రతాప్‌రెడ్డి మామిడి తోటలోకి ప్రవేశించి మామిడి కాయలను రాల్చేసి, కొమ్మలను విరిచేశాయి. అలాగే మరికొంత మంది రైతుల మామిడి, అరటి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

గిట్టుబాటు కాని ఆయిల్‌పామ్

- టన్ను గెలల ధర రూ.13,280
- ఎకరాకు సగటున 8 టన్నుల దిగుబడి
- ఆయిల్ రికవరీపై ధర నిర్ణయం
- తోటలను తొలగిస్తున్న రైతులు



దేవరపల్లి మండలం యర్నగూడెంలో సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోట

దేవరపల్లి: రెండేళ్లుగా గిట్టుబాటు ధర రాక.. పెట్టిన పెట్టుబడులు, కౌలు డబ్బులు సైతం గిట్టుబాటు కాకపోవడంతో ఆయిల్‌పామ్ సాగు పట్ల రైతుల ఆసక్తి సన్నగిల్లుతున్నది. మెట్ట ప్రాంతంల్లోని రైతులు 25 ఏళ్లగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. మొక్క వేసిన ఏడాది నుంచి నాలుగేళ్లలో దిగుబడి మొదలై సుమారు 25 ఏళ్ల వరకు కొనసాగుతుంది. రైతులు పండించిన గెలలను పామాయిల్ తయారీ ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తున్నాయి. కొంత కాలం పంటకు గిట్టుబాటు ధర లభించింది. దీనికి తోడు ప్రభుత్వం కూడా రాయితీపై మొక్కలు సరఫరా చేయడంతో పాటు నాలుగేళ్ల వరకు ఎరువులు, పురుగు మందులపై రాయితీలు ఇచ్చి ప్రోత్సహించింది. దీంతో ఎక్కువ మంది రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ వైపు మొగ్గు చూపి వేలాది ఎకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు.

37,654 ఎకరాల్లో..

తూర్పు గోదావరి జిల్లాలోని 18 మండలాల్లో 37,654 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. నల్లజర్ల, దేవరపల్లి, రంగంపేట మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో పంట ఉంది. ఎకరాకు 10 నుంచి 13 టన్నుల గెలల దిగుబడి సాధిస్తున్నారు. ఎకరాకు సగటున 8 టన్నుల దిగుబడి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ గెలల దిగుబడి జూన్ నుంచి ప్రారంభమవుతుంది. వర్షాకాలంలో వచ్చే పంట దిగుబడి బాగుంటుందని రైతులు తెలిపారు. సారవంతమైన భూములు, యాజమాన్య పద్ధతులు చేపడుతున్న తోటల్లో ఎకరాకు 12 టన్నుల వరకు కూడా దిగుబడి వస్తోంది. ఈసారి రైతులు 12 వేల ఎకరాల్లో మొక్క తోటలు వేశారు. మొక్క రూ.250 చొప్పున కొనుగోలు చేశారు.

ఆయిల్ రికవరీపై గెలల ధర నిర్ణయం

ఫ్యాక్టరీలో గెలలను క్రషింగ్ చేసిన అనంతరం వచ్చే పామాయిల్ రికవరీ శాతంపై ప్రభుత్వం గెలల ధర నిర్ణయిస్తుంది. ఈ నెలలో ఫ్యాక్టరీకి పంపిన గెలలకు వచ్చే నెలలో ధర ప్రకటిస్తారు. ఏప్రిల్ నెలలో ఉత్పత్తి చేసిన గెలలకు మే నెలలో టన్నుకు రూ.14,095 ధర లభించింది. మే నెలలో ఉత్పత్తి అయిన గెలలకు టన్నుకు రూ.13,280 మాత్రమే లభించింది. ఒక్క నెలలోనే టన్నుకు రూ.815 ధర పడిపోయింది. పండించిన గెలలను 3ఎఫ్ ఆయిల్ ఫ్యాక్టరీ, నవభారత్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు కొనుగోలు చేస్తున్నాయి.

2022లో టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.24 వేలు పలకడంతో రైతులకు ఊహించని లాభాలు వచ్చాయి. దీంతో రైతులు పొగాకు, జీడిమామిడి తోటలను తొలగించి, ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టారు. అయితే, రెండేళ్లుగా పొగాకుకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుండడంతో తిరిగి ఆయిల్‌పామ్, జీడిమామిడి తోటలను తొలగించి పొగాకు వైపు మొగ్గు చూపుతున్నారు.

గిట్టుబాటు కావడం లేదు



ఆయిల్‌పామ్ సాగు గిట్టుబాటు కావడం లేదు. ఖర్చులు పెరిగాయి. దీనికి తగినట్టు మార్కెట్లో గిట్టుబాటు ధర రావడం లేదు. గత నెలలో టన్ను గెలల ధర రూ.14,095 ఉండగా, ఈ నెలలో రూ.13,280కి తగ్గింది. పంట గిట్టుబాటు కాక చాలా మంది రైతులు తోటలు తీసేస్తున్నారు.

– యాగంటి వెంకటేశ్వరరావు, రైతు, దేవరపల్లి, తూర్పు గోదావరి జిల్లా

టన్ను గెలల ధర రూ.16 వేలు తగ్గకూడదు



ఆయిల్‌పామ్ గెలల టన్ను ధర రూ.16 వేలకు తగ్గకూడదు. ప్రస్తుతం ఇస్తున్న ధర పెట్టుబడులకు సరిపోదు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల పెట్టుబడి అవుతున్నది. దిగుబడులు 12 టన్నుల నుంచి 8 టన్నులకు తగ్గడంతో గిట్టుబాటు కావడం లేదు. పామాయిల్ దిగుమతుల ప్రభావం కూడా ఇక్కడి పంటపై పడింది.

– నరహరిశెట్టి రాజేంద్రబాబు, డైరెక్టర్, పామాయిల్ బోర్డు

వర్షాభావంతో తగ్గిన దిగుబడులు



వర్షాభావ పరిస్థితుల వల్ల ఆయిల్‌పామ్ గెలల దిగుబడులు తగ్గాయి. ఎకరాకు సగటున 8 టన్నుల గెలల దిగుబడి వస్తున్నది. తోటలపై శ్రద్ధ చూపిన రైతులు 10 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు. ఈ ఏడాది తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉంది. దీనివల్ల తోటలు దెబ్బ తిన్నాయి.

– సుజాత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, రాజమహేంద్రవరం

చంద్రబాబు మంత్రివర్గంలో బలహీన వర్గాలకు అన్యాయం

- వైఎస్ జగన్ మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 17 మంత్రి పదవులు
- ఆయా వర్గాలకు కేవలం 12 మంత్రిపదవులే ఇచ్చిన బాబు
- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు కేవలం 12 మంత్రి పదవులే దక్కాయి. బీసీలకు 8, ఎస్సీలకు 2, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఒక్కొక్కటి చొప్పున ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఏకంగా 17 మంత్రి పదవులు ఇచ్చి ఆయా వర్గాలకు పెద్దపీట వేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు వర్గాలకు ఒక్కో ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి ఆయా వర్గాలను గౌరవించారు. చంద్రబాబు మంత్రివర్గంలో కాపు వర్గానికి చెందిన పవన్ కళ్యాణ్‌కు మాత్రమే ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పట్ల నిర్లక్ష్యం వహించారు. వైఎస్ జగన్ తన ప్రతి అడుగులో సామాజికన్యాయాన్ని పాటించారు. మంత్రివర్గం నుంచి స్థానిక సంస్థలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ లాంటి అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50శాతానికిపైగా పదవులు ఇచ్చి రాజకీయ సాధికారతకు బాటలు వేశారు. చంద్రబాబు తన తొలి అడుగులోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పట్ల చిన్నచూపు చూశారు' అని హనుమంత్ నాయక్ చెప్పారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- కృష్ణా జిల్లా సీతనపల్లిలో మూడు వాహనాలు ఢీ కొనడంతో ఘటన
- ఆరుగురు దుర్మరణం.. మరో ఐదుగురికి తీవ్రగాయాలు
- పొట్టకూటి కోసం వెళుతున్న కూలీలను కాటేసిన మృత్యువు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా



ప్రమాదంలో మరణించిన చేపల ప్యాకింగ్ కార్మికులు



లారీలోనే ఇరుక్కుపోయి మరణించిన డ్రైవర్

కృత్తివెన్ను (పెడన): పొట్టకూటి కోసం తెల్లవారక ముందే బయలుదేరిన కూలీల బతుకులు తెల్లారిపోయాయి. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లిలో శుక్రవారం వేకువ జామున 216 నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కృత్తివెన్ను ఎస్ఐ కె.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ అంబేడ్కర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 10 మంది కూలీలు మినీ వ్యాన్‌లో కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం తుమ్మిడి వద్ద చేపల ప్యాకింగ్ పనులకు వెళ్తున్నారు. అదే సమయంలో పాండిచ్చేరి నుంచి భీమవరానికి రొయ్య పిల్లల లోడ్‌తో హేచర్ లారీ వెళ్తోంది. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తున్నాయి. ఇదే సమయంలో లక్ష్మీపురం నుంచి బంటుమిల్లి వైపు సరుగు పుల్లల లోడ్‌తో ట్రాక్టర్ వెళ్తోంది. ఈ మూడు వాహనాలు సీతనపల్లి పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చే సరికి కూలీలతో వెళుతున్న మినీ వ్యాన్ డ్రైవర్ ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోయి దాని వెనుక భాగాన్ని ఢీ కొట్టుకుంటూ ఎదురుగా వస్తున్న లారీని కూడా బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో లారీ, కూలీలతో వెళ్తున్న మినీ వ్యాన్ ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ దారుణ ప్రమాదంలో రేవు నాగభూషణం (26), గండి ధర్మవరప్రసాద్ (27), పెదశింగు కనకరాజు (34), చింతా లోవరాజు (32), మాగాపు నాగరాజు (30), అయ్యప్పన్ జయరామన్ (42) మృత్యువాతపడ్డారు. వీరిలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా మరొకరిని ఆస్పత్రిగా తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుల్లో హేచర్ లారీ డ్రైవర్‌తోపాటు మినీ వ్యాన్ డ్రైవర్ కూడా ఉన్నారు. కాగా ఈ ఘటనలో మేడిశెట్టి మహేష్, చింతా దుర్గాప్రసాద్, రేవు జ్ఞానేశ్వరరావు, మల్లాది శ్రీకాంత్, సంగాని నాగేంద్రబాబు తీవ్రంగా గాయపడ్డారు. వీరు మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ఒకరు తప్ప మిగిలినవారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులు. మరొకరు తమిళనాడుకు చెందినవారని సమాచారం. ప్రమాదం గురించి తెలియగానే కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక ఎస్ఐ నాగరాజుతో పాటు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సీఐ నాగేంద్రకుమార్ ఆయనకు వివరించారు. అతివేగం, మినీ వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తే ఈ ఘటనకు కారణమన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మచిలీపట్నంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను మంత్రి కొల్లు రవీంద్ర, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరామర్శించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి సూచించారు. కాగా పెడన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శ్రీవారి సేవలో మహారాష్ట్ర గవర్నర్



తిరుమల: మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

స్వామివారి దర్శనానికి 16 గంటలు

తిరుమలలో భక్తుల అధికంగా ఉంది. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 61,499 మంది స్వామివారిని దర్శించుకోగా.. 33,384 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.04 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేనివారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది.

యాప్స్‌లో అప్పులు.. తీర్చేందుకు చోరీ

- అవసరానికి మించిన అప్పులతో దొంగగా మారిన కార్పెంటర్
- 24 గంటల్లోపే చోరీ కేసులో నిందితుడి అరెస్ట్




నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: లోన్ యాప్‌ల ద్వారా తీసుకున్న అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ కార్పెంటర్ దొంగగా మారాడు. చోరీ చేసిన 24 గంటల్లోపే పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసు వివరాలను అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ టీవీవీ ప్రతాప్ మీడియాకు శుక్రవారం వెల్లడించారు. అనంతపురం పాతూరులోని భవానీనగర్ నివాసి వి.చంద్రమోహన్‌రెడ్డి ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. తన భార్య లతారెడ్డితో కలసి రైల్వే ఫీడర్ రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఇంటికి తాళం వేసి దంపతులు తమ దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో ఇంటి తలుపులకు పక్కనే ఉన్న కిటికీ అద్దం పగులగొట్టి రాడ్ సాయంతో తలుపులు బద్దలుకొట్టి ఓ దుండగుడు లోపలికి ప్రవేశించాడు. కప్‌బోర్డుకు ఉన్న యూరోపా లాక్‌ను తెరిచి అందులోని 30 తులాల బంగారు నగలు, రూ.50 వేల నగదు అపహరించాడు. అదే రోజు మధ్యాహ్నం చంద్రమోహన్‌రెడ్డి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చాడు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో అనంతపురంలోని నందమూరి నగర్‌కు చెందిన షేక్ ఖాజాపీరా అలియాస్ షారూక్...కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతను లోన్ యాప్‌ల ద్వారా అవసరాలకు మించి అప్పులు చేశాడు. లోన్ యాప్‌ల నుంచి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో ఎలాగైనా అప్పులు తీర్చాలని భావించాడు. అతడికి దొంగతనం తప్ప మరో మార్గం కనిపించలేదు. అదే సమయంలో తన ఇంట్లో యూరోపా లాక్ సిస్టమ్‌తో కప్‌బోర్డుల తయారీ పనిని షారూక్‌కు చంద్రమోహన్‌రెడ్డి అప్పగించాడు. ఆ సమయంలో షారూక్ అంత భద్రతతో ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నించి ఇంట్లో నగలు, నగదు దాచే విషయాన్ని రాబట్టుకున్నాడు. దీంతో ఎలాగైనా ఆ ఇంట్లో చోరీ చేసి లోన్ యాప్‌ల రుణాలు తీర్చాలని భావించాడు. 2 నెలల క్రితం చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో కప్‌బోర్డులు చేసిన షారూక్ అనంతరం ఆ ఇంటిపై కన్నేశాడు. గురువారం దంపతులిద్దరూ ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లగానే ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. కాగా, శుక్రవారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం వద్దకు షారూక్ చేరుకోగానే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని 30 తులాల బంగారు నగలు, రూ.35 వేలు రికవరీ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

టీడీపీ నేతలు శవాలపై పేలాలు ఏరుకుంటున్నారు

- ఆత్మహత్య చేసుకున్న సుబ్బారావు నాకు రూ.12 కోట్లు ఇచ్చారని దుష్ప్రచారం చేశారు
- చనిపోవడానికి ముందు ఆయన రాసిన లేఖలు చదవండి
- అప్పుల భారంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్పష్టంగా చెప్పారు
- ముందే తెలిసి ఉంటే సుబ్బారావు ఆత్మహత్యని ఆపేవాడిని
- ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారావు ఆత్మహత్యను తనకు అంటగట్టి టీడీపీ నాయకులు శవాలపై పేలాలు ఏరుకోవాలని ప్రయత్నించారని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సుబ్బారావు సూసైడ్ నోట్‌లో ఆధారాలు దొరికితే తనను కేసులో ఇరికించేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నించారని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పరిస్థితి మరోలా ఉందన్నారు. ఎన్నికల్లో బెట్టింగ్‌లు కట్టడంతోపాటు ఆర్థిక సమస్యల కారణంగా సుబ్బారావు విజయవాడ వెళ్లి కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. చనిపోవడానికి ముందు సుబ్బారావు ఏడుగురికి లేఖలు రాసి కొరియర్‌లో పంపాడన్నారు. అప్పుల భారంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆ లేఖల్లో స్పష్టంగా వివరించాడన్నారు. ఆయన అంతిమ యాత్రకు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ రావాలని కోరుకున్నారని తెలిపారు. 2029 ఎన్నికల్లో మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని స్పష్టంగా తెలిపారన్నారు. అప్పుల వివరాలను కూడా సుబ్బారావు లేఖల్లో పేర్కొన్నారని, ఇదంతా తెలుసుకోకుండా టీడీపీ నేతలు దురుద్దేశంతోనే సుబ్బారావు ఎన్నికల సందర్భంగా తనకు రూ.12 కోట్లు అప్పు తెచ్చిచ్చాడని, తాను ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని వాట్సాప్ గ్రూపుల్లో ట్రోల్ చేశారన్నారు. తాను ఎమ్మెల్యే కాకముందు సుబ్బారావు రూ.5 లక్షలు తనకు ఇచ్చాడని, తాను తిరిగి రూ.4 లక్షలు చెల్లించానన్నారు. తనకు ఈ విషయం గుర్తు లేదని, తాను రూ.లక్ష బాకీ ఉన్న విషయాన్ని కూడా సుబ్బారావు లేఖలో ప్రస్తావించారన్నారు. తన కుటుంబంతో సుబ్బారావుకు అనుబంధం ఉందన్నారు. అప్పుల విషయాన్ని సుబ్బారావు ముందే చెప్పి ఉంటే ఆయన ఆత్మహత్యని ఆపి ఉండే వాడినని చెప్పారు. ఓ వైపు పార్టీ ఓటమిని జీర్ణించుకోలేక, మరో వైపు అప్పుల భారంతో ఆయన ఆత్మహత్య చేసుకోవడం బాధాకరంగా ఉందన్నారు. సుబ్బారావు మరణించిన విషయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్ ద్వారా తెలిపామని, ఆయన జిల్లాకు వచ్చినప్పుడు కుటుంబాన్ని ప్రొద్దుటూరుకు పిలిపిస్తామన్నారు. టీడీపీ నేతలు గత ఐదేళ్లు తనపై దుష్ప్రచారం చేసి ఎన్నికల్లో గెలిచారని శివప్రసాదరెడ్డి తెలిపారు. అభివృద్ధి ఓడిందని, అబద్ధం గెలిచిందన్నారు. అబద్ధం ఆయుష్షు స్వల్పమేనని, ప్రజలు నిదానంగా వాస్తవాలను తెలుసుకుంటారని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కేంద్రమంత్రి సోమణ్ణ తనయుడిపై కేసు

బనశంకరి: కేంద్ర జలవనరులు, రైల్వేశాఖ సహాయ మంత్రి వి.సోమణ్ణ కుమారుడు అరుణ్ సోమణ్ణ సహా ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదైంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని మోసగించి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ తృప్తిహెగ్డే అనే వ్యక్తి వేసిన ప్రైవేటు పిటిషన్‌పై బెంగళూరు నగర 37వ ఏసీఎంఎంకోర్టు విచారణ చేపట్టి కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేసింది. అరుణ్ సోమణ్ణ, జీవన్‌కుమార్, ప్రమోద్‌రావ్ అనే ముగ్గురిపై వంచన, అపహరణ, అవమానం, దాడులు తదితర ఆరోపణలతో సంజయ్‌నగర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదుదారుడైన తృప్తిహెగ్డే..మద్వరాజ్ అనే వ్యక్తితో కలిసి 23 ఏళ్లనుంచి ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ నిర్వహిస్తున్నారు. 2013లో ప్రభుత్వ కార్యక్రమం ఏర్పాటు చేయగా మంత్రి సోమణ్ణ కుమారుడు అరుణ్ సోమణ్ణ పరిచయమయ్యాడు. 2019లో అరుణ్, మద్వరాజ్, తృప్తిహెగ్డే నైబర్‌హుడ్ అనే ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని ప్రారంభించారు. నష్టాలు రావడంతో అరుణ్, మద్వరాజ్ తనను వేధించి కంపెనీ భాగస్వామి నుంచి రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారని, గదిలో బంధించి హింసించారని, తన కుటుంబ సభ్యులను కూడా అరుణ్ సోమణ్ణ బెదిరించారని తృప్తిహెగ్డే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు అరుణ్ సోమణ్ణ, జీవన్ కుమార్, ప్రమోద్‌రావ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

విజయవంతంగా యువకుడి గుండె మార్పిడి

తిరుపతిలోని శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌లో వైద్యుల ఘనత

తిరుపతి తుడా: స్థానిక టీటీడీ శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌లో శుక్రవారం ఓ యువకుడికి వైద్యులు విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించారు. ఐదు గంటలు శ్రమించి వైద్యులు ఆ యువకుడి ప్రాణాలు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలు... కాకినాడకు చెందిన ఓ యువకుడు(24) గుండె సంబంధ సమస్యతో బాధపడుతూ రెండు నెలలుగా తిరుపతిలోని శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. అతని గుండె సామర్థ్యం పూర్తిగా క్షీణించిందని వైద్యులు నిర్ధారించారు. అతనికి గుండె మార్పిడి అనివార్యమని గుర్తించారు. ఈ మేరకు నెల రోజుల కిందట ఆ యువకుడి వివరాలను అవయవదాన్ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. గుండె అందుబాటులోకి వచ్చే వరకు ఆ యువకుడిని వైద్యుల బృందం పర్యవేక్షిస్తూ ఉంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నానికి చెందిన ఓ యువకుడు(39) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు అక్కడే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ఆ యువకుడి బ్రెయిన్ డెడ్ అయినట్లు



ఆస్పత్రి లోపలికి గుండెను తీసుకువెళుతున్న వైద్యులు

వైద్యులు నిర్ధారించడంతో అతని అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ మేరకు అవయవదాన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేశారు. దీంతో శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ వైద్యులు విశాఖ వెళ్లి బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి గుండెను సేకరించి ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం 1.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి గ్రీన్ చానల్ ద్వారా 19 నిమిషాల్లో శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌కు చేర్చారు. వెంటనే 2.15 గంటలకు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో వైద్యులు గుండె మార్పిడి శస్త్రచికిత్సను ప్రారంభించి, సాయంత్రం 7.15 గంటలకు విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా వైద్యులను పలువురు అభినందించారు.

15 మందికి గుండె మార్పిడి శస్త్రచికిత్సలు

గుండె మార్పిడి ఆపరేషన్లలో తిరుపతికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. మహా నగరాల్లో అత్యున్నత ప్రమాణాలు కలిగిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే చేస్తున్న గుండె మార్పిడి శస్త్రచికిత్సలను టీటీడీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న టీటీడీ శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌లోనూ విజయవంతంగా చేపడుతున్నారు. ఈ ఆస్పత్రిని ప్రారంభించిన అనతికాలంలోనే 2,560 మందికి పైగా చిన్నారులకు గుండె సంబంధిత శస్త్ర చికిత్సలను చేశారు. అదేవిధంగా శుక్రవారంతో 15 మందికి గుండె మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తిచేశారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



పోటీలో పరుగులు తీస్తున్న ఎడ్లు

ఏలేశ్వరం: శ్రీ నేరేళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాలిలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో సీనియర్ విభాగంలో 7 జట్లు, జూనియర్ విభాగంలో 27 జట్లు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో అనకాపల్లి జిల్లా లంకవానిపాలేనికి చెందిన పైడితల్లి ప్రథమ, కోనసీమ జిల్లా మండపేటకు చెందిన బొబ్బిలిరాజు ద్వితీయ, కాకినాడ సమీపంలోని కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో కాకినాడ జిల్లా కొప్పవరం గ్రామానికి చెందిన బందారు శ్రీను మెమోరియల్ ప్రథమ, తూర్పు గోదావరి జిల్లా దుళ్ల గ్రామానికి చెందిన తూము శ్రీను ద్వితీయ, కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు బహుమతులు అందజేశారు.

బంగారంతో టీ–20 సూక్ష్మ వరల్డ్ కప్





వరల్డ్ కప్

పెద్దాపురం: టీ–20 వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత, కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణానికి చెందిన తాళాబత్తుల సాయి బంగారంతో సూక్ష్మమైన టీ–20 వరల్డ్ కప్ రూపొందించారు. కేవలం 45 నిమిషాల సమయంలో 0.200 మిల్లీ గ్రాముల బంగారంతో ఈ వరల్డ్ కప్ తయారు చేశారు. ఇది చూపరులను ఆకర్షిస్తోంది.

ప్రపంచస్థాయి ఆర్చరీ పోటీల్లో మెరిసిన తెలుగు తేజం

కాంస్య పతకం కైవశం చేసుకున్న తిరుపతి జిల్లా వాసి



కాంస్య పతకంతో గణేష్ మణిరత్నం

నాయుడుపేట టౌన్: దక్షిణ కొరియాలోని సువాన్‌లో ఈ నెల 2–9 వరకు జరిగిన అంతర్జాతీయ ఆర్చరీ 2024–ఆసియా కప్ పురుషుల పోటీల్లో తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం సత్తా చాటాడు. ఈ పోటీల్లో ఆయన కాంస్య పతకం సాధించాడు. శుక్రవారం నాయుడుపేటలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతూ బంగారు, రజత పతకాలను సాధించినట్లు తెలిపాడు. 2017–23 వరకు ఏపీ, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన ఆర్చరీ పోటీల్లో పాల్గొని ఇప్పటివరకు 5 స్వర్ణం, 6 రజత పతకాలను సాధించానని వివరించాడు. దీనికి సహకరించిన తన తల్లిదండ్రులు తిరుమూరు హరిప్రసాద్, సుప్రియ, కోచ్‌లు శివశంకర్, కమల్‌కిషోర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపాడు. స్పోర్ట్స్ కోటాలో చెన్నై ఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్ ఇచ్చారని చెప్పాడు.

పాలిటెక్నిక్ తొలి విడతలో 35,591 సీట్ల భర్తీ

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు తొలి విడత కౌన్సెలింగ్ ముగిసినట్లు సాంకేతిక విద్యాశాఖ ఇన్‌చార్జి కమిషనర్, అడ్మిషన్ల కన్వీనర్ బి.నవ్య శుక్రవారం తెలిపారు. తొలి దశలో 35,591 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రవేశ పరీక్షలో 1,24,430 మంది అర్హత సాధించగా 41,311 మంది కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత 38,348 మంది కౌన్సెలింగ్‌కు అర్హత సాధించగా, 36,758 మంది ఆప్షన్లను ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. సీట్లు పొందిన విద్యార్థులు సాంకేతిక విద్యా శాఖ వెబ్‌సైట్‌లో అలాట్‌మెంట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జూన్ 19లోపు సీట్లు పొందిన కళాశాలల్లో ఆన్‌లైన్, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని విద్యార్థులను ఆదేశించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచే తరగతులు ప్రారంభించినట్లు వెల్లడించారు. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో సీట్లు 17,915 సీట్లు ఉండగా 12,180 (68%) సీట్లు భర్తీ అయ్యాయన్నారు. 172 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 62,313 సీట్లు ఉండగా 23,411 (37.5%) సీట్లు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 260 కళాశాలల్లో 80,228 సీట్లకు గాను 44.36% సీట్లు తొలి విడతలో భర్తీ చేసినట్లు తెలిపారు.

రూ.150 కోట్ల విలువైన మాదకద్రవ్యాల పట్టివేత

తమిళనాడులో ఘటన

సాక్షి, చెన్నై: పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడు మీదుగా శ్రీలంకకు తరలిస్తున్న రూ.150 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను వేళాంగినిలో నాగపట్నం పోలీసులు పట్టుకున్నారు. రామేశ్వరానికి నాగపట్నం నుంచి పెద్దఎత్తున హెరాయిన్, బ్రౌన్ షుగర్ వంటి మాదక ద్రవ్యాలు తరలిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు తనిఖీలు విస్తృతం చేశారు. పసిగట్టిన స్మగర్లు వేళాంగినిలో ఓ గెస్ట్‌హౌస్‌లో గది అద్దెకు తీసుకుని బస చేశారు. వీరి కదలికలపై అనుమానాలు రావడంతో అక్కడి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారించగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని తేలింది. వారు వచ్చిన లగ్జరీ కార్లను తనిఖీ చేయగా రూ.150 కోట్ల విలువైన 75 కేజీల మాదక ద్రవ్యాలు లభించాయి. పోలీసులు వారిని అరెస్టు చేసి కారు సీజ్ చేశారు.

'శాంపిల్ టేకర్' పోస్టులకు 21న సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఏపీ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో శాంపిల్ టేకర్ పోస్టులకు ఈనెల 21న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎంపికైన అభ్యర్థులు ధ్రువపత్రాలతో విజయవాడలోని సర్వీస్ కమిషన్ కార్యాలయంలో హాజరుకావాలని కార్యదర్శి సూచించారు. వివరాలకు https:// psc. ap. gov. inలో చూడాలని సూచించారు.

వచ్చేనెల 12 వరకు 'నేను బడికి పోతా' ప్రత్యేక డ్రైవ్

సాక్షి, అమరావతి: బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించేందుకు సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం 'నేను బడికి పోతా' పేరుతో గురువారం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఈ డ్రైవ్ జూలై 12వ తేదీ వరకు గ్రామ, పట్టణ వార్డు స్థాయిలో నూరు శాతం అమలు చేయాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 15 । జూన్ । 2024



ముగిసిన నాటికల పోటీలు

హర్ష క్రియేషన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంత రాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ సాంఘిక నాటికల పోటీలు ముగిశాయి. -IIలో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గరిష్ఠం/కనిష్ఠం
41/25

	కనిష్ఠం	గరిష్ఠం
నందిగామ	26.4	37
జగ్గయ్యపేట	25	41
మచిలీపట్నం	28	37
గుడివాడ	28	38

చినుకు పడితే నరకమే..

- నగరంలోని ప్రధాన రహదారులు జలమయం
- వర్షం నీటితో పాటుగా డ్రెయినేజీ నీరు రోడ్లపైనే
- రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న నగరవాసులు
- బెంజిసర్కిల్‌లో వాహనాల బారులు
- వర్షం పడితే తప్పని ట్రాఫిక్ చిక్కులు



నిర్మల కాన్వెంట్ రోడ్డులో వర్షం నీటిలోనే ప్రయాణం (ఫైల్)



బెంజిసర్కిల్ వద్ద నిలిచిన వాన నీరు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: చినుకు పడితే విజయవాడవాసులు వణికిపోతున్నారు. వాన కురిస్తే నగరంలోని అన్ని ప్రధాన, అంతర్గత రహదారులపై వర్షం నీరు నిలుస్తోంది. దీంతో నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ప్రధాన రహదారులైన ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డు, పంట కాల్వ రోడ్డు, ఐదో నంబర్ బస్సు రూట్, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, లయోల కళాశాల రోడ్డు, గురునానక్ కాలనీ రోడ్డు, నిర్మల కాన్వెంట్ రోడ్డు, క్రీస్తురాజపురం ప్రధాన రహదారి రోడ్డు ఇలా ఒక్కటేంటి ఏ జంక్షన్ చూసినా ట్రాఫిక్ నిలిచిపోతోంది. బెంజిసర్కిల్‌లో నలువైపులా భారీ సంఖ్యలో వాహనాలు బారులు తీరుతున్నాయి. దీనికితోడు రోడ్లపై మురుగునీటితోపాటు, వర్షం నీరు తోడై రోడ్లపైనే నీరు ప్రవహిస్తుండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెంజిసర్కిల్‌నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వైపు భారీగా మురుగు నీరు చేరుతోంది. నిర్మల కాన్వెంట్ ఇలా పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహన చోదకులు వెళ్లాలంటే హడలిపోతున్నారు.

రోడ్డుపై నీరు.. వాహనాల బారులు

ఎంజీ రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి తప్పించుకోడానికి పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డుపైకి చేరుకుని అటు నుంచి పటమట చేరుకోవాలంటే మైనేని జంక్షన్ వద్ద లేదా నిర్మల కాన్వెంట్ రోడ్డు పైన వాహనాలు బారులు తీరుతున్నాయి. గురునానక్ కాలనీ రోడ్డుపై ఇదే పరిస్థితి. పంట కాల్వ రోడ్డు అయితే కాల్వను తలపిస్తూ ఉంది. ఐదో నంబరు బస్సు రూట్, రమేష్ ఆస్పత్రి రోడ్ల పరిస్థితి అంత మెరుగ్గా ఏమీ లేదు. ఇక వర్షం పడినప్పుడు జమ్మిచెట్టు సెంటర్, మదర్‌థెరిస్సా జంక్షన్, నైస్‌బార్ జంక్షన్, విశాలాంధ్ర రోడ్డు జంక్షన్, చుట్టుగుంట ట్రాఫిక్ జంక్షన్‌ల పరిస్థితి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచింది. ఎందుకంటే వర్షం వచ్చినప్పుడు ఈ జంక్షన్ల వద్ద వాహనచోదకులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

త్వరగా డ్రెయినేజీ పనులు పూర్తి చేస్తేనే..

రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురవడం మొదలయ్యాయి. మచిలీపట్నం జాతీయ రహదారి బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ మార్గంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు. గత నెలలో ఎన్‌హెచ్‌ఏఐ, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ 65లో బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ మార్గంలో సరైన డ్రెయినేజీ లేకపోవడంతో రెండుకిలోమీటర్ల పరిధిలో 4,5 ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతోనగరంలో భారీ వర్షాలు కురిసినప్పుడు, వర్షం నీరు జాతీయ రహదారిపై నిల్వ ఉండి నగరం నుంచి పోయే వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో శాశ్వత పరిష్కారం దిశగా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు. డ్రెయినేజీ పనులకు ఇబ్బంది కలగకుండా వీఎంసీ అధికారులు రహదారి విస్తరణ పనులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాల్సింది.

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి

బెంజ్‌సర్కిల్ జంక్షన్ నుంచి పటమట ఎన్టీఆర్ సర్కిల్ వైపునకు వెళ్లే రోడ్డులో ప్రస్తుతం రోడ్డు విస్తరణ, డ్రెయిన్ నిర్మాణ పనులు కొన'సాగు'తున్నాయి. దీంతో వాహనచోదకుల కష్టాలు మరిన్ని ఎక్కువయ్యాయి. ఒక ఉద్యోగి సాధారణ రోజుల్లో తన విధులు ముగించుకుని సాయంత్రం ఐదు గంటలకు ఆఫీస్ నుంచి బయలుదేరితే కేవల 30 నుంచి 40 నిమిషాల వ్యవధిలో ఇంటిగుమ్మం ముందుకు చేరేవారు. అదే వర్షం పడితే సుమారు గంటన్నర సమయం పైనే పడుతుంది. నగరంలోని ప్రధాన, అంతర్గత రహదారులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటే కొంత సమయం ఆదా అవుతుంది. లేదంటే నగరంలో ట్రాఫిక్ వ్యూహంలో చిక్కుకోవాల్సిందే. అందుకు ప్రత్యామ్నాయమార్గాలు అన్వేషించడంతో పాటుగా వాటిని ఆచరణలో పెడితేనే ఈ సమస్యను అధిగమించగలం.

న్యూస్‌రీల్

వెస్ట్ గోదావరిపై కృష్ణా జట్టు విజయం



మూలపాడు(ఇబ్రహీంపట్నం): సెంట్రల్ జోన్ అండర్ 23 అంతర్ జిల్లాల వన్డే మెన్ క్రికెట్ మ్యాచ్‌లు మూలపాడు ఏసీఏ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం వెస్ట్ గోదావరి జట్టుపై కృష్ణా జట్టు 73 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 324 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టు క్రీడాకారులు పీవీ దుర్గారావు 97, వరుణ్ సాత్విక్ 73, శ్రీనిశ్చయ్ 70 పరుగులతో రాణించడంతో జట్టు భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పశ్చిమ గోదావరి జట్టు 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఆ జట్టు ఆటగాడు స్వామినాయుడు ఒంటరి పోరాటం చేసి 103 పరుగులతో రాణించాడు. కృష్ణా జట్టు 73 పరుగుల తేడాతో విజయం సాధించింది.

డైట్‌కు 20 అడ్మిషన్లు



గుడ్లవల్లేరు: అంగలూరు ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా జిల్లా సంస్థ(డైట్)లో శుక్రవారం జిల్లా స్థాయిలో అడ్మిషన్లు జరిగాయి. ఈ అడ్మిషన్లలో అంగలూరు ప్రభుత్వ డైట్‌కు 11 మంది, మచిలీపట్నం ఏజే కాలేజీకి ఐదుగురు, విస్సన్నపేట వికాస్ కాలేజీకి నలుగురు విద్యార్థులు అడ్మిషన్లను పొందినట్లు స్థానిక డైట్ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థుల సర్టిఫికెట్లను లెక్చరర్ ప్రకాశం, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పరిశీలించారు. అధ్యాపకులు వినయ్‌కుమార్, మోహినీకుమారి ఉన్నారు.

సీఎస్‌ఆర్ నిధులతో ఆస్పత్రి అభివృద్ధి



గుడివాడ టౌన్: గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యానికి అవసరమైన అన్ని రకాల పరికరాలు అందజేసేందుకు సీఎస్‌ఆర్ వ్యవస్థ సిద్ధంగా ఉందని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ దాస్ అన్నారు. కార్పొరేషన్ బృంద సభ్యులు ఆస్పత్రిలో శుక్రవారం వివిధ శాఖలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్పొరేషన్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పని చేస్తోందన్నారు. ప్రజా ప్రయోజనాలకు అవసరమయ్యే నిధులను సీఎస్‌ఆర్ ఫండ్స్ నుంచి కేటాయించడం, వినియోగించడం కార్పొరేషన్ బాధ్యత అన్నారు. ఇప్పటి వరకు రూ.30 లక్షలు విలువ చేసే యంత్ర సామగ్రి ఆస్పత్రికి అందజేశామన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రికి పెద్ద ఎత్తున నిధులు అందజేశామన్నారు. ఇప్పటికే కృష్ణా జిల్లాలోని వివిధ ఆస్పత్రుల అభివృద్ధికి రూ.5.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమైన సీటీ స్కాన్ మిషన్ ఏర్పాటుకు మా కార్పొరేషన్ సిద్ధంగా ఉందని ఎంపీ బాలశౌరి సీఎస్‌ఆర్ కమిటీ సభ్యుడు అయినందున మరోసారి విషయాన్ని వారి దృష్టికి తెచ్చి సీటీ స్కానర్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై సంతృప్తి

నున్న సచివాలయంలో కేంద్ర బృందం పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ సచివాలయం ఒకటి పరిధిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వన్ (ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్) లో ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యాధికారుల బృందం(నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) సంతృప్తి వ్యక్తం చేసింది. శుక్రవారం కేంద్రం నుంచి డాక్టర్ రెహాన్ అహ్మద్ ఖ్యూరేషి, డాక్టర్ నిమాన్ రాశిజీ వైద్యాధికారుల బృందం హెల్త్‌క్లినిక్‌లో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం హెల్త్‌క్లినిక్‌లో రోగులు కోర్సు పూర్తయ్యే వరకు వస్తున్నారా, మధ్యలో ఆగిపోతే రోగి ఆరోగ్య పరిస్థితిపై తదుపరి చర్యలేంటని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమ్య, ఏఎన్ఎం రజని, ఆశావర్కర్లను ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య పథకాలు, ప్రజలకు అమలు చేస్తున్న వివరాలను తెలుసుకున్నారు. డాక్టర్లు నిరంజన్, శ్రావణి, మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షనల్ అధికారి పెద్దిరావు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించవచ్చు



మాట్లాడుతున్న వైద్యశాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది క్యాన్సర్ లక్షణాలపై అవగాహన పెంపొందించుకుంటే స్క్రీనింగ్ చేసి తొలిదశలో గుర్తించే అవకాశం ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పని చేసే వైద్య సిబ్బందికి క్యాన్సర్ లక్షణాలపై అవగాహన పెంపొందించడానికి శిక్షణ జరుగుతోంది. ఇది జరుగుతున్న తీరును శుక్రవారం డాక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ శిక్షణ పొందిన ప్రతినిధులను బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, నోటి, గొంతు క్యాన్సర్‌పై వారికున్న అవగాహనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెద్య సిబ్బందికి క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కలిగించడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, ఎన్‌సీడీ–సీడీ నోడల్ అధికారి డాక్టర్ శ్యామల, హెచ్‌డబ్ల్యూసీ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ మహమ్మారి నిర్మూలనకు చర్యలు

గుడివాడరూరల్: క్యాన్సర్ మహమ్మారి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సమగ్ర క్యాన్సర్ కేర్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. 30 ఏళ్లు దాటిన వారికి రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లకు సంబంధించి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర క్యాన్సర్ నిర్మూలనకు క్యాన్సర్ కేర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసంక్రమిత వ్యాధుల విభాగం ఆఫీసర్ కాటూరి హిమబిందు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈ నెల 16వ తేదీ ఆదివారం నిర్వహించనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష–2024కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరిశీలకులు సుబ్రహ్మణ్యంతో కలసి పరీక్ష కేంద్రాల సూపర్‌వైజర్లు, సహాయ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలో 25 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు 11,112 మంది అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష జరగనుందని తెలిపారు. 25 మంది రూట్ అధికారులు, 25 మంది సూపర్‌వైజర్లు, 25 మంది సహాయ సూపర్‌వైజర్లు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీటీవీల నిఘాతో పాటు జామర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మౌలిక వసతుల కల్పనకు కృషి

- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 5.38 కోట్లు
- ఒప్పందం కుదుర్చుకున్న కలెక్టర్ డీకే బాలాజీ



ఒప్పంద పత్రాలను చూపుతున్న కలెక్టర్ డీకె బాలాజీ, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న మత్స్యకారుల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరైనట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు, కలెక్టర్ డీకే బాలాజీ రూ. 5.38 కోట్ల నిధులు మంజూరు పరస్పర అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నాగాయలంక మండలం గుల్లలమోద, ఎదురుమొండి గ్రామాల మత్స్యకారుల శ్రేయస్సుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు అందించడానికి ముందుకు వచ్చిందన్నారు. లోతైన సముద్రంలో చేపల వేట కోసం బోట్లు ఏర్పాటు, చేపల రవాణా వాహనం కొనుగోలు, మత్స్యకారులు వలలను మరమ్మతులు చేసేందుకు భవన నిర్మాణం, తదితర అవసరాలను తీర్చేందుకు ఈ నిధులను వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ మానికొండ ప్రభాకర్, మేనేజర్ సురేష్‌కుమార్, సీపీవో గోపాలకృష్ణ, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.శివసామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

తెల్లారక ముందే తెల్లారిన బతుకులు

- కృత్తివెన్ను మండలం జాతీయ రహదారిపై ప్రమాద ఘటనలో ఆరుగురి మృతి
- మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో బాధితులను పరామర్శించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ
- ఘటనపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



వైద్య సేవలు పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో మాజీ ఎంపీ కొనకళ్ల, కలెక్టర్, ఎస్పీ

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి గ్రామం వద్ద శుక్రవారం తెల్లవారు జామున 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు శ్రమజీవులు మరణించారు. వారి మృతిపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక్కో మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మంత్రి కొల్లు శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాలను, చికిత్స పొందుతున్న ఐదుగురు బాధితులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎక్స్‌గ్రేషియా త్వరగా అందించాలని, అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీకి సూచించారు. అంతకుముందు కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి క్షతగాత్రులను పరామర్శించారు. మృతదేహాలకు పోస్టుమార్టం త్వరితగతిన నిర్వహించి, అవసరమైన వైద్య ప్రక్రియ అవలంబించాలన్నారు. మృతదేహాలను మహాప్రస్థానం వాహనాల్లో వారి స్వగృహాలకు తరలించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్.. ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్‌ను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు వారికి ఉన్న అర్హత మేరకు ప్రభుత్వ బీమా పథకాల ద్వారా వచ్చే మొత్తాన్ని త్వరగా అందించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని డీపీఓ, డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ప్రమాదం జరిగిన తీరు, ఘటనా స్థలంలో పరిస్థితులను మంత్రికి, కలెక్టర్‌కు వివరించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జీజీహెచ్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ నిరంజన్ కుమార్, నేత్ర వైద్య నిపుణుడు జి.భానుమూర్తి, బందరు ఆర్డీఓ ఎం.వాణి, బందరు డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్, మాజీఎంపీ కొనకళ్ల నారాయణరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబాప్రసాద్, స్థానిక నాయకులు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

కాకినాడ జిల్లా గొర్రిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి మహేష్ కుమార్, అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గద్దన్నపల్లి గ్రామానికి చెందిన చింతా దుర్గాప్రసాద్, యానాం మండలం ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన రేవు గణేశ్వరరావు, మల్లెల శ్రీకాంత్ గాయపడ్డారు. వీరంతా స్థానిక జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన సంగాని నాగేంద్రబాబుకు తీవ్రగాయం కావడంతో సీటీ స్కానింగ్ తీశామని ఆయన లివర్ దెబ్బతిన్నట్లు నిర్ధారణ అయ్యిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ కుమార్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం నాగేంద్రబాబును విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కన్నీటి పర్యంతం

బతుకు తెరువులో భాగంగా రోజూ మాదిరిగా చేపల ప్యాకింగ్‌కు వెళ్లిన ఆ ఇద్దరూ ఇక ఎప్పటికీ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారన్న చేదు నిజాన్ని స్వగ్రామాల్లోని ఆ కుటుంబాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రమాదంలో మృతి చెందిన చింతా లోవరాజు (31), మాగాపు నాగరాజు (32), తీవ్రంగా గాయపడిన చింతా దుర్గాప్రసాద్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందినవారు. వీరు ముగ్గురూ తాళ్లరేవుకు చెందిన చేపల వ్యాపారి వద్ద రెండేళ్లుగా పని చేస్తున్నారు. వారిని రోడ్డు ప్రమాదం బలిగొనడంతో నాగరాజు, లోవరాజు కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. లోవరాజు మృతికి అతని తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు. మృతుల్లో ధర్మవరప్రసాద్ బతుకు తెరువు కోసం డ్రైవింగ్ నేర్చుకుని ట్యాక్సీపై డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య వరలక్ష్మి, ఏడాదిన్నర పాప ఉన్నారు. ఈ నేపథ్యంలో ధర్మవరప్రసాద్ శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు గొర్రిపూడి గ్రామస్తుడు మేడిశెట్టి మహేష్‌కుమార్ (చేపల కంపెనీ గుమాస్తా)తో కల్సి బొలేరో వ్యాన్‌లో బయలుదేరి వెళ్లారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మరో 9 మందిని ఎక్కించుకుని చేపల పట్టుబడికి బయలుదేరారు. సీతనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరప్రసాద్ మృతిచెందగా మహేష్‌కుమార్‌కు గాయాలయ్యాయి. తాళ్లరేవుకు చెందిన ఓ చేపల వ్యాపారి వద్ద మండలంలో ఎస్.యానం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు చేపల లోడు తీసుకురావడానికి తాళ్లరేవు నుంచి బయలు దేరారు. కృత్తివెన్ను వద్ద తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రేవు భూషణం (24), పెసంగి కనకరాజు (36) అక్కడికక్కడే మృతి చెందగా మల్లాడి శ్రీకాంత్, రేవు జ్ఞానేశ్వరరావు, సంగాని నాగేంద్రబాబు తీవ్ర గాయాలపాలయ్యారు

మృతుల వివరాలు



గండి ధర్మ వరప్రసాద్ (ఫైల్)



పెసంగి కనకరాజు (ఫైల్)



రేవు భూషణం (ఫైల్)



చింతా లోవరాజు(ఫైల్)

వారికి రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి

ప్రమాదంలో మరణించిన వారు పని చేస్తేనే వారి కుటుంబ జీవనం గడుస్తుంది. ఊహించని విధంగా తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కుటుంబాలకు ఆధారమైన వ్యక్తులు మృత్యువాతకు గురయ్యారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డుపాలయ్యాయి. ఈ ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా యానాం మండలం ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన రేవు భూషణం (26), కరప గ్రామానికి గంధి ధర్మ వరప్రసాద్ (27), యానం మండలం ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన పెదసింగు కనకరాజు (34), అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గద్దన్నపల్లి గ్రామానికి చెందిన మగపు నాగరాజు (32), చింత లోవరాజు (32), కంటైనర్ డ్రైవర్ తమిళనాడు వేల్పూర్‌కు చెందిన అయ్యాపన్ రామన్ (42) ఈ ప్రమాదంలో మృతి చెందారు.

డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీరు నిల్వను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరముందని.. మురుగు నీటి పారుదల వ్యవస్థల్లో లోపాలను గుర్తించి, తక్షణమే సరిదిద్దడానికి చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రెయినేజీ వ్యవస్థ సజావుగా సాగేలా చర్యలు తీసుకొని దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాలపై శుక్రవారం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి, మునిసిపల్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రెయినేజీ వ్యవస్థలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మైనర్ పంచాయతీల్లో ఎక్కడైతే మురుగునీరు, వర్షం నీరు నిల్వ ఉండే అవకాశముందో ఆయా ప్రాంతాలను ముందుగానే గుర్తించాలన్నారు. సమీపంలో ఇంకుడు గుంతలు తవ్వి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారం వారం సమీక్షలు నిర్వహించి లోపాలను సరిదిద్దాలన్నారు. డ్రెయినేజీ అభివృద్ధి చేయడం ద్వారా దోమల వ్యాప్తిని సాధ్యమైనంత వరకు నివారించి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టగలుగుతామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. నీటి పథకాల వ్యవస్థల పరిరక్షణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్‌సీఏపీలో విజయవాడకు మెరుగైన ర్యాంకుకు కృషి

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో విజయవాడకు మెరుగైన ర్యాంకు సాధన దిశగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వెస్ట్ బైపాస్‌లో విద్యుత్ హెచ్‌టీ లైన్లు తొలగించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, ఆర్డీఓ బీహెచ్ భవానీశంకర్, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డీవీ రమణ, నేషనల్ హైవేస్ పీడీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఉన్న ప్రగఢ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కె.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్‌లో పాసైన విద్యార్థులకు, ఐటీఐ రెండు సంవత్సరాలు పాసైన వారికి నేరుగా సెకండియర్ డిప్లమో కోర్సులో ప్రవేశం పొందవచ్చని చెప్పారు. ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 94417 95408, 98661 69908 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



గన్నవరం రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎన్డీఆర్ఎఫ్(నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) 10వ బెటాలియన్ కమాండెంట్ జాహిద్‌ఖాన్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొండపావులూరు ఎన్డీఆర్ఎఫ్ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ విజయవాడతో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మంది జవాన్లు, అధికారులు రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో రక్తదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. సామాజిక ప్రయోజనాల కోసం ఎల్లప్పుడు ముందుండే ఎన్డీఆర్ఎఫ్ రక్తదానాన్ని బాధ్యతగా స్వీకరించిందన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాలను నిలబెట్టే ఉన్నత ప్రక్రియలో దాతలు భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యంగా దేశంలోని యువత రక్తదానానికి ముందుకు రావాలని ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన రక్తం ఎల్లప్పుడు బ్లడ్ బ్యాంకుల్లో అందుబాటులో ఉండే విధంగా కృషి చేయడం అందరి సామాజిక బాధ్యత అని తెలిపారు. రక్తదానం చేసిన జవాన్లు, అధికారులను ఆయన అభినందించారు. శిబిరంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ డాక్టర్ అరుణ్‌కుమార్, సిబ్బంది సేవలందించారు.

మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. శని, ఆదివారాలు సాధారణ సెలవులతోపాటు సోమవారం బక్రీద్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని మిర్చి యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం చెప్పారు.

రేడియేషన్.. ఆరోగ్యం పరేషాన్

- జనావాసాల మధ్య సెల్ టవర్ల ఏర్పాటు
- నిబంధనలకు పాతరేస్తున్న కార్పొరేట్ కంపెనీలు
- కొన్నింటికే అనుమతులు
- భారీగా వెలువడుతున్న రేడియేషన్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



పామర్రులో ఇళ్ల మధ్యన ఏర్పాటు చేసిన సెల్ టవర్

పామర్రు: ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా అందరికీ నిత్యావసర వస్తువుగా సెల్‌ఫోన్ మారింది. అయితే నేటి కాలంలో ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో సెల్‌ఫోన్ అవసరం ఎంతుందో... అంతకు రెండింతలు ప్రజలు ఆరోగ్యం కూడా ముఖ్యమే. ఓ పక్క రసాయనిక మందులు, ఎరువులు వాడకం అధికం కావడంతో ఆహార పదార్థాలు విషతుల్యమవుతూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. అయితే ఇళ్ల, జనావాసాల మధ్య సెల్ టవర్ల ఏర్పాటుతో వాటి నుంచి విడుదల అయ్యే రేడియేషన్ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

ప్రజల ఆరోగ్యంపై సెల్ టవర్ల నుంచి వెలువడుతున్న రేడియేషన్ తీవ్ర ప్రభావం చూపుతోంది. కొన్ని కార్పొరేట్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ఏమైతే తమకేంటనే ధోరణి కొన్ని కార్పొరేట్ సంస్థల్లో కనిపిస్తోంది. రోజు రోజుకు పెరిగిపోతున్న సెల్ టవర్ల ఏర్పాటే ఇందుకు నిదర్శనం. తమ వ్యాపారం కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్న సంస్థలు నిబంధనలకు పాతరేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న సెల్ టవర్ కంపెనీల యాజమాన్యాలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గతంలో రాజకీయ నేతల ఒత్తిడి, కార్పొరేట్ సంస్థల ప్రలోభాలకు అధికారులు తలొగ్గి విచ్చలవిడిగా టవర్లు ఏర్పాటు చేశారు. ఇది స్థానిక ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికి తోడు మానవ మనుగడకే అతి ప్రమాదకరమైన రేడియేషన్ పెద్ద ఎత్తున విడుదల అవుతుండడంతో గ్రామీణ ప్రాంతంలో పక్షిజాతులు సైతం అంతరించుకుపోతున్నాయి. వాతావరణంలో ఇంతటి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

రేడియేషన్ ముప్పు..

జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో సెల్ టవర్లు ఉన్నాయి. సెల్ టవర్లు ఉన్న ప్రాంతంలో రేడియోధార్మిక ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా సెల్ టవర్లకు 100 మీటర్ల పరిధిలో ఉండే వారికి నిద్రాభంగం, ఊపిరి ఆడకపోవడం, డిప్రెషన్, తలనొప్పి, అలసట, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు ఏర్పడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని జనావాసాల మధ్య ఎక్కువగా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తుండడం వలన ప్రజల ఆరోగ్యం డైలమాలో పడే ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రమాదం సంభవిస్తే..

సెల్ టవర్లను పాఠశాల భవనాలపై, నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. భూమి కంపించినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు అవి కూలితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుంది. గ్రామాల్లో నివాస గృహాల మధ్య ఒక టవర్‌పై వివిధ కంపెనీలకు చెందిన పరికరాలు అమర్చడంతో అక్కడ అధిక రేడియేషన్ వెలువడతోందని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరి..

గ్రామీణ ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ, పట్టణాల్లో టౌన్ ప్లానింగ్ అధికారుల నివేదిక అనుగుణంగా అనుమతులు ఇస్తారు. ప్రభుత్వ ఉత్తర్వులు(జీవో నంబర్ 183) ప్రకారం అనుమతులు లేనిదే ఎక్కడబడితే అక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేయడానికి వీలులేదు. జిల్లాలో చాలా టవర్లకు అనుమతులు లేవు. స్థానిక అధికారులు కంపెనీ ప్రతినిధులతో చేతులు కలిపి విచ్చలవిడిగా టవర్లు ఏర్పాటు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

గోవధకు పాల్పడినా, తోడ్పడినా చట్టరీత్యా శిక్షార్హులు



గోవధ నిషేధ చట్టంపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గోవధకు పాల్పడినా, తోడ్పడినా చట్టరీత్యా శిక్షార్హులేనని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా జంతు సంక్షేమ సంఘం చైర్మన్, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన రెవెన్యూ, పోలీస్, నగరపాలక సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోవధ నిషేధ చట్టం అమలుపై సొసైటీ ఫర్ ప్రివెన్షన్ అఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ పశుసంరక్షణా చట్టం- 1977 ప్రకారం గోవధ నిషేధించడమైనదన్నారు. ప్రాథమికంగా మన దేశంలో అన్ని మతాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఉంటాయని, అదే సమయంలో ఇతర మతాల మనోభావాలను, ఆచారాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. గోవధ నిషేధ పశు సంరక్షణా చట్టం – 1977 ప్రకారం పశవులను వధించేందుకు ఈ చట్టం పరిమితంగానే అనుమతిస్తోందన్నారు. గర్భం దాల్చిన పశువులను, పాలు తాగే లేగదూడలను వధించరాదన్నారు. ఏదైనా ఒక పశువును వధించాలంటే ఆ పశువు వయస్సు 14 ఏళ్లు నిండి ఉండాలని, వ్యవసాయ పనులకు, పునరుత్పత్తికి పనికిరాని గిత్తలకు పశువైద్యులు నిర్ధారించిన వైద్య నివేదిక తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఏ ప్రాంతంలోనైనా చట్ట విరుద్ధంగా పశువులను వధించడం, అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందితే అధికారులు స్వీకరించి విచారణ జరపవచ్చునన్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

బక్రీద్ సందర్భంగా గోవధ నియంత్రణకు మండల, డివిజన్ గ్రామ స్థాయిలో సంబంధిత అధికారులతో చట్టాన్ని పర్యవేక్షించేలా ప్రత్యేక బృందాలు నియమించామని కలెక్టర్ తెలిపారు. పశువులను కబేళాకు తరలించే ముందు పరిశీలించి, ఫామ్– ఎ సర్టిఫికెట్ ఉంటేనే దానిని నిర్ధారించి లోపలికి అనుమతిస్తారన్నారు. దీనికి పోలీస్ శాఖకు చెందిన అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామని చెప్పారు. రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి ఆర్డీఓ, పోలీస్ శాఖ నుంచి డీఎస్పీ, పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ టీమ్ సభ్యులుగాను, మండలానికి సంబంధించి పశుసంవర్ధక ఏడీ, తహసీల్దార్, స్టేషన్ ఆఫీసర్లతో కూడిన ముగ్గురు సభ్యులు టీమ్ విధులు నిర్వర్తిస్తారన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ సభ్యులుగా ఉన్న టీమ్ గోవధ నిషేధ పశుసంరక్షణా చట్టాన్ని పర్యవేక్షిస్తారన్నారు. మత సామరస్యంతో బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకుని జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. అనంతరం గోవధ నిషేధ పశుసంరక్షణ చట్టంపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.వి.రమణ, ఇన్‌చార్జి డీపీఓ ఎన్వీ.శివప్రసాద్ యాదవ్, నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ రంగాన్ని పునరుత్తేజ పరుస్తాం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



కోడూరులో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

కోడూరు: దివిసీమ రైతాంగానికి నూతన ప్రభుత్వం అండగా నిలవడంతో పాటు ఇరిగేషన్ రంగానికి పునరుత్తేజం పరుస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కోడూరు మండలంలో శుక్రవారం మండలి విస్తృత పర్యటన చేశారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి వి.కొత్తపాలెం, కోడూరు, దింటిమెరక, బసవానిపాలెం, హంసలదీవి, నరసింహపురం, పాలకాయతిప్ప గ్రామాల్లో పర్యటించి పంటకాలువలు, డ్రెయినేజీలను పరిశీలించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలు, నీరు–చెట్టు పథకాల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని పనులను ఎప్పటికప్పుడు చేయించినట్లు బుద్ధప్రసాద్ చెప్పారు. నియోజకవర్గంలో ఇరిగేషన్, డ్రైనేజీ వ్యవస్థలను క్రమబద్ధీకరించి రైతుల సమస్యల పరిష్కారం చేస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన అవుట్ ఫాల్ స్లూయిజ్‌లను రాబోయే కాలంలో నిర్మిస్తామని చెప్పారు. కోడూరు, నాగాయలంక మండలాల్లో పంటకు నోచుకొని చివరి భూములకు కూడా సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు.

కాలువల పనుల పరిశీలన..

ఈస్ట్ కెనాల్ మరమ్మతులకు రూ.38 లక్షలు, నరసింహపురం వద్ద లింగన్నకోడు మీడియం డ్రెయిన్‌పై రూ.43.30 లక్షలతో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఇరిగేషన్ అధికారులు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ రెండు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. యువనేత మండలి వెంకట్రామ్(రాజా), ఇరిగేషన్, డ్రెయినేజీ డీఈలు రావెళ్ల రవికిరణ్, పులిగడ్డ వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన పార్టీ మండలాధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఏఈలు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఓ మహిళను అసభ్యకరంగా దూషించడంతో పాటు దాడి చేసిన వ్యక్తిపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోటలోని విద్యుత్ ఆఫీస్ దగ్గర కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న డొంక ముత్యాలమ్మ గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో స్వీపర్‌గా పని చేస్తుంది. ఈ క్రమంలో రాణిగారితోటలో శాంపిల్ బిల్డింగ్ సమీపంలో నివాసం ఉంటున్న సత్యారెడ్డితో గతంలో ఆమెకు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి అతను తన వద్దకు రావాలని ఆమె వెంటపడుతూ ఫోన్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నాడు. ఆమె పని చేస్తున్న హోటల్ వద్దకు వెళ్లి గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఆమెను రాణిగారితోటలో అడ్డగించాడు. తనను దూరం పెడుతున్నావంటూ అసభ్యకరంగా దూషిస్తూ, చేతిలో ఉన్న బైక్ తాళంతో ఆమెపై దాడి చేశాడు. దీంతో ఆమె నుదిటిపై గాయమైంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



సమాచార శాఖామంత్రి కొలుసు పార్థసారథిని సత్కరిస్తున్న ఆ శాఖ అధికారులు, సిబ్బంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడపలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సమాచార, పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రచార విధి విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వంటి సమాచార, పౌర సంబంధాల శాఖ పనితీరు ఎంతో కీలకమైందన్నారు. మంత్రిని కలిసిన వారిలో సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్‌కుమార్, టి.కస్తూరిబాయి, చీఫ్ ఇంజినీర్ మధుసూదన్‌రావు, ఆర్ఐఈ సీవీ కృష్ణారెడ్డి, డెప్యూటీ డైరెక్టర్లు బి.పూర్ణచంద్రరావు, ఏడీలు జీవీ ప్రసాద్, ఎం.భాస్కర్ నారాయణ, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ప్రచార సహాయకులు వీవీ ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



పద్మావతి(ఫైల్)

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి అగ్రహారంలోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని ఓ ఇంటిలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు అంగన్‌వాడీ సమీపంలోని తన సొంత ఇంటిలో నివాసముంటున్న ఒంటరి మహిళ వేదాంతం వెంకట పద్మావతి(49) గ్రామంలోని ఇళ్లలో పని చేసుకుంటూ జీవిస్తుంది. గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది టీబీ నివారణ ఇంజెక్షన్ చేయటానికి గురువారం సాయంత్రం వెళ్లగా, ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. దీంతో వారు అనుమానంతో కూచిపూడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు తలుపులు పగలగొట్టి చూడగా ఇంట్లో నేలపై దుర్గంధం వెదజల్లుతూ మృతదేహాన్ని గుర్తించారు. ఆమె రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. దీనిపై గురువారం అర్ధరాత్రి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు కూచిపూడి ఎస్ఐ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున వీఆర్వో ఎం.ఖాశిం పంచనామా చేయగా, బందరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

విద్యుదాఘాతంతో వెల్డింగ్ వర్కర్ దుర్మరణం



జితేంద్ర మృతదేహం

కోనేరుసెంటర్: విద్యుదాఘాతంతో వెల్డింగ్ వర్కర్ మృతి చెందిన సంఘటన మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకూరుకు చెందిన బల్లా జితేంద్ర(23) కొన్ని రోజులుగా మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పని చేసేందుకు వచ్చాడు. కాంట్రాక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జితేంద్ర రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై రేకులకు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు హైటెన్షన్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో జితేంద్ర శరీరం కాలిపోవటంతో అక్కడికక్కడే కూలిపోయాడు. ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసిన రైల్వే అధికారులు చికిత్స నిమిత్తం బాధితుడిని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జితేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు కాంట్రాక్టర్ ద్వారా మృతుని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని రైల్వే పోలీసులు తెలిపారు.

యజమానిని మోసం చేసిన డ్రైవర్‌కు జైలు

విజయవాడస్పోర్ట్స్: ఓ రిటైర్డ్ ఉద్యోగి వద్ద ఎంతో నమ్మకంగా మెలుగుతూ అతని ఫోన్ పే ఖాతాను దుర్వినియోగం చేసి రూ.50 వేలు కాజేసిన అతని డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సి.హెచ్.రమణారెడ్డి శుక్రవారం తీర్పునిచ్చారు. అజిత్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వద్ద మొగల్రాజపురానికి చెందిన పరసా రవీంద్ర డ్రైవర్‌గా పని చేసేవాడు. ఎంతో నమ్మకంగా ఉంటున్న డ్రైవర్‌కు సదరు యజమాని అత్యవసర సమయంలో వినియోగించమని ఫోన్ పే లావాదేవీల వివరాలు, కోడ్‌ను చెప్పాడు. కొద్ది రోజుల తరువాత దుర్బుద్ధితో డ్రైవర్ ఆ ఖాతాలోని రూ.50 వేల నగదును యజమానికి తెలియకుండా వేరే ఖాతాలకు మళ్లించాడు. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న సదరు ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. బాధితుడు తరుపున ఏపీపీ కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్షతో రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కుటుంబ తగాదాలతో కత్తితో దాడి

పెనమలూరు: అన్నదమ్ముల మధ్య కుటుంబ తగాదాల కారణంగా కత్తితో దాడి చేసిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గోసాల సాయిబాబా కాలువ కట్టకు చెందిన షేక్.జిలాని, రహమతుల్లా, షౌకత్ ఆలీ అన్నదమ్ములు. కాగా రహమతుల్లాతో షౌకత్ ఆలీకి కుటుంబ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మద్యం సేవించిన రహమతుల్లా షౌకత్ ఆలీతో గొడవకు దిగాడు. జిలానీ అతడిని నివారించే యత్నం చేశాడు. ఈ లోగా రహమతుల్లా కత్తితో షౌకత్ ఆలీ, అడ్డు వచ్చిన జిలానిలపై దాడి చేశాడు. బాధితులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్, వీరవల్లి, నందిగామ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మూడు వేర్వేరు ఘటనల్లో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం మృతి చెందారు. స్థానిక విజయవాడ రోడ్డులో నాలుగు రోజుల క్రితం సుమారు 60–70 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించటంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరో ఘటనలో బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలో పారిశ్రామికవాడకు వెళ్లే మార్గంలో నిర్మాణంలో ఉన్న ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందటాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు ఎరుపు రంగు చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించాడని, సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగి ఉండవచ్చని పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

నందిగామ: రోడ్డు పక్కనే ఉన్న ఓ నీటి గుంటలో శుక్రవారం వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. ఎస్ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం రామన్నపేట వెళ్లే రహదారిలో నందిగామ మండలం అడవిరావులపాడు సమీపంలో రోడ్డు పక్కనే గల ఓ క్వారీ గుంటలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి, అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. వృద్ధుడి వయసు 70ఏళ్లు ఉంటాయని, మృతుని ఒంటిపై తెల్ల బట్టలు ఉన్నాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



నిడమానూరులో సచివాలయ ఉద్యోగులతో ట్రైనీ కలెక్టర్ శుభం నోక్వాల్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ట్రైనీ కలెక్టర్ శుభం నోక్వాల్ ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా సందర్శించారు. గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని తొలుత సందర్శించి పలు రకాల వైద్య సేవలు పరిశీలించారు. ఈ ఉప కేంద్రంలో ఏ విధమైన వైద్య సేవలు అందిస్తున్నారు, ఉచితంగా అందించే మందుల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, సచివాలయం సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలు, పథకాలు పొందుటకు అవసరమైన అర్హతలు, పథకాల ప్రయోజనాలను ఆరా తీశారు. ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి నిర్దేశించిన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ పీవీఎన్ కృష్ణకు రాజుబాబు స్మారక పురస్కారం



సినీ దర్శకుడు బి.గోపాల్ నుంచి పురస్కారాలు అందుకున్న పీవీఎస్ కృష్ణ, గుమ్మడి గోపాలకృష్ణ

విజయవాడ కల్చరల్: విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత డాక్టర్ పీవీఎస్ కృష్ణకు సినీ, రంగస్థల నటుడు రాజుబాబు స్మారక పురస్కారం లభించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడకు చెందిన రాజుబాబు 67వ జయంతి సందర్భంగా రాజుబాబు స్మారక కమిటీ హైదరాబాద్ ఫిలింనగర్ ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సినీ దర్శకుడు బి.గోపాల్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. డాక్టర్ పీవీఎస్ కృష్ణ పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తూ నాటక రంగం మీద అభిమానంతో నాటక రంగ ప్రవేశం చేశారు. సాయిబాబా నాట్యమండలి, డాక్టర్ రామన్ ఫౌండేషన్ స్థాపించి 100 మందికి పైగా యువతీయువకులను నటనలో శిక్షణ నిచ్చారు. జాతీయ స్థాయిలో జరిగిన పద్యనాటక పోటీల్లో అనేక బహుమతులను గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో 8 బంగారు నందులను గెలుచుకున్నారు. సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వందలాది కార్యక్రమాలను నిర్వహించారు. పీవీఎస్ కృష్ణ రాజుబాబు స్మారక పురస్కారం అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని నగరానికి చెందిన నాటక సంస్థలు ఆయనను అభినందించాయి.

వాస్తవ సంఘటనలకు అద్దం పట్టిన నాటికలు



అనూహ్యం నాటికలోని ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: హర్ష క్రియేషన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ షష్టిమ సాంఘిక నాటికల పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీ నాటికలు సమాజంలో నేడు జరుగుతున్న వాస్తవ ఘటనలకు అద్దం పట్టాయి. తొలి నాటికగా నటీనట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారు ప్రదర్శించిన అనూహ్యం నాటిక సమాజంలో ఆర్థిక బంధాల కన్నా మానవీయ విలువలు ప్రధానం అనే సందేశంతో నాటకం సాగుతుంది. రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, రెండవ నాటికగా చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించిన విముక్తి, చివరిగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారు ప్రదర్శించిన స్వప్నం రాల్చిన అమృతం నాటికలను ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దృశ్యవేదిక అధ్యక్షుడు హెచ్‌వీ ఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. నూతన పరిషత్‌లు రావాలని కొత్త నాటికలను రచయితలు తయారు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో, వివిధ శాఖలకు చెందిన బోడి ఆంజనేయరాజు దొంతాల ప్రకాష్, నందివాడ నాని, సుఖమంచి కోటేశ్వరరావు, కాకు మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు కళాకారులను, పోటీ న్యాయనిర్ణేతలను ఆత్మీయంగా సత్కరించారు.

క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేయాలని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక 8వ డివిజన్ సున్నపుబట్టీల సెంటర్ దగ్గర ఉన్న అశోక్‌నగర్‌లోని పార్టీ డివిజన్ కార్యాలయంలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సయ్యద్ ఇమ్రాన్‌కు రూ.15 వేల నగదును ఆర్థిక సహాయంగా జయప్రకాష్ శుక్రవారం అందచేశారు. విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలమని, అందువల్ల ఆర్థికంగా వెనుకబడిన పిల్లల చదువునకు తమ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం చేస్తున్నానని చెప్పారు. గోగం బాలకోటయ్య, కనగాల రాజశేఖర్, తుమ్మల శివరామకృష్ణ, పిన్నమనేని సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా నేత్ర వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ (ఏపీటీడీసీ) పక్షాన భవానీపురంలోని భవానీ ద్వీపంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత అధునాతన మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అయాన్ ఐ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ బీఆర్‌పీ రోడ్‌లోని అయాన్ ఐ హాస్పటల్ చీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్ నేతృత్వంలో అనుభవజ్ఞులైన కంటి చూపు పరీక్ష నిపుణులు (ఆప్టోమెట్రిస్ట్స్), సాంకేతిక సహాయకులు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కంటికి సంబంధించిన అన్ని సమస్యలను (దృష్టి దోషాలు) అధునాతన వైద్య యంత్ర పరికరాల ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి మందులు, డ్రాప్స్ అందచేస్తారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు, కళ్ల జోళ్లు అవసరమైన రోగులకు అయాన్ ఐ హాస్పటల్‌లో విశేష రాయితీలు ఇస్తారని చెప్పారు. పర్యాటక శాఖకు చెందిన ఏపీటీడీసీ, బీఐటీసీ (భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్) ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు, భవానీ ద్వీపం సందర్శనార్థం వచ్చే పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో శుక్రవారం రైల్వే హాస్పటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉంటే ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలకు కాపాడవచ్చన్నారు. చాలమందిలో రక్తదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. ఒక వ్యక్తి రక్తదానం చేస్తే తిరిగి అతని శరీరంలో కొత్త రక్త కణాలు ఉత్పత్తి అవుతాయని చెప్పారు. రక్తదానం విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాజానికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 86 మంది హాస్పటల్ సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడుతో స్కూళ్లకు మహర్దశ

- బీఎస్ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్ విశేషంగా అభివృద్ధి
- ఏళ్ల నాటి తరగది గదుల సమస్యకు పరిష్కారం చూపిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రూ.రెండున్నర కోట్లతో నాడు-నేడు పనులు
- అదనంగా 14 తరగతి గదులు నిర్మాణం



జమ్మి చెట్టు సెంటర్‌లోని బీఎస్ఆర్‌కే హైస్కూల్



పూర్తి అయిన తరగతి గదులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న బోయపాటి శివ రామకృష్ణయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఉన్న సమస్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం నిధులతో చెక్ పెట్టింది. రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో ఈ స్కూల్లో పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులన్నీ చివరి దశలో ఉన్నాయి.

ఈ పాఠశాలలో ఎలిమెంటరీ, హైస్కూల్ కలిపి విద్యార్థులు మొత్తం 900 మందికి పైగానే ప్రతి విద్యాసంవత్సరం విద్యాభ్యాసం చేస్తుంటారు. ఇప్పటి వరకు 25 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో ఒకే తరగతి గదిలో రెండు లేదా మూడు సెక్షన్ల విద్యార్థులను కలిపి కూర్చో పెడుతున్నారు. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు పథకం రెండో విడతలో ఈ స్కూల్‌లో పనులు చేపట్టారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఉపాధ్యాయుడు చెప్పే పాఠం విద్యార్థులందరికీ వినిపించేదికాదు. ఉపాధ్యాయులు విద్యార్థులపై పర్యవేక్షణ కూడా సాధ్యం అయ్యేది కాదు. నాడు-నేడులో భాగంగా ఈ పాఠశాలకు 14 తరగతి గదులు మంజూరయ్యాయి. ప్రస్తుతం తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి.



తరగతి గదిలో డిజిటల్ బోర్డు, రంగుల బెంచీలు



పాఠశాల ఆవరణలో సిద్ధమైన ఆర్వో ప్లాంట్

- తరగతి గదితో పాటుగా విద్యార్థులకు కూర్చోడానికి రంగు రంగుల బెంచీలు సిద్ధమయ్యాయి. ప్రతి తరగతి గదిలో గ్రీన్ బోర్డులు, లైట్లు, ఫ్యాన్లు అమర్చారు.
- విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా వంట చేయడానికి ప్రత్యేకంగా గదిని కూడా నిర్మాణం చేశారు. గతంలో పాఠశాల ఆవరణలోనే చెట్టు కింద వంట చేసేవారు.
- పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పాటుగా ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల పక్కన ఉన్న ప్రైవేటు భవనాల నుంచి పాఠశాల ఆవరణలోని రాత్రి వేళ యువకులు రాకుండా నియంత్రించ గలిగారు.
- విద్యార్థుల కోసం పూర్తి సౌకర్యాలతో మరుగుదొడ్లను నిర్మాణం పూర్తి చేశారు.
- మంచినీటి సౌకర్యం కోసం ప్రత్యేకంగా ఆర్.వో. ప్లాంట్ నిర్మాణం చేశారు.
- పాఠశాల భవనంలోని తరగతి గదులకు టైల్స్ అమర్చారు.
- పాత తరగతి గదులకు ధ్వంసమైన కిటికీలను తొలగించి కొత్తవి అమర్చారు.
- నాడు-నేడు పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో కిటీకీలకు డోర్లు, కొన్ని తరగతి గదుల్లో గ్రీన్ బోర్డులు, వాటర్ ట్యాంక్ నిర్మాణం, పెయింటింగ్ పనులు పూర్తి చేయాల్సిఉంది.

తరగతి గదుల సమస్య తీరింది



నాడు నేడు పథకం ద్వారా రెండున్నర కోట్ల రూపాయాలతో చేపట్టిన పనుల వల్ల ఎప్పటి నుంచో పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యాయి. తరగతి గదుల సమస్య పరిష్కారంతో పాటుగా మరుగుదొడ్ల సమస్యల తీరింది. ఆర్.వో.ప్లాంట్ కూడా అమర్చాం. పనులు చివరి దశలో ఉన్నాయి.

–కె.నాగరాజు,
బీఎస్ఆర్‌కే హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు

పార్కును అభివృద్ధి చేయండి

పటమట(విజయవాడతూర్పు):పటమట 10వ డివిజన్‌లోని అక్కినేని పూర్ణచంద్రరావు పార్కును అభివృద్ధి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మారుతి కోఆపరేటివ్ ఎంప్లాయీస్ కాలనీ పార్కును సందర్శించి అధికారులను పలు సూచనలు చేశారు. పార్క్ లో వాకింగ్‌కు అనుకూలంగా ట్రాక్ ఏర్పాట్లు చేయాలని, ప్రజలందరికీ ఆరోగ్యానికి తోడ్పడేందుకు ఓపెన్ జిమ్, చిన్నారులకు ప్లే పరికరాల ఏర్పాటు, ఆరోగ్యమైన గ్రీనరీ పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పార్క్ వెనుక భాగంలోని మెడిటేషన్ హాలును వీఎంసీ అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన పంట కాలవ రోడ్డు పక్కన గల పార్క్ లో కూడా ప్లే ఐటమ్స్, అందమైన పెయింటింగ్స్ వేసి అభివృద్ధి పరచాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన పంట కాలవ నుంచి వెళ్లే హైటెన్షన్ లైన్ (హెచ్‌టి) లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండటానికి బీటీ రోడ్డు వేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర రావు, లక్ష్మీ నారాయణ, నాగేశ్వరరావు, తిలక్, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కృష్ణలంక(విజయవాడతూర్పు):విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సొంతం చేసుకోవడం సాధ్యమవుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. యువతలో స్కిల్స్ పెంచి వారికి బంగారు భవిష్యత్తును కల్పిస్తామన్నారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని ఎస్.వి.రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామమోహన్ మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే చంద్రబాబు విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పించారని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని సమర్థవంతంగా అమలు చేశారన్నారు. పిల్లల చదువు పూర్తి అయిన వెంటనే వారిలో నైపుణ్యాలను పెంచి మంచి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించే విధంగా టీడీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి సంవత్సరం ఐదు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మెగా డీఎస్సీ ద్వారా యువతకు ఉద్యోగాలు లభించడమే కాకుండా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కూడా చాలా వరకు తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో విజయ రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు,మాజీ కార్పొరేటర్ చందన సురేష్, టీడీపీ నాయకులు వి.అన్నారావు, గొరిపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామమోహన్

ఆదర్శ కార్మికోద్యమనేత 'పర్స'

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమర యోధుడు, రాష్ట్ర కార్మికోద్యమ నేత, సీఐటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పర్స సత్యనారాయణ ఆదర్శ నేత అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కొనియాడారు. ఆయన స్ఫూర్తిగా కార్మికోద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌పేట ఎంబీ జ్ఞాన కేంద్రంలో శుక్రవారం పర్స సత్యనారాయణ శతజయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవులు.... పర్స చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు కేంద్రంలోని బీజేపీకి ఎన్నికల్లో ఫలితాలు వచ్చాయని చెప్పారు. దీనికి కారణం మోదీ ప్రజా వ్యతిరేక విధానాలేనన్నారు. గత విధానాలు బీజేపీ కొనసాగిస్తే పోరాటాలతో ప్రతిఘటిస్తామని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం ఆ సంస్థను నేటికీ ప్రభుత్వ రంగంలో ఉంచిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రత్యేక హోదా, విభజన హామీలు, ప్రజ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పర్స విశాఖ ఉక్కు కోసం శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి ప్రజల పక్షాన నిలబడిన ప్రజా ప్రతినిధి అని, అటువంటి ఆదర్శ పాలన కావాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, మంతెన సీతారాం, ఉమామహేశ్వర రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం తునికి చెందిన దర్పణ నాట్య అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నాట్య అకాడమికి చెందిన సి.వరలక్ష్మీదేవి శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు.

రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే గద్దె రామమోహన్

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలు కోసం ఐదు సంక్షేమ పథకాలపై సంతకాలు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఐదు సంక్షేమ పథకాల అమలు చేసేందుకు సంబంధించిన పైళ్లపై సంతకాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బొప్పన భవకుమార్, పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, శాయన బుజ్జి, కొలసాని నాగమణి, మాదాల చినతల్లి, అన్నాబత్తుల శ్రీదేవి, కోనేరు రాజేష్, పెనుగొండ శ్రీను, రామయణపు కోటి, భాగం సాయి ప్రసాద్, యలమంచిలి దేవేంద్ర, కర్ణ కోటేశ్వరరావు, మల్లెల లక్ష్మీనారాయణ, రాయవరపు అశోక్, కర్రి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ సూర్యనారాయణపై చర్యలు తీసుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా పని చేస్తూ, ఆ సంఘ నేతగా చెలమణి అవుతున్న కేఆర్ సూర్యనారాయణపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ విజయవాడ సిటీ మూడో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఆర్ఎస్ గణేష్, ఎ.రవి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం మారినప్పుడల్లా సూర్యనారాయణ ఆ ప్రభుత్వం తన వల్లే వచ్చిందంటూ పాలకులతో ఫొటోలు దిగి అధికారులను బెదిరింపులకు దిగే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయాల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన అభియోగంపై శాఖాపరమైన నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం సూర్యనారాయణపై సస్పెన్షన్ వేటు వేసిందన్నారు. అలాగే అతనికి సహకరించిన ఉద్యోగులను కూడా సస్పెండ్ చేసిందని, వారంతా జైలుపాలయ్యారని పేర్కొన్నారు. అయితే సూర్యనారాయణ మాత్రం అజ్ఞాతంలోకి వెళ్లి అరెస్ట్ కాకుండా స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. సూర్యనారాయణ సంఘానికి ఆన్ డ్యూటీ (ఓడీ) సౌకర్యం లేకపోయినా ఇతర సంఘాలకు ఉన్న సౌకర్యాలను చట్టవిరుద్ధంగా పొందాడని తెలిపారు. 2023లో సూర్యనారాయణ సంఘ సభ్యుల అక్రమాలపై నగరంలోని వర్తకులు తమను వేదిస్తున్న విధానాలపై ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. సూర్యనారాయణపై ఉన్న కేసులను పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, సంఘం గుర్తింపును రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆ ప్రకటనలో వన్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కె.రాములు, నరేంద్ర, టు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీధర్, ఎం.విజయకాంత్ సంతకాలు చేశారు.

స్టామ్ వాటర్ డ్రైనేజీ బ్లాక్ చేస్తే జరిమానా

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన స్టామ్‌వాటర్ డ్రైనేజీని బ్లాక్ చేస్తే జరిమానా విధించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద రోడ్డుపై డ్రైనేజీ నీళ్లు నిలవటంపై అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైన్‌లలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ (ఇంటర్నెట్ కేబుల్స్), ప్లాస్టిక్ బాటిల్స్, బస్తాలు, పెట్ బాటిల్స్, వస్త్రాలు, చెప్పులు, ఇతర వ్యర్థాలను ఉండటం గమనించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డ్రెయిన్లలో వర్షం నీరు పారకుండా నీటికి అడ్డుపడుతున్న కేబుళ్లను వెంటనే తొలగించాలని, ఫైబర్ కేబుల్స్ వల్ల జరుగుతున్న నష్టాన్ని భర్తీచేసేలా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్న సంస్థలకు భారీ జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన శానిటరీ సెక్రెటరీని సస్పెండ్ చేయమని, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఈలకు షోకాజ్ జారీ చేయాలని హెచ్‌వోడీలకు సూచించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందిని నగరంలో సైడ్ డ్రెయిన్‌లను పరిశీలించి, అందులో కేబుల్స్ ఉంటే వెంటనే తీసేయాలని చెప్పారు. నగరంలో ఉన్న డ్రెయిన్‌లన్నింటిలో డీసిల్టింగ్ ఈ నెలాఖరులోపు చేయాలని అధికారులకు ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో అన్ని డివిజన్లలో 51 పనులను రూ.2.93.కోట్ల వ్యయంతో చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ క్రమంలోనే వర్షపు నీరు ఎక్కడ రోడ్డుమీద నిలవకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్టామ్ వాటర్ డ్రైన్స్ లో వ్యర్థాలు పడేస్తున్న హోటళ్లు, రెస్టారెంట్ల పై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తు పొందాలని 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి అన్నారు. స్థానిక మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ (బీఎస్ఆర్‌కే) హైస్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందచేసే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు, బీఎస్ఆర్‌కే హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.నాగరాజు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. యార్లగడ్డ సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలను తమ సంఘం (అమ్మ) దత్తత తీసుకున్న తర్వాత అవసరమైన సౌకర్యాలను కల్పించామని చెప్పారు. ప్రభుత్వం, తమ సంఘం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని చెప్పారు. 'అమ్మ' సభ్యులతో పాటుగా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

ట్రక్కర్స్ ప్రాజెక్టుకు రక్తదాన అవార్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు):అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నందుకు గాను బెస్ట్ రక్తదాన అవార్డును అందచేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ జూపూడి ఉషారాణి చేతుల మీదగా ట్రక్కర్స్ ప్రాజెక్టు మేనేజర్ వివి సాంబశివరావు అవార్డును అందుకున్నారు. ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు. అలా అత్యధిక రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డు లభించింది. అంతేకాక గతంలో రెండు సార్లు ఏపీశాక్స్ నుంచి ట్రక్కర్స్ ప్రాజెక్టుకు జిల్లా కలెక్టర్ అవార్డులు అందచేసినట్లు సాంబశివరావు తెలిపారు.



డాక్టర్ ఉషారాణి చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న సాంబశివరావు

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు ముగిసిప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో కెఎస్.రామరావు ఘాట్‌రోడ్డులోని దేవస్థాన బస్సుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన ఈవో భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మరో వైపున మహా నివేదన నిమిత్తం మధ్యాహ్నం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్జిత సేవలకు రద్దీ

అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు ఇతర ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అమ్మవారిని శుక్రవారం పలువురు మంత్రులు దర్శించుకున్నారు.

మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, ఎస్. సవితలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

బస్సుల్లో ఈవో తనిఖీలు...

దేవస్థానం నడిపే బస్సుల్లో ఆలయ ఈవో కెఎస్. రామరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తొలుత ఓం టర్నింగ్‌లోని దేవస్థానం బస్సులు నిలిపే పాయింట్‌కు చేరుకున్న ఈవో బస్సులు ఏయే సమయాలకు వస్తున్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్సులో ప్రయాణించి దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. బస్సులో ప్రయాణించే సమయంలో ఆలయంలో అమ్మవారి దర్శనంలో ఏమైనా ఇబ్బందులు న్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయంలోని ఇంజినీరింగ్, ఇతర విభాగాలలో అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించినట్లు ఈవో రామరావు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):మొగల్రాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రజాశక్తి నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ్ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పిన్నమనేని వారివీధి, మధు గార్డెన్స్ ఏరియా, ప్రజాశక్తి నగర్, అంజమ్మ వీధి, రత్నమాంబ వీధి, నైస్‌బార్ ఏరియా, కస్తూరిబాయ్‌పేట, గాంధీబొమ్మల సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

- కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా రాణిగారితోట సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ కృష్ణలంక ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రాణిగారితోటలో ఫిలిప్స్ రోడ్డు, బాలస్వామి వీధి, కృష్ణలంకలోని నెహ్రూనగర్, గౌతమీనగర్ 1,2,3 లైన్లు, ద్వారకానగర్ 1,2,3 లైన్లు, నల్లగేటు డౌన్, శంకరమఠం ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.





ఆరోగ్యమే ఆనందం

అందమే ఆనందం... ఆనందమే జీవిత మకరందం అని ఒక సినిమా పాట ఉంది. అదెంత నిజమో ఆరోగ్యమే ఆనందం అనడం కూడా అంతే నిజం. ఇంకా చెప్పాలంటే అందంగా ఉండేవాళ్లు ఆరోగ్యంగా ఉంటారో లేదో చెప్పలేం కానీ, ఆరోగ్యంగా ఉండేవాళ్లు మాత్రం ఆటోమాటిగ్గానే అందంగా కనిపిస్తారు. అందం మన శరీర ఆకృతి మీద ఆధారపడితే, ఆకృతి అనేది శరీర పోషణ మీద, ఆహారపు అలవాట్లమీద, జీవన శైలి మీదా ఆధారపడి ఉంటుంది. శరీర పోషణ మీద తగిన శ్రద్ధ చూపిస్తూ, క్రమబద్ధంగా వ్యాయామాలు చేస్తూ ఉంటే ఎప్పుడూ అందంగా ఆరోగ్యంగా యవ్వనంగా కనిపిస్తారు. అదెలాగో చూద్దాం.





ఆహారం విషయంలో... శరీరాకృతి విషయంలో క్రమశిక్షణను పాటిస్తే దీర్ఘకాలం పాటు ఎవరికి వాళ్లు మేలు చేసుకున్న వాళ్ళవుతారు. ముందు నుంచి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటే వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఉండగలుగుతారు. జబ్బులేమీ జోలికి రావు. మీరు ఏమి తింటున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్నదాని మీద మీరు ఎలా కనిపిస్తున్నారు, ఎలా ఫీలవుతున్నారనేది ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యంగా వుంటే ఆనందకరమైన జీవితాన్ని గడపగలుగుతారు.

మీ శరీరపు బ్యాటరీని రీఛార్జ్ చేయటానికి, మీ కండరాలలో శక్తిని పెంపొందించటానికి, జబ్బుల్నుంచి దూరంగా ఉండటానికి పెద్దగా కష్టపడిపోవాల్సిన పనేం లేదు. కొద్దిపాటి ఆరోగ్య సూత్రాల్ని పాటిస్తే చాలు. అవేంటో చూద్దామా?

తీసుకునే ఆహారంలో కొన్ని సర్దుబాట్లు చేసుకోవటం, ఎక్సర్‌సైజుల్ని చేయటానికి సమయాన్ని కేటాయించటం, జీవితపు వొత్తిడిల నుంచి రిలాక్స్ కావటానికి ప్రయత్నించటం వంటివి చాలు.



ఆరోగ్యంగా తినాలి

మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి కొవ్వు కూడా అవసరమే. అయితే మనలో చాలామంది శరీరానికి అవసరమైన దాని కంటే 30 శాతం కొవ్వును అధికంగా కలిగి ఉంటున్నారని ఒక అంచనా. అలాంటి హెచ్చు తగ్గుల్ని నివారించటం కోసం ఆహారంలో సమతుల్యాన్ని పాటించటం చాలా అవసరం. ఇందుకోసం...

- రోజూ మీరు తీసుకునే కాయగూరల్లో, ఆకుకూరల్లో వైవిధ్యాన్ని పాటించాలి. కాఫీ, టీ వంటి వాటి విషయంలో మితాన్ని పాటించడం.
- తాగ గలిగినన్ని మంచినీళ్ళను తాగాలి.
- రోజుకు 900 కాలరీల లోపు గల ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.

ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యత

శరీరం తగినంత ఫిట్‌నెస్‌లో ఉంటే అనారోగ్యం తొందరగా దరిచేరదు. బాడీ ఆలా ఫిట్‌నెస్‌తో ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలి. ఎక్సర్‌సైజుల మూలంగా గుండె కండరాలు బలపడతాయి. శరీరంలో రక్తసరఫరా సాఫీగా జరుగుతుంది. రక్తంలో కొలెస్టరాల్ తగ్గుతుంది. శరీరం బరువు ఉండాల్సిన రీతిలో ఉంటుంది. ఇవన్నీ టెన్షన్ తగ్గించే అంశాలు. ఎక్సర్‌సైజులంటే – నడక, సైకిలింగ్, ఈత మొదలైనవి ఏవైనా సరే. దీనిని మాత్రం ప్రోగ్రామును నిదానంగా ప్రారంభించాలి. క్రమక్రమంగా పెంచుకుంటూ పోవాలి. అంతే తప్ప తొందరపడి ప్రారంభంలోనే అతిగా చేయకూడదు.



- **పోషకవిలువలు**

శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే 13 ముఖ్య విటమిన్లు, 25 ఖనిజ లవణాలు మనం తీసుకునే ఆహారంలో తగు పరిమాణంలోలభించాలి కాబట్టి సమీకృత ఆహారాన్ని తీసుకోవాలి.

- **ధూమపానం, మద్యపానాలకు స్వస్తి:** పొగ తాగేవాళ్ళకు, మద్యం సేవించే వాళ్లకు గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు రావటానికి రెట్టింపు అవకాశాలున్నాయి కాబట్టి ఈ రెండు అలవాట్లూ ఉన్న వాళ్లు వాటిని మానుకోవటం మంచిది. ప్రారంభంలో కొంచెం కష్టం కావచ్చు గాని గట్టిగా సంకల్పించుకుంటే అసంభవం మాత్రం కాదు కదా...
- **మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి**

రోజుకి అరగంట కాలాన్ని మనస్సు ప్రశాంతపరచుకోవటానికి కేటాయించాలి. మంచి పుస్తకాన్ని చదవటం, ధ్యానం, సంగీతం వినడం వంటి వాటి ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. గతంలో జరిగిన తప్పులు, పొరపాట్లు, అపజయాల గురించి ఆలోచించకుండా భవిష్యత్తుపట్ల ఆశావహ దృక్పథంతో వర్తమానంలో జీవించాలి.

- **శరీరం చెప్పేది వినాలి**

ఆఖరుగా ఆరోగ్యంగా ఉండాలంటే శరీరం చెప్పే దానిని వినాలి. శరీరం ఏ ఇబ్బందికి గురవుతున్నా – అంటే అస్వస్థతలకు గురవుతున్నా మనకు కొన్ని సూచనలను అందిస్తుంది. జ్వరం, నొప్పి, దగ్గు, వాంతులు, విరోచనాలు, ఇలాంటి లక్షణాల ద్వారా శరీరంఅనారోగ్య సూచనలను వెలువరిస్తు ఉంటుంది. అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించి, వారి సూచనల మేరకు శరీరాన్ని కండిషన్‌లోకి తెచ్చుకోవడం ఎవరికి వారు అనుసరించి తీరాల్సిన కర్తవ్యం.

పెరుగుతో వీటిని కలిపి తినకండి

నవపాకాలతో అన్నం వడ్డించినా, చివరలో పెరుగన్నం తినకుండా ఆ భోజనం పరిపూర్ణం అనిపించుకోదు. ఎందుకంటే పెరుగు తినడం ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో అందరికీ తెలుసు. ముఖ్యంగా పెరుగు పొట్టకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రొటీన్, కాల్షియం, ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉండటం వల్ల పెరుగు వినియోగం ఆరోగ్యానికి చాలా మంచిది. కొందరు చాలా పదార్థాలను పెరుగుతో కలిపి తింటూ ఉంటారు. అయితే, పెరుగుతో కలిపి తినకూడని కొన్ని పదార్థాలు ఉన్నాయి. అవి తినడం ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. పెరుగుతో ఎలాంటి ఆహారపదార్థాలు తినకూడదో... ఎందుకు తినకూడదో తెలుసుకుందాం.



పెరుగు, చేపల మిశ్రమం ఆరోగ్యానికి హానికరం. ఆయుర్వేదం ప్రకారం, చేప, పెరుగు వ్యతిరేక ప్రభావాన్ని కలిగి ఉంటాయి. వీటి కలయికతో చేసిన ఆహారాన్ని తీసుకోవడం శరీరంలో అసమతుల్యతను కలిగిస్తుంది. ఇది అలెర్జీలు, దద్దుర్లు, ఇతర సమస్యల వంటి చర్మ సమస్యలను కలిగిస్తుంది.

సిట్రస్ పండ్లు... పెరుగు: ఇప్పటికే కాస్త పుల్లగా ఉండి, నారింజ, నిమ్మ, ద్రాక్ష తదితర పుల్లని పండ్లతో కలిపి పెరుగు తింటే కడుపులో ఎసిడిటీ పెరుగుతుంది. ఇది జీర్ణ సమస్యలు, అసిడిటీ, కడుపు నొప్పిని కలిగిస్తుంది. పెరుగు, ఉడికించిన గుడ్డు కలిపి తీసుకోవడం మంచిది కాదు. ఈ రెండూ ప్రొటీన్‌కు మంచి మూలాధారాలు. అయితే వీటిని కలిపి తింటే జీర్ణవ్యవస్థపై ఒత్తిడి తెచ్చి, పొత్తికడుపులో భారాన్ని, గ్యాస్‌ను కలిగిస్తుంది.

ఉల్లిపాయ, పెరుగు: వీటి కలయిక జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తుంది. కడుపులో చికాకు, గ్యాస్, ఇతర సమస్యలను కలిగిస్తుంది. **రాత్రిపూట పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిది కాదు.** ఆయుర్వేదం ప్రకారం, రాత్రిపూట పెరుగు తినడం వల్ల కఫ దోషం పెరుగుతుంది. ఇది జలుబు, దగ్గు, కఫం వంటి సమస్యలకు దారితీస్తుంది.

పెరుగు, మామిడికాయల కలయిక రుచికరంగా ఉంటుంది. కానీ ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. మామిడి, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో విషపదార్థాలు ఏర్పడతాయి. ఇది జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలకు దారితీస్తుంది.

జుట్టు రాలడం... బరువు తగ్గడం జింక్ లోపం కావచ్చు!

మన శరీరానికి జింక్ చాలా అవసరం. మనం తినే ఆహారంలో చాలా పరిమిత పరిమాణంలో మాత్రమే జింక్ లభిస్తుంది. శరీరం జింక్‌ను నిల్వ చేసుకోదు. అందుకే జింక్ లభించే ఆహారాన్ని రోజూ తినాలి. జింక్ లోపిస్తే శరీరంలో చాలా మార్పులు జరుగుతాయి. రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. జింక్ లోపాన్ని కొన్ని లక్షణాల ద్వారా తెలుసుకోవచ్చు.

గాయాలు నయం కాకపోవడం: చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు, గాయాలైనప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేసేందుకు జింక్ చాలా అవసరం. జింక్ లోపం ఏర్పడినప్పుడు గాయాలు తగిలినా అవి త్వరగా నయం కావు. అంతేకాదు ముఖంపై మొటిమలు వస్తాయి.

బరువు తగ్గడం: జింక్ లోపం వల్ల జీర్ణశక్తిలో మార్పులు వస్తాయి. ఆకలి మందగిస్తుంది. ఆహారం తినాలనిపించదు. ఫలితంగా బరువు తగ్గిపోతారు. ఇలా పోషకాల లోపం వల్ల బరువు తగ్గడంతోపాటు అనేకమైన ఇతర ఆరోగ్యసమస్యలూ ఉత్పన్నమవుతాయి.

జుట్టు రాలడం: జింక్ లోపం వల్ల జుట్టు చిట్లడం, రాలడం అధికమవుతుంది కాబట్టి అకారణంగా జుట్టు రాలుతున్నా, జుట్టు పలుచబడుతున్నా జింక్ లోపమేమో అనుమానించాలి. దానికి సంబంధించిన సప్లిమెంట్స్ తీసుకుని సమస్య సద్దుమణిగితే నిశ్చింతగా ఉండవచ్చు.

తరచూ జలుబు: జింక్ తగ్గితే రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. దానివల్ల తరచూ జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఎక్కువ. తరచూ మీకు జలుబు చేస్తున్నా, అనారోగ్యం బారిన పడుతున్నా జింక్ లోపం ఉందేమో చూసుకోవాలి. జింక్ తగినంత అందితే జలుబు త్వరగా తగ్గుతుంది.

అకారణంగా జుట్టు రాలుతున్నా, బరువు తగ్గుతున్నా, గాయాలు త్వరగా నయం కాకపోతున్నా జింక్ లోపంగా అనుమానించాలి. ఇదే కాదు, శరీరంలో జింక్ లోపం ఉన్నప్పుడు ఇంకా ఎలాంటి లక్షణాలు ఉంటాయో, నివారణకు ఏం చేయాలో తెలుసుకుందాం.



చూపు మసక బారడం: ఆరోగ్యకరమైన చూపుకు జింక్ చాలా అవసరం. శరీరానికి తగినంత జింక్ అందనప్పుడు దృష్టి మందగిస్తుంది. చూపు మసకగా కనిపిస్తుంది. అస్పష్టంగా అనిపిస్తుంది. జింక్, విటమిన్ ఎ ఆరోగ్యకరమైన చూపును ఇస్తాయి.

అయోమయం: మీకు మనసు, ఆలోచనలు గందరగోళంగా ఉన్నాయా? అయితే జింక్ లోపం ఉందేమో చూసుకోండి. జింక్ తగినంత అందకపోతే మెదడు సరిగా పనిచేయదు. పనిపై ఏకాగ్రత్ కుదరదు. జ్ఞాపకశక్తి సమస్యలకు కూడా తలెత్తుతాయి.

సంతానోత్పత్తిపై ప్రభావం: జింక్ లోపం పురుషులకు చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. దీని వల్ల పురుషుల సంతానోత్పత్తి ప్రభావితమవుతుంది. మీరు తండ్రి కావాలనుకుంటే తప్పనిసరిగా జింక్ తీసుకోవడంపై శ్రద్ధ వహించాలి. తగినంత పరిమాణంలో జింక్ తీసుకోని పురుషులు తండ్రి కావడానికి చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

రోగనిరోధక శక్తి బలహీనం: శరీరానికి సంబంధించి అనేక విధులకు జింక్ అవసరమవుతుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. మళ్లీ మళ్లీ అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతుంది. కానీ మీ శరీరంలో జింక్ లోపం ఉంటే అది రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుందని గుర్తుంచుకోండి.

ఇలా నివారించాలి: జింక్ లోప నివారణకు శనగలు, గింజ ధాన్యాలు, పుచ్చగింజలు, జనపనార గింజలు, ఓట్స్, జీడిపప్పు, పెరుగు, డార్క్ చాకొలెట్లలో జింక్ పుష్కలంగా లభిస్తుంది కాబట్టి జింక్ లోపం ఉన్నవారు ఈ ఆహార పదార్థాలు తీసుకోవడం ఉత్తమం.

సినిమా

కన్నప్ప కథని కృష్ణంరాజు ఇచ్చారు - మోహన్‌బాబు



ప్రీతి, విష్ణు, శరత్ కుమార్, మోహన్‌బాబు, ముఖేష్ కుమార్

''కన్నప్ప' సినిమా ప్రారంభానికి ముందు కృష్ణంరాజుగారిని కలిశాను. విష్ణు కోసం 'కన్నప్ప' మూవీ తీయాలనుకుంటున్నానని చెప్పాను. ప్రభాస్ కోసం రాసుకున్న ఈ కథను ఆయన మాకు ఇచ్చారు'' అని నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతీ ముకుందన్ కీలక పాత్రల్లో నటించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై డా. మోహన్ బాబు నిర్మించారు. శుక్రవారం ఈ మూవీ టీజర్ రిలీజ్ వేడుకలో మోహన్‌బాబు మాట్లాడుతూ– ''కన్నప్ప' కేవలం భక్తి చిత్రమే కాదు.. అన్ని రకాల అంశాలుంటాయి. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం. మా టీమ్‌కి అందరి ఆశీస్సులు కావాలి'' అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ– ''2014లో 'కన్నప్ప' ప్రయాణం ప్రారంభమైంది. మోహన్‌బాబు గారు, విన్ని, వినయ్ ఇచ్చిన ప్రోత్సాహం, శివుడి అనుమతి వల్లే 'కన్నప్ప'ను తెరపైకి తీసుకురాగలిగాను. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ముందుకు వెళ్లాం. ఇకపై ప్రతి సోమవారం ఈ మూవీ నుంచి అప్‌డేట్ వస్తూనే ఉంటుంది'' అన్నారు. ''మనం దేవుడి దగ్గరకు వెళ్లి కోరికలు కోరతాం. కానీ ఏం కోరకుండా దేవుడికే నేత్రాలను సమర్పించారు కన్నప్ప. అలాంటి గొప్ప భక్తుడి కథను చెప్పాం'' అన్నారు ముఖేష్ కుమార్ సింగ్. ''కన్నప్ప' కేవలం సినిమా కాదు... మన చరిత్ర'' అన్నారు శరత్ కుమార్. మధుబాల, ప్రీతీ ముకుందన్ కూడా మాట్లాడారు.

నా ముందు సైలెంట్‌గా ఉండాలి!



శ్రీలీల

తెలుగు చిత్ర పరిశ్రమలో బిజీగా దూసుకెళుతున్నారు యంగ్ బ్యూటీ శ్రీలీల. ప్రస్తుతం నితిన్‌తో 'రాబిన్‌హుడ్', రవితేజ 'ఆర్‌టీ 75' (వర్కింగ్ టైటిల్) వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. కాగా శుక్రవారం (మే 14) శ్రీలీల బర్త్‌డే. ఈ సందర్భంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'రాబిన్‌హుడ్'లో ఆమె చేస్తున్న లేడీ బాస్ నీరా వాసుదేవ్ పాత్ర లుక్, టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''జ్యోతీ... సునామీలో టి సైలెంట్ ఉండాలి... నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి' అంటూ శ్రీలీల చెప్పిన డైలాగ్ టీజర్‌లో ఉంది. 'ఎక్స్‌ట్రాఆర్డినరీ మ్యాన్' (2023) చిత్రం తర్వాత హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'యునిక్ యాక్షన్, ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'రాబిన్‌హుడ్' రూపొందుతోంది. ఈ చిత్రంలో నితిన్ పాత్రకు శ్రీలీల పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. వారి పాత్రలు రాయడంలో వెంకీ కుడుముల స్పెషల్ కేర్ తీసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 20న మా సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

మీకు ఏం గుర్తొస్తుంది?



శ్రీవిష్ణు

'మగాడంటే మీకు ఏం గుర్తొస్తుంది' అని శ్రీవిష్ణు చెప్పే డైలాగ్‌తో 'శ్వాగ్' మూవీ టీజర్ రిలీజ్ అయింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఈ చిత్రంలో రీతూ వర్మ, మీరా జాస్మిన్, దక్ష నగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు కీలక పాత్రల్లో నటించారు. హసిత్ గోలి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమా నిర్మించారు. ఈ చిత్రంలోని అన్ని ప్రధాన పాత్రలను పరిచయం చేసిన మేకర్స్ శుక్రవారం టీజర్‌ని రిలీజ్ చేశారు. 'ఆడవాళ్లని ఏం అడుక్కోనక్కర్లేదు... మగవాడినే అనుసరించాలి. వంశాలైనా, ఆస్తులైనా, ఆడవాళ్లయినా..' అంటూ శ్రీవిష్ణు చెప్పే డైలాగులు ఈ టీజర్‌లో ఉన్నాయి. ''ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా 'శ్వాగ్' రూపొందింది. శ్రీవిష్ణు హిలేరియస్ రోల్‌లో కనిపించనున్నారు. త్వరలో సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

సింగమ్ వాయిదా



అజయ్ దేవగన్


ఈ దీపావళికి బాలీవుడ్ సింగమ్‌లా మరోసారి థియేటర్స్‌కు రానున్నారు అజయ్ దేవగన్. హిందీ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన 'సింగమ్ (2011), సింగమ్ రిటర్న్స్' (2014) తర్వాత హీరో అజయ్ దేవగన్, దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'సింగమ్ ఎగైన్'. అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, జాకీ ష్రాఫ్, కరీనా కపూర్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అజయ్ దేవగన్, జ్యోతిదేశ్ పాండే, రోహిత్ శెట్టి నిర్మిస్తున్న 'సింగమ్ ఎగైన్' చిత్రాన్ని తొలుత ఆగస్టు 15న విడుదల చేయాలనుకున్నారు. కానీ చిత్రీకరణ ఇంకా పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారట. దీపావళికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ లక్ష్యం అదే - రామ్‌గోపాల్ వర్మ



''చిత్ర పరిశ్రమలోకి రావాలనుకునే యువ ప్రతిభావంతులను ప్రోత్సహించడమే తమ 'ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్' లక్ష్యం'' అన్నారు దర్శక–నిర్మాత రామ్‌గోపాల్ వర్మ. శుక్రవారం విలేకరుల సమావేశంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''నా మొదటి సినిమా 'శివ' అప్పుడు నా గురించి ఎవరికీ తెలియదు. ఆ చిత్రం హిట్టవ్వడం వల్లే నేనెవరో అందరికీ తెలిసింది. మా నాన్న అన్నపూర్ణ స్టూడియోలో సౌండ్ ఇంజినీర్ కాబట్టి ఇండస్ట్రీలోకి వచ్చేందుకు నాకు వీలు దొరికింది. కానీ ప్రతిభ ఉండి నాలాగా ఇంకా ప్రపంచానికి తెలియాల్సిన వారు ఎందరో బయట ఉన్నారు. అలాంటి వారికి ఇండస్ట్రీతో ఒక యాక్సెస్ ఇచ్చే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కాంటెస్ట్ ఆర్జీవీ యువర్ ఫిల్మ్. ఈ కాంటెస్ట్‌కి వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 400 ఎంట్రీలు వచ్చాయి. వీటిలో 11 షార్ట్ ఫిలింస్‌ని ఎంపిక చేశాం. వీటిని సోషల్ మీడియాలో పోల్‌కు పెట్టి ప్రేక్షకులు ఎక్కువ మంది బెస్ట్ డైరెక్టర్‌గా ఓటు వేసిన వారికి మా సంస్థలో చాన్స్ ఇస్తాం. డైరెక్టర్స్ అనే కాదు కెమెరా, మ్యూజిక్ డైరెక్షన్ ఇలా.. ప్రతి క్రాఫ్టులో ప్రతిభ ఉన్నవారిని ఎంపిక చేస్తున్నాం. సెలెక్ట్ అయిన వారి ప్రతిభను ముందుగా మా సంస్థలో ఉపయోగించుకోవాలనేది నా, నిర్మాత రవి స్వార్థం'' అన్నారు. నిర్మాత రవి కూడా పాల్గొన్నారు.

విశ్వంభరలో...



కునాల్ కపూర్

'విశ్వంభర' ప్రపంచంలోకి వచ్చాడు బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఇందులో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆషికా రంగనాథన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. అలాగే హిందీలో 'రంగ్ దే బసంతి, డాన్ 2, డియర్ జిందగీ' వంటి సినిమాల్లో నటించిన కునాల్ కపూర్ 'విశ్వంభర'లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రం వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... నాగార్జున, నాని కాంబినేషన్‌లో రూపొందిన 'దేవదాస్' (2018)లో కునాల్ నటించారు. నాలుగేళ్లకు తెలుగులో 'విశ్వంభర' కమిట్ అయ్యారు.

స్త్రీ సీక్వెల్ సిద్ధం



శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు

బాలీవుడ్ బాక్సాఫీస్ హిట్ ఫిల్మ్ 'స్త్రీ' సీక్వెల్ విడుదలకు సిద్ధమైంది. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ లీడ్ రోల్స్‌లో నటించిన కామెడీ హారర్ ఫిల్మ్ 'స్త్రీ'. అమర్‌కౌశిక్ దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'స్త్రీ 2' రూపొందింది. తొలి భాగంలో నటించిన రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్, పంకజ్ త్రిపాఠి, అభిషేక్ బెనర్జీ సీక్వెల్‌లోనూ నటించారు. అమర్ కౌశిక్‌యే దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, జ్యోతిదేశ్ పాండే ఈ సినిమాను నిర్మించారు. తొలుత 'స్త్రీ 2'ని ఆగస్టు 31న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. అయితే ఓ 15 రోజుల ముందే ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లుగా శుక్రవారం వెల్లడించారు.

స్పీల్‌బర్గ్ డైరెక్షన్‌లో...



ఎమిలీ బ్లంట్

'ది ఫాబెల్‌మ్యాన్స్' (2022) చిత్రం తర్వాత హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ తదుపరి చిత్రం గురించి ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే స్పీల్‌బర్గ్ తర్వాతి సినిమా గురించి అతి త్వరలోనే కొత్త కబురు వినిపించనుందని హాలీవుడ్ టాక్. హాలీవుడ్ ప్రముఖ నటి ఎమిలీ బ్లంట్ లీడ్ రోల్‌లో స్పీల్‌బర్గ్ ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నారట. ఈ సినిమా గురించి ఎమిలీతో చర్చించారట కూడా. త్వరలోనే ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందని టాక్. ఓ వాస్తవ ఘటన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను 2026 వేసవిలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారట స్పీల్‌బర్గ్.

బాల్యం గొప్పది



నటి, నిర్మాత నిహారిక కొణిదెల సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదు వంశీ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సాయికుమార్, సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, ప్రసాద్ బెహరా, రాధ్య, తేజస్వి రావు, టీనా శ్రావ్య, విషిక లీడ్ రోల్స్‌లో నటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని హీరో నితిన్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''యువత అయినా, పెద్దవాళ్లైనా ఏదో ఒక సందర్భంలో చిన్నతనమే బాగుందని అనుకుంటుంటారు. ఎలాంటి పొరపొచ్చాలు, అడ్డుగోడలు, బాధలు లేకుండా స్నేహితులతో కలిసి సరదాగా గడిపే బాల్యమే ఎంతో గొప్పది. ఈ పాయింట్ ఆధారంగా చేసుకుని నిర్మించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ప్రస్తుతం మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే మూవీ విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.